ఈనాడు eeYuva.com Learn. Share. Grow.
FASHION TRAVEL MOVIES FOOD GADGETS HEALTH SPORTS

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
కరీంనగర్ 11-7-2019 గురువారం సిటీ సంపుటి 45 సంచిక 332
రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మీరు కలలుకనే ఉద్యోగాల కోసం
ఈనాడు APPOINTMENTS
ప్రతీ మంగళవారం & శుక్రవారం

- సెమీఫైనల్లో కివీస్ చేతిలో భారత్ ఓటమి
- జడేజా అద్భుత పోరాటం వృథా

కల చెదిరింది.. కథ ముగిసింది. కప్పు ఖాయమని ధీమాతో ఉన్న కోట్ల మంది అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తూ.. కోహ్లీసేన క్రికెట్ ప్రపంచకప్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. అద్భుత ప్రదర్శనతో లీగ్‌లో అగ్రస్థానం సాధించిన భారత్.. అసలు పరీక్షలో విఫలమైంది. బుధవారం సెమీఫైనల్లో 18 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. టాప్ ఆర్డర్ (రోహిత్ 1, రాహుల్ 1, కోహ్లి 1) చేతులెత్తేయడం జట్టును ఘోరంగా దెబ్బతీసింది. చివర్లో ధోని (50) అండతో జడేజా (77) చేసిన అద్భుత పోరాటం వృథా అయింది. 240 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 49.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. ఓ దశలో 92కే 6 వికెట్లు చేజారగా.. ధోని- జడేజా 116 పరుగులు జోడించి ఆశలు రేపారు. కానీ విజయానికి భారత్ కొద్ది దూరంలో నిలిచిపోయింది.

...వివరాలు స్పోర్ట్స్‌లో

ఖమ్మం కుతకుత

పదేళ్లలో ఎన్నడూ లేనంత ఎండలు

- వరుసగా రెండు రోజులు అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు
- అత్యధికంగా 40 డిగ్రీలు

ఈనాడు, హైదరాబాద్ : నిండు వానాకాలంలో ఎండలు మండిపోతున్నాయి. ఖమ్మంలో బుధవారం 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గత పదేళ్ల జులై నెల అత్యధిక ఉష్ణోగ్రత ఈ నగరంలో 2016 జులై 16న 36.6 డిగ్రీలుగా వాతావరణ శాఖ రికార్డుల్లో ఉంది. ఈ రికార్డు పటాపంచలై తొలుత మంగళవారం 38.2 డిగ్రీలుగా కొత్త రికార్డు నమోదైంది. ఒక్కరోజులోనే అది కూడా చెరిగిపోయి బుధవారం 40 డిగ్రీలకు చేరింది. తెలంగాణ రాష్ట్రంలో ఏ పట్టణంలోనైనా సరే గత పదేళ్ల జులై నెల అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు నల్గొండలో 2014 జులై 2న 40.4 డిగ్రీలుంది. దానికి దగ్గరగా ఖమ్మంలో 40 డిగ్రీలకు బుధవారం చేరడంతో ఎండలు మండిపోయాయి. ఈ నగరంలో ప్రస్తుత సమయంలో సాధారణంగా పగటి ఉష్ణోగ్రత 32.5 డిగ్రీలకు

...మిగతా 2లో

సమూల ప్రక్షాళన

మూడు నెలల్లో మార్పు చూడబోతున్నాం

- లంచాలు లేని పాలన.. ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం
- దృఢచిత్తంతో కొత్త విధానాల రూపకల్పన
- నూతన పుర చట్టం, ఇతర అంశాలపై సమీక్షలో సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: అవినీతిని సమూలంగా నిర్మూలించడం, ఏ మాత్రం లంచాలు ఇచ్చే అవసరం లేకుండా.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే నగర (అర్బన్), రెవెన్యూ, గ్రామీణ విధానాలను దృఢచిత్తంతో రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. కొత్త విధానాలు, నూతన పురపాలక చట్టం, ఇతర అంశాల మీద సీఎం కేసీఆర్ బుధవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గ్రామ స్వరాజ్యం కాంక్షతో పటిష్ఠమైన కొత్త పంచాయతీరాజ్ చట్టం తెచ్చాం. దీంతో గ్రామాల అభివృద్ధి సాగుతోంది.. మూడు నెలల్లో మార్పు చూడబోతున్నాం. ఇప్పుడు అవినీతిని అరికట్టే దిశగా తెలంగాణ నూతన పురపాలక చట్టం ఉండాలి. ప్రభుత్వం నుంచి ఉత్తమ విధానాలు రావాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితోనే కొత్త పుర చట్టం రావాలి. ప్రజల అవసరాలను తీర్చే విధంగా, వారి బాగోగులు చూసుకునే రీతిలో, పట్టణాల అభివృద్ధి క్రమపద్ధతిలో జరగాలి. పుర చట్టాన్ని రూపొందించిన తర్వాత దానిపై అవగాహనకు పురపాలక కమిషనర్లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల మేలు కోసం కఠిన నిర్ణయాలుంటాయి.

...మిగతా 2లో

తహసీల్దార్ ఇంట్లో రూ.93 లక్షలు

తహసీల్దార్ వి.లావణ్య

నగదు పట్టుకున్న అనిశా అధికారులు

- ఒక ప్రభుత్వ అధికారి ఇంట్లో గత పదేళ్లలో ఇంత సొమ్ము దొరకడం ఇదే తొలిసారి 2లో
- లంచం తీసుకుంటూ చిక్కిన వీఆర్వో
- ఆయన ఇచ్చిన సమాచారంతో తహసీల్దార్ లావణ్య ఇంట్లో సోదాలు
- ఇద్దరిపై కేసు నమోదు.. వీఆర్వో అనంతయ్య అరెస్ట్

వీఆర్వో అనంతయ్య

'కన్నెపల్లి' నాలుగో పంపు ప్రారంభం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంపులు గత అయిదు రోజులుగా గోదావరి జలాలను గ్రావిటీ కాలువలోకి ఎత్తిపోస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజినీర్లు వరుస క్రమంలో ఉన్న నాలుగో పంపును ప్రారంభించడంతో 8 పైపుల నుంచి నీరు గ్రావిటీ కాలువలోకి చేరింది. పంపులకు విశ్రాంతినిచ్చేలా అప్పుడప్పుడు ఒకటి రెండింటిని నిలుపుదల చేసి, మిగతావి నడిచేలా ఏర్పాట్లు చేశారు. దీంతో అన్నారం బ్యారేజీకి నీరు భారీగా చేరుకుంటోంది. గ్రావిటీ కాలువ ద్వారా వెళ్లిన జలాలు అన్నారం బ్యారేజీకి ఎగువన గల అండర్ టన్నెల్ ద్వారా గోదావరిలోకి ప్రవేశిస్తున్నాయి. వరుస క్రమంలో ఉన్న అయిదో పంపును గురువారం నడిపించనున్నారు.

–న్యూస్‌టుడే, కాళేశ్వరం

పక్కా వ్యూహంతో పాగా వేద్దాం!

- పుర ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపే తెరాస లక్ష్యం
- కేటీఆర్ వ్యూహరచన.. నేతలతో సమాలోచనలు
- నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అభ్యర్థుల ఎంపిక!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో త్వరలో జరగనున్న పురపాలక సంఘాల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవాలని తెరాస లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆధ్వర్యంలో ఈ మేరకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఎన్నికల సన్నాహాలపై కేటీఆర్ బుధవారం ముఖ్యనేతలతో విస్తృతంగా చర్చించారు. పుర పోరును పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఎనిమిది నెలల్లో తెరాస వరుస ఎన్నికల్లో పాల్గొంది. శాసనసభ, పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కినా.. ఆశించిన ఫలితాలు రాలేదు.

...మిగతా 2లో

కొత్త రైలు ఒక్కటీ లేదు

పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ పాత కేటాయింపులే 2లో

తెలుగు రాష్ట్రాలకు నిరాశ

రైళ్లలో అదనంగా 4 లక్షల బెర్తులు

అక్టోబరు నుంచి అందుబాటులోకి

కొత్త సాంకేతికతతో ప్రయాణికులకు సౌలభ్యం 15లో

జల వివాదాల పరిష్కారానికి ఇక ఒకే ట్రైబ్యునల్

అంతర్రాష్ట్ర జల వివాదాల సవరణ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

త్వరలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన-3

ఐదేళ్లలో 1.25 లక్షల కిలోమీటర్ల రోడ్లు వేయాలని సంకల్పం

చిన్నారులపై తీవ్ర లైంగిక నేరాలకు పాల్పడితే మరణశిక్ష

కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు 15లో

మండలి ఛైర్మన్ ఉత్తర్వులు చట్టబద్ధమే

రాములునాయక్, యాదవరెడ్డిల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు 6లో

కరీంనగర్ గొర్రెలు కన్పించడం లేదు!

గొర్రెల అభివృద్ధి పథకంలో కొనుగోల్‌మాల్

- కరీంనగర్ జిల్లాలో అనుమతి లేకుండా రూ.7.50 కోట్ల విలువైన గొర్రెల కొనుగోలు
- అందులో 85 శాతం జీవాల జాడ లేదు
- నిధుల కోసం లేఖ రాయడంతో విషయం వెలుగులోకి
- అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి కలెక్టర్ లేఖ

ఈనాడు – హైదరాబాద్

ఆవు బొమ్మ వేయాల్సిందిగా ఓ చిత్ర లేఖనం మాస్టారు తరగతి గదిలోని విద్యార్థికి సూచిస్తాడు. కాసేపటి తర్వాత సదరు విద్యార్థి తాను గీసిన కాగితాన్ని మాస్టారుకు ఇస్తాడు. అది ఖాళీగా ఉండటంతో ఆయనకు చిర్రెత్తుకొస్తుంది. 'ఆవు ఏదిరా అంటూ' బెత్తమెత్తుతాడు. "నేను వేశానండీ..మీరు చూసే సరికి మేతకు వెళ్లినట్టుంది" అని సమాధానమివ్వడంతో మాస్టారు కోపం నషాళానికంటుతుంది. అయినా తమాయించుకుని 'మరి మేత ఏదిరా' అని ప్రశ్నించగా 'ఆవు తినేసినట్టుందండీ' అనే సమాధానం రావడంతో అవాక్కవడం ఆయన వంతవుతుంది. ఇది ఓ సినిమాలో సన్నివేశం. ఎంతో ఉదాత్తమైన ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ పథకం వాస్తవ పరిస్థితి అచ్చు గుద్దినట్టు ఇలాగే ఉంది. కరీంనగర్ జిల్లాలో ఈ పథకంలో అవకతవకలు జరిగాయనే అనుమానంతో విచారణకు వెళ్లిన అధికారులకు దాదాపు ఇదే అనుభవం ఎదురైంది.

★ ★ ★

గొర్రెల పెంపకం దారులకు మరింత ఆదాయం సమకూర్చడం, మాంసం ఎగుమతులు పెంచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం గొర్రెల అభివృద్ధి పథకం అమలు చేస్తోంది. ఈ పథకంలో ఒక్కో యూనిట్ కింద 21 గొర్రెలను లబ్ధిదారులకు

...మిగతా 2లో

అధికారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి కలెక్టర్ లేఖ

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో గుర్తించిన మీదట బాధ్యుడైన పశుసంవర్ధక శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ నవాజ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో నిర్వహించిన దర్యాప్తు తాలూకు నివేదికను కూడా ఆయన లేఖకు జతచేసినట్టు, చెల్లింపులను నిలుపుదల చేయాలని లేఖలో కోరినట్టు తెలిసింది. జిల్లా కలెక్టర్ నుంచి పక్షం రోజుల క్రితమే నివేదిక అందినా ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకునేందుకు సాహసం చేయకపోవటం పశుసంవర్ధక శాఖలో చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారికి ఓ మంత్రి అండదండలున్నాయని, ఆ ధైర్యంతోనే సదరు అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. చర్యల సంగతటుంచి ఆయన నయానాభయానా నిధులు విడుదల చేయించుకునే దిశగా ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

కొత్త రైలు ఒక్కటీ లేదు

ఈనాడు - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ పూర్తిస్థాయి బడ్జెట్ రైల్వే పరంగా తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నిరాశ కలిగించింది. దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు చేసిన కేటాయింపులు, ఇచ్చిన ప్రాధాన్యం చూస్తే అటు నిపుణుల అంచనాలు, ఇటు ప్రయాణికుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఒక్కటంటే ఒక్క నూతన లైను ప్రకటించలేదు. కొత్త రైళ్ల ఊసేలేదు. ఉన్న ప్రాజెక్టులకు నిధులు పెంచలేదు. తాత్కాలిక బడ్జెట్‌లో ఇచ్చిన నిధులనే తిరిగి కేటాయించారు. ఒకే ఒక్క కొత్త సర్వే మంజూరైంది. కాపలా లేని గేట్ల తొలగింపు.. రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్యూబీ), రోడ్ ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ)ల పనులకు

మాత్రం నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో దేశవ్యాప్తంగా రైల్వేశాఖకు మూలధన వ్యయం రూ.1.60 లక్షల కోట్లు ఉంటుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ సాయంగా రూ.65,387 కోట్లు ఇస్తామని ప్రకటించారు. జోన్ల వారీగా నిధుల కేటాయింపులు, కొత్త లైన్ల మంజూరు తదితర అంశాలకు సంబంధించిన 'పింక్‌బుక్'ను బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఆ వివరాలను దక్షిణమధ్య రైల్వే సాయంత్రం ప్రకటించింది. ఫిబ్రవరి 1న ప్రకటించిన తాత్కాలిక బడ్జెట్‌తో పోలిస్తే పూర్తిస్థాయి బడ్జెట్‌లో ద.మ.రైల్వేకు అదనంగా దక్కింది విజయవాడ, గుంటూరు బైపాస్; బీదర్- నాందేడ్ మధ్య కొత్త లైను మాత్రమే.

బీదర్- నాందేడ్ మధ్య కొత్త లైను

దూరం: 155 కిమీ

అంచనా వ్యయం: రూ.5,152 కోట్లు

.. కొత్తగా మంజూరు చేసిన ఈ మార్గం కర్ణాటక రాష్ట్రం పరిధిలోకి వస్తుంది.

తెలంగాణకు కొత్త ప్రాజెక్టు, కొత్త సర్వే ఏవీ మంజూరు కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైలు మార్గాన్ని అనుసంధానించే కొత్త ప్రాజెక్టు ప్రస్తావన కూడా లేదు.

- ముఖ్యమైన లైన్లకు 2019-20 తాత్కాలిక బడ్జెట్‌లో కేటాయింపులను పూర్తిస్థాయి బడ్జెట్ అంకెలతో పోల్చి చూసినప్పుడు అక్కనపేట-మాదన్నపేట, నడికుడి-శ్రీకాళహస్తికి తప్పిస్తే వేరేవాటికి సంబంధించిన కేటాయింపుల్లో మార్పులేవు. నడికుడి లైన్‌కు కూడా కేటాయింపులు తగ్గాయి. గతంలో రూ.700 కోట్లు కేటాయిస్తే తాజాగా దానిని రూ.697 కోట్లు చేశారు. అక్కనపేట-మాదన్నపేట లైనుకు కేటాయింపులను మాత్రం రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచారు. కొత్త లైన్లు, డబ్లింగ్‌కు కూడా కేటాయింపుల్లో మార్పులేవు. ఇప్పటికే ఉన్న మార్గాల్లో రెండో లైను వేయడానికి రూ.1,905 కోట్ల నుంచి రూ.2,006 కోట్లకు పెంచారు. పట్టాల మార్పిడికి రూ.657 కోట్లను రూ.752 కోట్లు చేశారు.

కొత్తగా మంజూరైన పనుల్లో అధిక నిధులు కేటాయించినవి..

- రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రూ. 1,091 కోట్లు
- రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 400 కోట్లు
- రోడ్ ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి (స్వర్ణ చతుర్భుజి మార్గాల్లో) నిర్మాణాలకు రూ. 490 కోట్లు
- గూడ్సు లూప్‌లైన్లు, అదనపు ప్లాట్‌ఫారాలకు రూ.176.17 కోట్లు

విజయవాడ, గుంటూరుకు బైపాస్

విశాఖపట్నం-చెన్నై మార్గంలో విజయవాడ, గుంటూరు స్టేషన్లకు బైపాస్ మార్గాల కోసం ట్రాఫిక్ సర్వే మంజూరు. విజయవాడ-మోటమర్రి లైన్‌ను.. విజయవాడ-గూడూరు మార్గంతో కలిపేలా ఈ రెండు లైన్ల మధ్యలో కొత్త మార్గం (20 కిమీ) కోసం సర్వే చేస్తారు.

భద్రతకు ప్రాధాన్యం

ద.మ.రైల్వేలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్- ఈ మూడు డివిజన్లతో విశాఖపట్నం కేంద్రంగా తూర్పుకోస్తా జోన్ ఏర్పాటు చేస్తామని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో కాజీపేట, ఏపీలో తిరుమల బాలాజీ డివిజన్లను కొత్తగా ఏర్పాటుచేయాలనే డిమాండ్లు బలంగా ఉన్నాయి. రైల్వే శాఖ మాత్రం కొత్త డివిజన్ల జోలికి వెళ్లలేదు. నిర్మాణంలో ఉన్న మార్గాల్ని పూర్తిచేయడానికే ప్రాధాన్యం ఇచ్చింది. కొత్త జోన్ తూర్పుకోస్తాకు నిధులు ఏమీ కేటాయించలేదు.

ఆనవాయితీని తప్పించిన రైల్వే

కేంద్ర బడ్జెట్‌లో రైల్వేశాఖకు కేటాయింపులపై ఏటా రైల్వేబోర్డు ఛైర్మన్ విలేకరుల సమావేశం పెట్టి వివరాలు వెల్లడించే ఆనవాయితీ ఉండేది. పేరుకు ఇది పూర్తిస్థాయి బడ్జెట్ అయినా కేటాయింపులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు పరంగా చెప్పుకోదగ్గ అంశాలేవీ లేకపోవడంతో రైల్వేశాఖ గతంలో మాదిరి కాకుండా ఈసారి కేవలం ఒక పత్రికా ప్రకటనతో సరిపెట్టింది. రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ఉన్నప్పుడు పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజే సాయంత్రం కల్లా కొత్త రైళ్లు, కొత్త లైన్ల మంజూరుకు సంబంధించిన అన్ని వివరాలు తెలిసేవి. కేంద్ర బడ్జెట్‌లో కలిపేశాక మూడు, నాలుగు రోజుల తర్వాత గానీ ఆ వివరాలు వెల్లడించడం లేదు.

తెరాస పార్లమెంటరీ పార్టీ సమావేశంలో డీఎస్ (వృత్తంలో)

తెరాస సమావేశానికి డీఎస్

- పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరు
- గ్రూపులో సంక్షిప్త సందేశం చూసి వచ్చారు : ఎంపీలు
- పార్టీకి ఏనాడూ దూరం కాలేదు : ధర్మపురి

ఈనాడు, దిల్లీ, హైదరాబాద్: కొద్ది కాలంగా తెరాసకు దూరంగా ఉంటున్న రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) బుధవారం నిర్వహించిన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష సమావేశానికి హాజరు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఒకానొక దశలో ఆయనపై బహిష్కరణ వేటు వేస్తారని ప్రచారం కూడా జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో డీఎస్ కుమారుడు అర్వింద్ నిజామాబాద్ భాజపా అభ్యర్థిగా బరిలో దిగి సీఎం కుమార్తె కవితపై విజయం సాధించారు. దీంతో డీఎస్, తెరాస బంధం పూర్తిగా తెగిపోయినట్లేనని అంతా భావించారు. తాజాగా డీఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరు కావడం అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. సమావేశానికి హాజరుకావాలనే సమాచారం అందడంతోనే తాను వచ్చినట్లు డీఎస్ విలేకరులకు తెలిపారు. తాను తెరాసకు ఏనాడూ దూరం కాలేదని ఆయన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. మరోపక్క డీఎస్ హాజరు కావడంపై పార్టీ అధిష్ఠానం ఆరా తీసినట్లు తెలిసింది. సమావేశం ఉన్నట్లు పార్టీ కార్యాలయ సిబ్బంది ఎంపీల గ్రూపులో పెట్టిన సంక్షిప్త సందేశాన్ని చూసి డీఎస్ సమావేశానికి హాజరైనట్లుగా భావిస్తున్నామని తెరాస ఎంపీలు అధిష్ఠానానికి వివరించినట్లు తెలిసింది. ఆయనతో ఎవరూ మాట్లాడలేదని, తేనీటిని సేవించి సమావేశం నుంచి ఆయనే వెళ్లిపోయారని ఎంపీలు వెల్లడించినట్లు సమచారం.

రాష్ట్ర ప్రయోజనాల సాధనే లక్ష్యం

రాష్ట్ర ప్రయోజనాల సాధనే లక్ష్యంగా లోక్‌సభ, రాజ్యసభల్లో ఎంపీలు పని చేయాలని తెరాస పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్ణయించింది. పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో.. వివిధ బిల్లులు, అంశాలపై లోతైన అధ్యయనం, సమగ్ర వివరాలతో చర్చకు హాజరుకావాలని నిర్ణయించారు. మరింత మెరుగైన పనితీరుకు సహకారం అందించేలా పార్లమెంటరీ పార్టీ కార్యాలయాన్ని మార్చుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో తెరాస లోక్‌సభాపక్ష ఉప నేత కొత్త ప్రభాకర్‌రెడ్డి, లోక్‌సభ సభ్యులు డాక్టర్ వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం రంజిత్‌రెడ్డి, పి.రాములు, బీబీ పాటిల్, పసునూరి దయాకర్ , రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్, డీఎస్ పాల్గొన్నారు.

ఆదాయంలో దక్షిణ మధ్య రైల్వే నంబర్ 1

ఈనాడు, దిల్లీ: దేశంలోని 17 రైల్వే జోన్లలో అన్నింటికంటే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్న జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే రికార్డు సృష్టించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.18,043 కోట్ల ఆదాయాన్ని నమోదుచేసి దేశంలో మిగతా వాటికంటే మిన్నగా నిలిచింది. దేశంలోని అన్ని రైల్వే జోన్లు 2017-18లో 8.1%, 2018-19లో 6.3% వృద్ధి నమోదుచేయగా, దక్షిణ మధ్య రైల్వే ఇదే సమయంలో 11.9%, 10.4% ఆదాయ వృద్ధి సాధించింది. దక్షిణ మధ్య రైల్వే తర్వాత అత్యధిక ఆదాయం సాధించిన జోన్‌గా వాల్తేర్ డివిజన్ ఉన్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే నిలిచింది. 2018-19లో ఈ జోన్ రూ.17,671.16 కోట్లు సముపార్జించింది. రైల్వే మంత్రి పీయూష్‌గోయెల్ లోక్‌సభలో ఈ వివరాలు వెల్లడించారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రతిపాదన లేదని గోయెల్ స్పష్టంచేశారు.

సమూల ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సాధనలో స్థిరమైన ప్రయాణం చేశాం. అనుకున్నది సాధించాం. అధికారంలోకి వచ్చిన తర్వాత పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి విజయవంతంగా అమలు చేశాం. అన్నింటికన్నా ముఖ్యమైన మంచినీటి, సాగునీటి, విద్యుత్ సమస్యలను అధిగమించాం. ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తూ అన్ని ఎన్నికల్లో గెలిపిస్తున్నారు. వారి రుణం తీర్చుకుంటాం'' అని చెప్పారు. సమీక్షా సమావేశంలో సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, కమిషనర్ శ్రీదేవి, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, కామారెడ్డి కలెక్టర్ ఎన్.సత్యనారాయణ, సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి, పురపాలక శాఖ మాజీ ఉన్నతాధికారి డీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ పేరుతో ఫ్రెంచ్-స్విస్ కళాకారుడు సైపే సృష్టించిన అద్భుతమిది. 2.5 చదరపు మీటర్ల ఈ చిత్రం కోసం ఆయన నాలుగు రోజులపాటు శ్రమించారు. ఆల్ప్ పర్వత శ్రేణుల్లోని పోర్టెస్ డి సొలెయిల్ దగ్గర స్విట్జర్లాండ్ వైపున ఉన్న లెస్‌కోర్టెస్‌లో ప్రకృతిలో కలిసిపోయే ద్రవ్యాలను ఉపయోగించి దీనిని తీర్చిదిద్దారు. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌ల స్నేహానికి ప్రతీకగా రూపొందించిన ఈ చిత్రం కోసం బొగ్గు, సుద్ద, నీరు, వెన్న తదితర ద్రవ్యాలతో తయారు చేసిన వెయ్యి లీటర్ల ద్రావణాన్ని ఉపయోగించారు.

పక్కా వ్యూహంతో పాగా వేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పట్టణాలు, నగరాల్లో తెరాసకు కొంత మెజారిటీ తగ్గింది. వీటన్నింటినీ విశ్లేషిస్తూ.. స్థానిక ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకొని పురపాలక ఎన్నికలకు పక్కా వ్యూహాన్ని కేటీఆర్ రూపొందించినట్లు తెలిసింది.

అధిష్ఠానం ఆధ్వర్యంలోనే ఎంపిక..

పురపాలక ఎన్నికలకు ఈ నెల 15న నోటిఫికేషన్ వెలువడుతుందని అంచనా వేస్తున్నారు. 15 నుంచి 20 తేదీల మధ్యలో తెరాస రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే ఈ భేటీలో ఎన్నికలపై ఆయన దిశానిర్దేశం చేస్తారు. పార్టీ వ్యూహాన్ని వెల్లడిస్తారు. ఆ వెంటనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నడుస్తుంది. పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల అభ్యర్థులను అధిష్ఠానమే ఖరారు చేయనుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ బాధ్యుల ఆధ్వర్యంలో ఉమ్మడి కమిటీని వేస్తారు. ఆశావహుల పేర్లను తీసుకుంటారు. ఈ జాబితా అధిష్ఠానం వద్దకు చేరుతుంది. ఆయా అభ్యర్థుల గురించి అధిష్ఠానం ఆరా తీస్తుంది. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో సర్వేలను నిర్వహిస్తారు. వీటిని ప్రామాణికంగా తీసుకొని అన్నివిధాలా అర్హులైన వారిని ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

విస్తృత ప్రచారం...

పుర, నగర పాలక ఎన్నికలపై ఈ నెల 15 నుంచి తెరాస ఎన్నికల ప్రచారం ప్రారంభించనుంది. కేటీఆర్ ఎన్నికలు జరిగే అన్ని నగరపాలక సంస్థలతోపాటు ప్రధాన పురపాలక సంఘాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. పురపాలక సంఘాలవారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ప్రచారం నిర్వహిస్తారు. వార్డులవారీగా బాధ్యతలను ముఖ్యనేతలకు అప్పగిస్తారు. ప్రచారంలో సామాజిక మాధ్యమాలను పెద్దఎత్తున వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రచార బృందాన్ని నియమిస్తారు.

కరీంనగర్ గొర్రెలు కన్పించడం లేదు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అందజేస్తోంది. ఒక్కో యూనిట్ విలువను రూ.1.25 లక్షలుగా నిర్ధారించారు. నిబంధనల మేరకు నిధులు విడుదల చేసిన తర్వాతే జీవాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లాలో మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. పోనీ గొర్రెలైనా ఉన్నాయా? అంటే అదీ లేదు.

600 యూనిట్లు కొన్నాం.. నిధులివ్వండి

ఈ పథకంలో భాగంగా ఒక్క యూనిట్ కొనుగోలు చేయాలన్నా ముందస్తుగా కలెక్టరు నుంచి అనుమతి తీసుకోవాలి. గొర్రెల రవాణా, దాణా కోసం కేటాయించిన నిధులు వినియోగించాలన్నా అనుమతి తప్పనిసరి. కరీంనగర్ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా 12,600(ఆరు వందల యూనిట్లు) గొర్రెలు కొనుగోలు చేశారు. ఆ తరవాత నిధులు విడుదల చేయాల్సిందిగా కలెక్టర్‌కు లేఖ రాయటంతో ఆయన అవాక్కయ్యారు. రూ.7.50 కోట్ల విలువైన యూనిట్లను అనుమతి లేకుండా ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చింది? అంత సొమ్ము ఎక్కడిది? నిజంగా కొనుగోలు చేశారా? లేదా? ఆ పేరుతో సొమ్ములు దారిమళ్లించే ప్రయత్నం చేస్తున్నారా? అని తెలుసుకునేందుకు కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

80 శాతం క్షేత్ర స్థాయిలో లేవు

విచారణలో భాగంగా గొర్రెలు అందుకున్న లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు వెళ్లారు. పంపిణీ చేసిన సంఖ్యకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాటికి పొంతన లేకపోవటంతో కంగుతిన్నారు. జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసిన గొర్రెల్లో 80 శాతం లబ్ధిదారుల వద్ద లేవని విచారణలో తేల్చారు. ఆ గొర్రెలు ఏమయ్యాయిని తాము ప్రశ్నించగా 'వలస వెళ్లాయని లబ్ధిదారులు చెప్పారని' అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. మొత్తంగా పంపిణీ చేసిన గొర్రెల్లో 17.5 శాతం మాత్రమే లబ్ధిదారుల వద్ద ఉన్నాయని, 2.5 శాతాన్ని తామే విక్రయించినట్లు లబ్ధిదారులు అంగీకరించారని నివేదికలో పొందుపరిచారు. ఉన్న గొర్రెల చెవులకు వేసిన బిళ్లలు(ట్యాగ్స్) కూడా లేవని గుర్తించినట్టు పేర్కొన్నారు.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

గాజు కంటే అల్పం!

ఈ భూమ్మీద మన జీవితం ఆడవారి చేతులకున్న మట్టి గాజుల కంటే కూడా అల్పమైనది! అందుకే ముందు మన ప్రాణావసరాలను చూసుకుందాం. ఆ తర్వాతే అలంకరణలూ, ఆభరణాల వంటివన్నీ!

– మహాత్మా గాంధీ

ఖమ్మం కుతకుత

(మొదటి పేజీ తరువాయి)

మించరాదని వాతావరణశాఖ వెల్లడించింది. అంతకన్నా ఏకంగా 7.5 డిగ్రీలు అదనంగా పెరగడం గమనార్హం. ఉష్ణోగ్రత సాధారణంకన్నా 5 డిగ్రీలకు మించి అదనంగా పెరిగితే అక్కడ అసాధారణ మార్పులున్నట్లుగా వాతావరణ శాఖ పరిగణిస్తుంది. రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉండటం వల్ల ఆకాశం నిర్మలంగా ఉంటోందని వాతావరణశాఖ సంచాలకుడు వై.కె.రెడ్డి తెలిపారు. మేఘాలు లేనందున సూర్యకిరణాలు నేరుగా భూమికి చేరుతుండటంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో బుధవారం పగలు 336 ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా దిగ్వాల్‌లో 36, బుర్దిపాడ్‌లో 26.3, ధారూర్‌లో 23, జన్నారంలో 22.8, బిజినేపల్లిలో 21.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఇదే స్థాయిలో గాలులతో కూడిన ఒక మాదిరి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

గ్రహం అనుగ్రహం

11-7-2019 గురువారం

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం గ్రీష్మ రుతువు; ఆషాఢ మాసం; శుక్ల పక్షం

దశమి: తె.3.38 తదుపరి ఏకాదశి

స్వాతి నక్షత్రం: రా.7.19 తదుపరి విశాఖ

అమృత ఘడియలు: ఉ.10.52 నుంచి 12.24 వరకు

వర్జ్యం: రా.12.46 నుంచి 2.19 వరకు

దుర్ముహూర్తం: ఉ.9.54 నుంచి 10.45 తిరిగి మ.3.04 నుంచి 3.56 వరకు

రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు

సూర్యోదయం: ఉ.5-35; సూర్యాస్తమయం: సా.6.32

మేడిగడ్డ బ్యారేజీ గేట్ల మూసివేత

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీ గేట్లను ఇంజినీరింగ్ అధికారులు విడతల వారీగా మూసివేస్తున్నారు. మొత్తం 85 గేట్లకు మంగళవారం 51 మూసివేయగా బుధవారం రాత్రి 19 మూసివేశారు. మిగతా గేట్లను నీటి ప్రవాహాన్ని బట్టి మూసివేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ వద్ద 91.6 మీటర్ల మేర నీటి ప్రవాహం ఉంది.

S.I & కానిస్టేబుల్స్
ఇసాక్ సార్ ఆధ్వర్యంలో
SUNDAY DEMO 14-7-19 9 a.m.
Separate Batch for TM/EM
G.S / Group-2 Faculty చే బోధించబడును
ఆర్యభట్ట ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోలీస్
3rd Floor, Near Signals, Above ANDHRA BANK, DSNR, HYD.
6305056616 / 6305054993

గురుకుల టీచర్స్ నమోదయ TET TM EM
TGT/PGT/PET/LIBRARIANS Paper - I&II
S.I/కానిస్టేబుల్స్ TM EM
FREE DEMO: 14-07-2019 at 10.00 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE
Opp: Konark Theatre Dilsukhnagar, Hyd
Cell :8885555202 9246208422

తహసీల్దార్ ఇంట్లో రూ.93 లక్షలు

ఈనాడు - హైదరాబాద్, కొందుర్గు, హయత్‌నగర్ - న్యూస్‌టుడే

లంచం సొమ్ము తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఒక వీఆర్వో ఇచ్చిన సమాచారం ఆధారంగా తహసీల్దార్ ఇంట్లో సోదాలు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ అధికారులకు అక్కడ ఏకంగా రూ.93 లక్షల నగదు కనిపించింది. ఒక ప్రభుత్వ అధికారి ఇంట్లో ఇంత భారీ ఎత్తున నగదు ఉండడం గడిచిన పదేళ్ల కాలంలో ఇదే తొలిసారని వారు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం దత్తాయపల్లికి చెందిన రైతు మామిడిపల్లి భాస్కర్ తన 9.07 ఎకరాల పొలానికి కేటాయించిన నంబరు సర్వే రికార్డుల్లో లేదంటూ రెండు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులిస్తే తప్ప పని జరగదంటూ కొందుర్గు వీఆర్వో అనంతయ్య చెప్పాడు. రూ.8లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అందులో తనకు రూ.ఐదు లక్షలు, తహసీల్దార్ లావణ్యకు రూ.3 లక్షలు అని చెప్పాడు. గత నెలలో రూ.30వేలు బయానాగా తీసుకున్నాడు. బయానా ఇచ్చిన భాస్కర్.. లంచం ఎందుకివ్వాలని తనకు తానే ప్రశ్నించుకున్నారు. కొద్దిరోజుల క్రితం అనిశా అధికారులకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్ ఇంట్లో లభించిన నగదు, ఆభరణాలు

వారి సూచనల మేరకు భాస్కర్ బుధవారం రూ.4లక్షలతో కేశంపేట తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. వీఆర్వో అనంతయ్యకు లంచం ఇస్తుండగా.. అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ వి.లావణ్య ఆదేశాల మేరకే తాను లంచం వసూలు చేస్తున్నానని అనంతయ్య చెప్పాడు. దీంతో హైదరాబాద్ అనిశా అధికారులు రాజధాని శివారు హయత్‌నగర్‌లోని లావణ్య ఇంటికి చేరుకున్నారు.

బాప్‌రే... రూ.93లక్షలా?

తహసీల్దార్ లావణ్య ఇంట్లో సోదాలు మొదలుపెట్టిన అధికారులు భారీ ఎత్తున నగదును చూసి ఆశ్చర్యపోయారు. మొత్తం రూ.93 లక్షలుగా లెక్కతేల్చారు. ఈ నగదుకు సంబంధించి వివరాలు కావాలని ఆమెను అడగ్గా... సమాధానం చెప్పలేదు. వీటితో పాటు బంగారు ఆభరణాలను 40 తులాలుగా గుర్తించారు. నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. లావణ్య.. 2016 నుంచి కేశంపేట తహసీల్దారు. ఆమె భర్త జీహెచ్ఎంసీలో సూపరింటెండెంట్. ఇంకా ఏవైనా అక్రమాలున్నాయేమోనని కేశంపేట తహసీల్దార్ కార్యాలయంలో అనిశా అధికారులు సాయంత్రం నుంచి రికార్డులను పరిశీలిస్తున్నారు. అనంతయ్యతో పాటు వి.లావణ్యపై కేసు నమోదు చేశామని అనిశా ఉప సంచాలకుడు రమణకుమార్ తెలిపారు. వీఆర్వోను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచాక జైలుకు తరలించారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	40.0	28.0
నెల్లూరు	40.0	30.0
తిరుపతి	40.0	27.2
నల్గొండ	39.4	25.0
ఒంగోలు	39.1	29.7
విజయవాడ	39.1	28.5
గుంటూరు	38.2	29.1
సూర్యాపేట	37.0	29.0
విశాఖపట్నం	36.0	28.4
రామగుండం	34.6	25.2
మహబూబ్‌నగర్	34.5	24.3
హైదరాబాద్	34.3	24.3
నిజామాబాద్	34.2	25.4
హన్మకొండ	34.0	25.0
ఆదిలాబాద్	32.3	23.5
కరీంనగర్	32.0	24.0

RENAULT
Passion for life

కొత్త Renault DUSTER
The true SUV

ఇప్పుడు మరింత
సాహసవంతం

రేంజ్
₹7.99 లక్షల# నుంచీ
మొదలు

Renault కారు కస్టమర్స్ అందరికీ ప్రత్యేకమైన లోయలిటీ బోనస్*
పెట్రోల్ మరియు డీసెల్ లో లభ్యం

కొత్త మిడ్‌నైట్ బ్లాక్ ఇంటీరియర్ హార్మొనీ

కొత్త R16 ఎవరెస్ట్ డైమండ్ కట్ అలోయ్ వీల్స్

కొత్త ప్రొజెక్టర్ హెడ్ ల్యాంప్స్ మరియు LED DRLs

కొత్త 17.64 CM టచ్ స్క్రీన్ MEDIANAV ఈకోగైడ్ తో

Android Auto is a trademark of Google LLC

EASY-R AMT AUTOMATED MANUAL TRANSMISSION

X-TRONIC CVT AUTOMATIC

4X4 AWD

RENAULT GANG OF DUSTERS OVER 1 LAKH STRONG

For further details, visit renault.co.in

For a test drive, SMS 'DUSTER' to 53030 or call on 1800 300 44444 (Open from Monday to Sunday, 7:00 am -11:00 pm). Select variants available in CSD. Special offers for Defence Personnel, Government, PSU and Corporate employees.

Terms and conditions apply. Model/accessories shown may not be a part of the standard fitment. # Price mentioned is for DUSTER Petrol RXE for Ex-showroom Hyderabad and is exclusive of taxes. *Loyalty bonus at sole discretion of Renault India. For further details, please check T&C on website. Additional offers available on select stocks only. The above mentioned offers are valid till 31st July, 2019. Due to printing limitation, the colour that appears in this advertisement may slightly differ from the actual print. Visit www.renault.co.in/offers for offer details and conditions on each model. Renault India Pvt. Ltd. reserves the right to change or modify the mentioned schemes and conditions without prior notice. Contact your nearest dealer for offer details and scheme validity. Benefits may vary across variants and cities. For detailed terms and conditions, please visit www.renault.co.in

SHOWROOMS: TELANGANA: KARIMNAGAR: RENAULT Karimnagar Mob: +91 9582305983. **MAHBUBNAGAR**: RENAULT Mahbubnagar Mob: +91 7799766431. **NIRMAL**: RENAULT Nirmal Mob: +91 8527232744.**KHAMMAM**: RENAULT Khammam Mob: +91 8527234093. **SIDDIPET**: RENAULT Siddipet Mob: +91 8527235114. **MANCHERIAL**: RENAULT Mancherial Mob: +91 9582571953. **WARANGAL**: RENAULT Warangal Mob: +91 9582230038.

LOK | SAATCHI & SAATCHI

ఈనాడు

సమగ్ర చికిత్సతోనే సాంత్వన

దేశంలో జనరిక్ మందుల లభ్యత, ఔషధ ధరల నియంత్రణ లపై పార్లమెంటులో ఎదురైన ప్రశ్నకు సంబంధిత శాఖామాత్యుల వివరణాత్మక సమాధానం, దిగ్భ్రాంతకర యథార్థాన్ని వెల్లడించింది. వైద్య చికిత్సకయ్యే వ్యయం, మందుల ఖర్చు అంతకంతకు పెరుగుతుండటంవల్ల ఏటా 75లక్షల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నట్లు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తాజా ప్రకటన స్పష్టీకరిస్తోంది. ఒక్కో కుటుంబంలో సగటున అయిదుగురు సభ్యుల్ని లెక్కేసినా- విపరీత వైద్యచికిత్సా వ్యయ భారం దేశంలో ప్రతి సంవత్సరం మూడుకోట్ల 75లక్షలమందిని దారిద్ర్యరేఖ దిగువకు నెట్టుకుపోతున్నట్లు ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్లయింది! సాధారణంగా అధికారిక అంచనాలు సమస్య వాస్తవిక తీవ్రతను ప్రతిబింబించని దృష్ట్యా, నికర బాధితుల సంఖ్య మరింతగా ఉండవచ్చు. కుటుంబ సభ్యులెవరైనా అనారోగ్యం పాలబడితే చికిత్స, మందుల నిమిత్తం ఖర్చులు భరించలేక దేశంలో ఏటా అయిదున్నర కోట్లమంది పేదరికంలో కూరుకుపోతున్నారన్నది- నిరుడు 'బ్రిటిష్ మెడికల్ జర్నల్'లో ప్రచురితమైన అధ్యయన సారాంశం. ఈ గడ్డమీద ప్రతి పౌరుడికీ జీవించే హక్కును రాజ్యాంగమే ప్రసాదించినా- పీల్చేగాలి, తినే తిండి, తాగేనీరు... దేనికదే విషతుల్యమై రకరకాల ఆరోగ్య సమస్యలు జనాన్ని ముట్టడిస్తున్నాయి. కొద్దిపాటి అస్వస్థత దాపురించినా అందుకు ఇదమిత్థ కారణమేమిటో నిర్ధారించే పేరిట వైద్య పుంగవులు రాసే లెక్కకు మిక్కిలి పరీక్షలు చేయించుకోలేక, తడిసిమోపెడవుతున్న ఖర్చుల్ని తప్పించుకోలేక అసంఖ్యాక కుటుంబాలు అప్పులపాలవుతున్నాయి. దురదృష్టవశాత్తు, కుటుంబంలో ఏ ఒక్కరికి దీర్ఘకాల వ్యాధి సోకినా మందుల రూపేణా నెలకు మూడు నాలుగువేల రూపాయల కనీస ఖర్చు దిగువ, మధ్యతరగతి వర్గీయుల సంసారాన్ని గుల్లబారుస్తోంది. ఈ దురవస్థ- ప్రజారోగ్య పరిరక్షణపరంగా ప్రభుత్వాల వ్యూహాల్లో సమూల మార్పు రావాల్సిన అత్యావశ్యకతను ఎలుగెత్తుతోంది.

యాంటీబయాటిక్స్ కొనుక్కోవడానికి పేదలెవరైనా రెండు రోజులపాటు పస్తులుండాల్సి వస్తోందని లోగడ సర్వోన్నత న్యాయస్థానమే చీత్కరించడం, ప్రభుత్వాల ప్రాథమ్య క్రమంలో తీవ్ర లోటుపాట్లను పట్టిచ్చేదే. గ్రామీణ వైద్యంలో 79శాతం మేర ఖర్చు ఔషధాల పద్దులోనే నమోదవుతుండగా- అందులో ఎక్కువ భాగం రోగులు సొంతంగా భరిస్తున్నదే. వైద్యావసరాలకోసం వెచ్చించే సొమ్ములో అంతర్జాతీయంగా ప్రజానీకం సొంత వ్యయం సగటున 18శాతం. ఇక్కడ 68శాతందాకా వైద్య ఖర్చును భారతీయులే నెత్తి కెత్తుకోవాల్సి రావడం- వారి జేబుల్ని బతుకుల్ని కాల్చేసి, కుటుంబ బడ్జెట్లను తలకిందులు చేస్తోంది. గ్రామీణులకు టెలీ వైద్య సేవలు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్, అందరికీ ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షల వసతి ప్రవేశపెట్టిన తెలంగాణ, బడుగు జనావళికి తక్షణ వైద్య సేవలు సమకూరుస్తున్న కేరళ వంటివి కొంతమేర రాణిస్తున్నా- తక్కిన చోట్ల కుటుంబ సభ్యులెవరు అస్వస్థులైనా అది వారికి ఆర్థికంగా పిడుగుపాటే అవుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ వైద్య సదుపాయాలు సవ్యంగా లేవంటూ జాతీయ మానవ హక్కుల సంఘంలో ఇటీవల నమోదైన ఫిర్యాదు- దేశవ్యాప్త దుస్థితిని చెప్పకనే చెబుతోంది! ఆరువేల రకాల మందులు అందుబాటులో ఉన్న ఇండియాలో సుమారు వెయ్యి ఔషధాల ధరలనే నియంత్రిస్తున్న ప్రభుత్వం, తద్వారా పేద రోగులపై రూ.11 వేల కోట్లకుపైగా భారాన్ని తగ్గించగలిగినట్లు ఆరేడు నెలల క్రితం సభాముఖంగా వెల్లడించింది. విరివిగా జనరిక్ ఔషధాల వినియోగం మూలాన దశాబ్దకాలంలో రూ.94 లక్షల కోట్ల మేర ఆదా చేయగలిగామన్న అమెరికా ప్రకటన వ్యూహకర్తల దృష్టికి రాలేదేమో! దేశంలో ఇప్పుడున్న సుమారు 5000 జన్ ఔషధి దుకాణాల సంఖ్యకు ఏడాదిలో ఇంకో 2500 జోడిస్తామంటున్న కేంద్రం- జనరిక్ మందులకు విశేష ప్రాచుర్యం కల్పించి సమధికంగా సరఫరాలు పెంపొందిస్తే ఎన్నో కోట్లమంది తెరిపిన పడతారు.

ప్రస్తుతం వేర్వేరు ఆరోగ్య పథకాల కింద రమారమి కోటి కుటుంబాలకు కల్పిస్తున్న వైద్య సేవల్ని సార్వజనీన స్వాస్థ్య సంరక్షణ పథకం గొడుగు కిందకు తీసుకురావాలని తెలంగాణ సర్కారు ప్రణాళికలు అల్లుతోంది. దేశవ్యాప్తంగా 'ఆయుష్మాన్ భారత్' రమారమి 50 కోట్లమందికి ఆరోగ్య బీమా రక్షణ ప్రసాదిస్తుందంటున్న కేంద్రం- బొటనవేలి ముద్రతో 15వేల ఆస్పత్రుల్లో ఎక్కడైనా సేవలు పొందవచ్చునని అభయమిస్తోంది. పథకాలు సిద్ధమైనా క్షేత్రస్థాయిలో నాణ్యమైన సేవలు తథ్యమన్న ధీమా ఏది? దేశంలో 30శాతం దాకా సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 20శాతానికిపైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఒక్క వైద్యుడితోనే నెట్టుకొస్తున్నట్లు ఇటీవలి ఆర్థిక సర్వే కుండ బద్దలుకొట్టింది. ఝార్ఖండ్‌లో 10శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 20శాతానికిపైగా పీహెచ్‌సీలు అసలు వైద్యుడు లేకుండానే నడిచిపోతున్నాయి! ఇంచుమించు 70 రకాల మందులుండాలని నిబంధనలు సూచిస్తున్నా- గాజు గుడ్డకు, జ్వరం గోళీలకు సైతం ఠికాణా లేని ఆరోగ్య కేంద్రాలెన్నో లెక్కేలేదు. సార్వత్రిక ఆరోగ్య రక్షణ పథకాలు అమలుపరుస్తున్న జర్మనీ, ఇటలీ, చైనా, గ్రీస్ వంటివి వైద్య సేవల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి పోటీపడుతున్నాయి. స్వీడన్, ఫ్రాన్స్, డెన్మార్క్ తదితరాలు స్థూల దేశీయోత్పత్తిలో ఎనిమిది శాతానికిపైగా నిధుల్ని ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేకిస్తుండగా- దేశీయ కేటాయింపులు జీడీపీలో ఒక టిన్నర శాతంలోపే పరిమితమవుతున్నాయి. ఇతోధిక బడ్జెట్ కేటాయింపులు, వైద్య సిబ్బంది నియామకాలు, తగినన్ని మౌలిక సదుపాయాలతో అన్ని అంచెల్లో ఆరోగ్య సేవలు పరిపుష్టమయ్యే వాతావరణంలోనే సామాన్య పౌరులకు సాంత్వన దక్కేది!

సమాచార భద్రత ప్రశ్నార్థకం

జపాన్‌లో ఇటీవల ముగిసిన జి-20 సదస్సులో సమాచార ప్రవాహం (డేటా ఫ్లో) మీద భారత్, అమెరికాలు భిన్న వైఖరులు ప్రదర్శించాయి. సమాచారాన్ని ఎల్లలు దాటించే సౌకర్యం తమ సంస్థలకు ఉండాలని అమెరికా పట్టుబడుతుంటే, తమ ప్రజల సమాచారాన్ని తమ గడ్డ మీదే భద్రపరచాలని భారత్ ఆశిస్తోంది. స్వేచ్ఛగా డేటా ప్రవాహం, సమాచార గోప్యత, మేధా హక్కులకు రక్షణ- ఈ మూడూ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో అమెరికా విజయానికి మూల స్తంభాలని ఒసాకాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటించారు. సమాచార బదిలీకి సంబంధించిన చర్చలన్నీ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) పరిధిలో జరగాలని భారత్ డిమాండ్ చేస్తోంది. డేటా అనేది వ్యక్తులకు, సంస్థలకు సంబంధించిన వివరాల రాశి. దాన్ని వినియోగార్థంగా మారిస్తే సమాచారం (ఇన్ఫర్మేషన్) అవుతుంది. పోనుపోను బిగ్‌డేటా విస్తృత ముడిసరకు కాబోతున్నందువల్ల తన పౌరుల డేటాను స్వదేశంలోనే భద్రపరచాలని భారత్ అంతర్జాతీయ సంస్థలను కోరుతోంది. దీన్ని డేటా స్థానికీకరణ అంటున్నారు.

సంతకానికి భారత్ నిరాకరణ

ఒసాకా సదస్సులో భారత విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే 'సంపద నవీన రూపమే డేటా' అని ఉద్ఘాటించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మారిపోతున్న అంతర్జాతీయ వాణిజ్య తీరుతెన్నులు ఆయన మాటలను బలపరుస్తున్నాయి. 2017లో ప్రపంచ వాణిజ్యంలో వస్తుసేవల వాటా 46 లక్షల కోట్ల డాలర్లు; అందులో సమాచారం వాటా క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2014నాటికే సీమాంతర డేటా ప్రవాహ విలువ 2.3 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. భారత ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గ్రహించే విదేశీ ఈ-కామర్స్ సంస్థలు, ఇంటర్నెట్ సంస్థలు ఇక్కడి డేటాను ఈ గడ్డపైనే భద్రపరచాలని పట్టుబడుతోంది. అందుకే సమాచార స్వేచ్ఛా ప్రవాహానికి ఉద్దేశించిన ఒసాకా ఒప్పందంపై సంతకం చేయడానికి భారత్ నిరాకరించింది. భారత్‌తో పాటు ఇండొనేసియా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా దీనిపై సంతకం చేయలేదు. డేటా స్థానికీకరణకు ఒక ప్రాతిపదికను ఏర్పరచే పనిని భారత్ ఇప్పటికే చేపట్టింది. వీసా, మాస్టర్ కార్డు వంటి విదేశీ చెల్లింపుల సంస్థలు భారతీయ ఖాతాదారుల వివరాలను 2018 అక్టోబరు 15కల్లా భారత గడ్డపై ఉన్న సర్వర్లలో భద్రపరచాలని రిజర్వుబ్యాంకు గత ఏప్రిల్‌లో ఆదేశించింది. మాస్టర్ కార్డు, వీసా సంస్థలు గడువు లోపల పని పూర్తిచేయలేకపోవడంతో రిజర్వు బ్యాంకు కాస్త పట్టు సడలించింది. కార్డు సంస్థలు భారతీయుల లావాదేవీలను విదేశాల్లో ప్రాసెస్ చేసినా, వాటిని 24 గంటల్లోగా భారత్‌కు తిరిగి తీసుకురావాలని కోరింది. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు కాజేసే ఉదంతాలు ఎక్కువైపోతున్న దృష్ట్యా ఈ అప్రమత్తత చాలా అవసరం. సర్కారు ఈ-కామర్స్ నిబంధనలనూ సవరించబోతోంది. దీన్ని అమెజాన్, గూగుల్, మాస్టర్ కార్డ్, వీసా తదితర సంస్థలు వ్యతిరేకిస్తున్నందువల్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డేటా స్వేచ్ఛగా ప్రవహించడానికి అనుమతించాలని భారత్, చైనాలను కోరారు. తన మాట వినని దేశాలకు హెచ్1 బి వీసాల మంజూరును తెగ్గోస్తానని సంకేతాలు పంపుతున్నారు. అమెరికాలో పనిచేయదలచిన విదేశీయులకు ప్రస్తుతం ఏటా 85,000 హెచ్1బి వీసాలు మంజూరవుతుంటే, వీటిలో 75 శాతం భారతీయులకే దక్కుతున్నాయి. డేటా స్థానికీకరణ కోసం పట్టుబట్టే దేశాలకు ఇకపై తలా 10-15 శాతం వీసాలనే ఇవ్వాలనే ప్రతిపాదన అమెరికా సర్కారు పరిశీలనలో ఉంది. ఇలాంటి కోటా భారతీయ ఐటీ సంస్థలకు కచ్చితంగా నష్టదాయకం.

భారత్ డేటా స్థానికీకరణపై పట్టువిడుపులు లేని ధోరణి అనుసరిస్తే ఇతర చిక్కులూ ఎదురవుతాయి. ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలను ప్రాసెస్ చేసే వ్యాపారంలో సింహభాగం భారతదేశానిదే. మన ఐటీ-బీపీఎం (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్) సంస్థలు స్వదేశీ ఖాతాదారులతోపాటు విదేశీ ఖాతాదారుల లావాదేవీలనూ ప్రాసెస్ చేస్తున్నాయని మరచిపోకూడదు. అమెరికన్ల ఆర్థిక సమాచారంలో అత్యధికం భారత్‌లోనే ప్రాసెస్ అవుతోంది. 2017-18లో భారత సాంకేతిక పరిజ్ఞాన సేవల ఎగుమతుల్లో 62 శాతం, ఆర్థిక సేవల్లో 41 శాతం అమెరికాకే చేరాయి. అమెరికా సైతం తమ పౌరుల సమాచారం ఎల్లలు దాటకూడదంటే భారత్‌కు ఆర్థికంగా పెద్ద దెబ్బ తగులుతుంది. డేటా స్థానికీకరణ కోసం భారత్ పట్టుబడితే అమెరికన్ సంస్థలు భారతదేశంలో వ్యాపారం చేయడం కష్టమవుతుందని ఇద్దరు అమెరికన్ సెనెటర్లు ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో హెచ్చరించారు. భారత్‌లో ఐటీ సిబ్బంది తక్కువ వేతనాలకు దొరుకుతారు కాబట్టి అమెరికన్ బ్యాంకులు, క్రెడిట్ కార్డు సంస్థలు తమ ఖాతాదారుల సమాచారాన్ని ఇక్కడే ప్రాసెస్ చేయిస్తున్నాయి. భారతీయ క్రెడిట్ కార్డు వినియోగదారుల వివరాలు విదేశాల్లో ప్రాసెస్ అవుతున్నాయి. ఒక భారతీయుడు ఏదైనా వస్తువు ధర చెల్లించడానికి కార్డును స్వైప్ చేసినట్లయితే దానికి కొన్ని సెకండ్లలోనే అనుమతి వస్తుంది. ఇక్కడ మోసమేమీ జరగలేదని నిర్ధారించడానికి అంతర్జాతీయ యంత్రాంగం అనుక్షణం పనిచేస్తూ ఉంటుంది. రిజర్వుబ్యాంకు ఆదేశించినట్లు ఈ యంత్రాంగాన్ని తక్షణం భారతదేశానికి తరలించడం అసాధ్యం. ఈ యంత్రాంగంలో చోరీ అయిన కార్డుల వివరాలు, హ్యాకింగ్ ఉదంతాలు, ఇతర ఉల్లంఘనల గురించి సమాచారం, దిద్దుబాటు చర్యలు ఇమిడి ఉంటాయి. అది మెషీన్ లెర్నింగ్ ప్రక్రియతో పనిచేస్తుంది. ఉదాహరణకు న్యూయార్క్‌లో క్రెడిట్ కార్డు మోసం జరిగితే అంతర్జాతీయ యంత్రాంగం వెంటనే దాని గురించి తెలుసుకుంటుంది. రేపు న్యూదిల్లీలో అదే తరహా మోసం చేయడానికి ఎవరైనా ప్రయత్నించిన మరుక్షణం అంతర్జాతీయ యంత్రాంగం ఆ లావాదేవీని అడ్డుకొంటుంది. దేశదేశాలకు విస్తరించిన ఈ యంత్రాంగాన్ని ఒక్క భారతదేశంలో కేంద్రీకృతం చేయడం కుదరదని కార్డు సంస్థలు, ఈ-కామర్స్ సంస్థలు అంటున్నాయి. భారత్ మాదిరిగా ఇతర దేశాలూ డేటా స్థానికీకరణకు పట్టబడితే మనకు వచ్చే ఐటీ-బీపీఎం వ్యాపారం భారీ కుదుపునకు లోనవుతుంది.

వెల్లడవుతున్న వివరాలు

సమాచారాన్ని భారత్ అభివృద్ధి వనరుగా పరిగణిస్తూ, దాన్ని తన భూభాగంలోనే భద్రపరచడానికి జాతీయ డేటా నిర్వహణ కేంద్రాన్ని నెలకొల్పనున్నది. అందులో వ్యక్తిగత సమాచారాన్ని కాకుండా సామాజిక సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. ప్రభుత్వ సంస్థలు విధి నిర్వహణలో భాగంగా సేకరించే సమాచారాన్ని ఇక్కడ నిల్వ చేస్తారు. దాన్ని ఆర్థికంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వ సంస్థలను, అంకుర సంస్థలను అనుమతిస్తారు. కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్స్ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కేంద్రంలో రవాణా, పౌరుల ఆనారోగ్యాల సమాచారం పొందుపరచి ఉంటుంది. ఇలాంటి సమాచారం బయటికి పొక్కిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటిన ఓ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ వద్దనున్న కోటి 25 లక్షల మంది గర్భిణుల సమాచారం ఆన్‌లైన్‌లో బహిరంగమైపోయింది. ఈ విషయాన్ని ఓ నిపుణుడు ఆ సంస్థ దృష్టికి తెచ్చిన తరవాత తీరిగ్గా నివారణ చర్యలు తీసుకున్నారు. అప్పటికే నెల రోజుల ఆలస్యమైపోయింది. గర్భిణుల పేర్లు, చిరునామాలతోపాటు గర్భస్రావాల సమాచారం సైతం ఆ డేటాలో ఉంది. మరోవైపు ఆధార్ వివరాలు బట్టబయలైన సందర్భాలు చాలానే ఉన్నాయి. 2017 మేలో నాలుగు ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి 13 కోట్లమంది ఆధార్ వివరాలు బయటకు పొక్కాయి. డిజిటల్ ఇండియాలో భాగంగా అన్ని ప్రభుత్వ సంస్థలు వేగంగా డిజిటలీకరణ చేపడుతున్నందువల్ల ఇన్ని లీకులు సంభవిస్తున్నాయని ప్రభుత్వ వర్గాల వివరణ. ఇంతవరకు ఒక ప్రభుత్వ విభాగంలోని వ్యక్తిగత సమాచారం అక్కడే భద్రంగా ఉండేది. కొన్నేళ్ల నుంచి అన్ని విభాగాల డేటాబేస్‌లను సమన్వయ పరుస్తున్నారు. ఈ పని చేయడానికి కావలసినంత మంది నిపుణులైన సిబ్బంది అందుబాటులో లేరు. సరైన నియంత్రణలనూ రూపొందించలేదు. త్వరలో లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు ఈ లొసుగులను తొలగిస్తుందని ఆశిద్దాం!

– ఏఏవీ ప్రసాద్

కొత్త బిల్లు లొసుగులను సరిదిద్దుతుందా?

నివేదికలు, ముసాయిదాలతోనే సరి

సమాచారాన్ని భారత్ కేవలం ఆర్థిక దృష్టితో చూడటం లేదు. శాంతిభద్రతల కోణాన్నే ఎక్కువగా పట్టించుకొంటోంది. భారత్‌లో నేరం చేసి విదేశాలకు పరారైన వ్యక్తుల సమాచారం ఆయా దేశాల్లోని డేటాబేస్‌లలో నిక్షిప్తమై ఉండవచ్చు. దాన్ని అక్కడి నుంచి తెచ్చుకోవాలంటే చట్టపరమైన నియంత్రణల వల్ల ఆలస్యం కావచ్చు. ఈలోగా సమయం మించిపోతుంది. ఓటర్లు, ఆధార్ కార్డుల సమాచారం విదేశాలకు పొక్కితే ఎన్నికల ప్రక్రియపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మన సమాచారం సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల ద్వారా విదేశాలకు ప్రవహిస్తోంది. ఒకవేళ ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా, కేబుళ్లు తెగిపోయినా పెద్ద సమస్యే. ఇలా సమస్య పూర్వాపరాలను శోధించి పకడ్బందీ నియంత్రణ చట్రాన్ని ఏర్పరచడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఇంతవరకు చెల్లింపుల సమాచారానికి సంబంధించి రిజర్వుబ్యాంకు కొన్ని మార్గదర్శక సూత్రాలను వెలువరించింది. ఆపైన కొన్ని కమిటీల నివేదికలు, ముసాయిదా బిల్లులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. డేటా స్థానికీకరణ మీద శ్రీకృష్ణ కమిటీ కొన్ని సిఫార్సులు చేయగా, వ్యక్తిగత డేటా రక్షణ బిల్లు, ఈ-కామర్స్ విధాన ముసాయిదా తుది ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. ఇక్కడ ఆర్థిక, ఆరోగ్య, నేర సమాచారాల మధ్య తేడా పాటించక తప్పదు. కెనడా, ఆస్ట్రేలియా తమ పౌరుల ఆరోగ్య సమాచారాన్ని కంటికి రెప్పలా కాపాడుకొంటాయి. చైనా, వియత్నామ్‌లలోని చట్టాలు తమ పౌరుల సమాచార భద్రతకన్నా, ఆ సమాచారంపై ప్రభుత్వ నిఘా, నియంత్రణలకే ప్రాధాన్యమిస్తాయి. ఐరోపా సంఘం (ఈయూ) చట్టం ఖాతాదారుడే రాజంటూ అతడి సమాచార గోప్యతను కాపాడుతోంది. అమెరికాలో వ్యక్తిగత డేటా రక్షణకు కేంద్ర బిల్లు ఏదీ లేదు. ఆరోగ్యం, చెల్లింపుల సమాచార గోప్యతకు వేర్వేరు చట్టాలు ఉన్నాయి.

అవగాహనే అసలైన మందు

ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుతోంది. ప్రతి దేశంలోనూ ఏటా జనసంఖ్యలో ఎంతో కొంత వృద్ధి నమోదవుతోంది. ఆసియా దేశాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనపడుతోంది. భారత్ ఇందుకు మినహాయింపేమీ కాదు. జనాభా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో వృద్ధిని నివారించలేకపోతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల కన్నా ఉత్తరాది రాష్ట్రాల్లోనే జనాభా పెరుగుదల అధికంగా ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా మారింది. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సౌకర్యాల కల్పన కోసం పెద్దయెత్తున నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఇది ప్రభుత్వాలకు పెనుభారంగా మారుతోంది.

ప్రపంచ జనాభా 1987 జులై 11 నాటికి 500 కోట్లు దాటిందని ఐక్యరాజ్యసమితి అధ్యయనంలో తేలింది. దీనితో 1989 నుంచి జూలై 11వ తేదీని ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నారు. అప్పటి నుంచి పెరుగుతున్న జనాభా వల్ల కలిగే ఇబ్బందులు, ఇతర అంశాలపై ఐరాస దృష్టి సారించింది. జనాభాను తగ్గించడంతోపాటు, లైంగిక సమానత్వం, ప్రజనన (పునరుత్పత్తి) ఆరోగ్యం ధ్యేయంగా జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు, వాటికి సంబంధించిన సమాచారం, సేవల అందుబాటు, సేవల్లో నాణ్యత, శాస్త్రీయత ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు లభించాలని ఐక్యరాజ్యసమితి పేర్కొంటోంది. అయిదు శతాబ్దాల క్రితం ప్రపంచ జనాభా సుమారు 50 కోట్లుగా ఉండేది. 1700 సంవత్సరానికి 70 కోట్లు, 1800 నాటికి 95 కోట్లు, 1900 నాటికి 160 కోట్లు, 2000 సంవత్సరానికి 600 కోట్లకు చేరుకుంది. నేడు అది 730 కోట్లయింది. అత్యధిక పెరుగుదల గత శతాబ్దంలోనే నమోదైంది. ముప్పుందు వెయ్యికోట్లకు చేరుకునే అవకాశం ఉంది. భారత్‌లోనూ జనాభా పెరుగుతోంది. దేశంలో 1871 నుంచి జనాభా లెక్కల సేకరణ ప్రారంభమైంది. 1881లో లార్డ్ రిప్పన్ అధ్వర్యంలో జరిగిన గణన మేరకు భారత ఉపఖండ జనాభా 28.80 కోట్లు. నేడు 136 కోట్ల జనాభాతో భారత్ ప్రపంచంలో చైనా తరవాత రెండో స్థానంలో ఉంది. మరో దశాబ్దంలో చైనాను అధిగమించనుందని అంచనా.

దేశంలో శిశు మరణాల సంఖ్య రెండు దశాబ్దాల క్రితం వెయ్యికి 68 ఉండగా, నేడు అది 34కు తగ్గింది. జనాభా పెరుగుదల ప్రస్తుతం భారత్‌లో 1.13 శాతంగా ఉంది. ప్రతి వెయ్యిమందికి 18.7 మంది జన్మిస్తుండగా, 7.3 మంది మరణిస్తున్నారు. ఏటా లక్షన్నర మంది రోడ్డుప్రమాదాల్లో, మరో లక్షన్నర మంది ఆత్మహత్యలతో ఈ లోకాన్ని వీడుతున్నట్లు అంచనా. దాదాపు ఇంతే సంఖ్యలో హత్యల కారణంగా చనిపోతున్నారు.

ఆదర్శ జనాభా ఎంత అనే అంశంపై ఎన్నో ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌కు చెందిన ఎడ్విన్ కానన్, కార్స్ శాండర్స్ పరిశోధన ప్రకారం ఒక ప్రాంతంలోని వనరులు, వాటిని ఉపయోగించుకునే జనాభా, వారి సాంకేతిక సామర్థ్యాన్ని అంచనా వేసి, అక్కడ ఎంత జనాభా ఉండవచ్చో లెక్కగట్టారు. రెండువేల సంవత్సరాల క్రితం ప్రపంచ జనాభాను 30 కోట్లుగా చరిత్రకారులు లెక్కగట్టారు. ఇప్పుడు ప్రపంచ జనాభా 700 కోట్లు దాటింది. జనాభా పరిమితికి మించినదని చెప్పవచ్చు.

ఐక్యరాజ్యసమితి జనాభా అధ్యయన నిధి సంస్థ జనాభా లెక్కలను ఎప్పటికప్పుడు మదింపు చేస్తోంది. దీని గణాంకాల ప్రకారం పూరించగల పునరుత్పత్తి స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్ ఫర్టిలిటీ రేటు) 2.1 గా ఉంటే తరుగుదల, పెరుగుదల లేకుండా జనాభా స్థిరంగా ఉంటుంది. ఈ ప్రాతిపదికన ప్రతి మహిళ జీవితకాలంలో 2.1 చొప్పున బిడ్డలకు జన్మనివ్వవచ్చు. అయితే ప్రజనన స్థాయి (ఫర్టిలిటి రేట్) 2.3 గా ఉంది. అందువల్ల జనాభా పెరుగుతూనే ఉంది. ప్రజనన స్థాయి దేశంలో పెద్ద రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో 3.3, 3.1, చిన్న రాష్ట్రాలైన సిక్కిం, మణిపూర్‌ల్లో 1.2, 1.4 శాతంగా ఉండటం గమనార్హం.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం దేశంలోని వివిధ రాష్ట్రాలలో జనాభా వృద్ధిరేటు తగ్గనుంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనూ ఈ పరిస్థితి కొనసాగనుంది. అదే సమయంలో ఈ రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి మెరుగుపడింది. ప్రజల ఆయుః ప్రమాణాలు పెరగడంతోపాటు మరణ శాతాలు తగ్గుతున్నాయి. ఇవి సానుకూల పరిణామాలు. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా కొనసాగితే జనాభా పెరుగదలను నియంత్రించడం కష్టమేమీ కాదు. 2050వ సంవత్సరానికి ప్రపంచ జనాభా స్థిరీకరణ సాధ్యమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జనాభా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాల్సి ఉంది. అదే సమయంలో అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరం. అప్పుడే సానుకూల ఫలితాలు సమకూరతాయి!

– డాక్టర్ పి.వి.రంగనాయకులు

(రచయిత- తిరుమల ఎస్వీ మ్యూజియం మాజీ సంచాలకులు)



నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

ఈనాడు లేఖలు

ధూమపాన నిషేధంపై నిర్లక్ష్యం

బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగరాదని చట్టం నిర్దేశిస్తోంది. కానీ అమలులో మాత్రం అలక్ష్యం కనిపిస్తోంది. చట్టప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సినిమా హాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో ధూమపానం నిషేధం. దీనిని శిక్షార్హమైన నేరంగా ప్రకటిస్తూ గతంలో కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జరిమానాతోపాటు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది. నిషేధం గురించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. అంతేకాక ఫిర్యాదు చేయాల్సిన అధికారుల చిరునామా, చరవాణి నంబర్లు తెలియజేయాలి. కానీ చాలాచోట్ల బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. అధికారులు ఈ విషయంలో ఇకనైనా కఠినంగా వ్యవహరించాలి.

- వి.ఆర్.శర్మ, నాగర్‌కర్నూలు

కనుమరుగవుతున్న చెరువులు

రాష్ట్రంలో చాలా చెరువులు కనుమరుగవుతున్నాయి. కొన్నిచోట్ల వీటిని పంట భూములుగా, ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నారు. మరికొన్ని చోట్ల అభివృద్ధి కార్యక్రమాల పేరిట నిర్మాణాలు జరుపుతున్నారు. ఇది సరైన విధానం కాదు. చెరువులకు పల్లె జీవనంలో ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఇవి ప్రజల తాగునీరు, సాగునీరు అవసరాలను, పశువుల దాహార్తిని తీరుస్తాయి. చెరువుల వల్ల బావులు, ఇతర నీటి వనరుల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. జాలరులకు ఉపాధి లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో చెరువుల సంరక్షణకు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ చాలా చెరువులు అభివృద్ధికి నోచలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

- ఎస్.షఫీ, హన్మకొండ

ఎటు నడవాలి?

నడక మంచిదంటున్నారు వైద్యులు. చాలా ఆరోగ్య సమస్యలకు నడక ఔషధంలా పనిచేస్తుందని భావిస్తున్న జనం ఉదయపు నడక అలవాటు చేసుకున్నారు. నగరాల్లో 'వాకర్స్ క్లబ్'లూ వెలశాయి. ఈ భౌతికమైన నడక సంగతి ఇలా ఉంచితే, సాయంకాలమయ్యేసరికి

రాంపూర్-శ్రీశైలం.. రెండు ప్రతిపాదనలు

- నీటి తరలింపునకు రూపొందించిన తెలంగాణ ఇంజినీర్లు
- మొదటి దానికి రూ.67,500 కోట్లు అంచనా వ్యయం
- రెండో ప్రతిపాదనకు రూ.70 వేల కోట్ల అంచనా

ఈనాడు - హైదరాబాద్

గోదావరి నీటి మళ్లింపు మార్గాలపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఇందుకు తెలంగాణ ఇంజినీర్లు రెండు ప్రత్యామ్నాయాలను రూపొందించారు. అవి కంతనపల్లి దిగువన రాంపూర్ వద్ద బ్యారేజీ నిర్మించి నాగార్జునసాగర్‌కు, శ్రీశైలానికి నీటిని మళ్లించే ప్రతిపాదనలను తయారుచేశారు. గోదావరి నుంచి రోజూ రెండు టీఎంసీల నీటిని మళ్లించడానికి అధ్యయనం చేసి రూపొందించిన రెండు ప్రత్యామ్నాయాలను మంగళవారం జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇంజినీర్ల సమావేశంలో చర్చించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

85 మీటర్ల పూర్తి స్థాయి మట్టంతో బ్యారేజీ

- గోదావరిపై కంతనపల్లి దిగువన రాంపూర్ వద్ద 85 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టంతో బ్యారేజీ నిర్మిస్తారు.
- ఇక్కడి నుంచి 47 కి.మీ దూరం సొరంగ మార్గం ద్వారా నీటిని మళ్లించి 130 మీటర్ల ఎత్తుకు లిఫ్టు ద్వారా లక్నవరం చెరువులో పోస్తారు. ఈ సొరంగంలో 23 కి.మీ దూరం వన్యమృగ సంరక్షణ ప్రాంతంలో ఉన్నందున టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) ద్వారా తవ్వాల్సి ఉంటుంది.
- లక్నవరం చెరువు నుంచి 18 కి.మీ దూరం మరో సొరంగ మార్గం తవ్వి 90 మీటర్ల ఎత్తు లిఫ్టుతో శ్రీరామసాగర్ ప్రాజెక్టు డీబీఎం(డిస్ట్రిబ్యూటరీ మెయిన్) 38లో 20వ కిలోమీటరు వద్ద నీటిని పోస్తారు.
- ఈ కాలువ 20 కి.మీ, కాకతీయ కాలువ 99 కి.మీ దూరం ఈ పథకానికి వినియోగిస్తారు. ఇందుకోసం రెండు టీఎంసీల సామర్థ్యానికి తగ్గట్లుగా కాలువను నిర్మించాలి. ఈ కాలువ మూసీ నదిని దాటడానికి అక్విడెక్టు నిర్మాణం చేపట్టాలి.



గోదావరి నీటిని మళ్లించేందుకు రాంపూర్-శ్రీశైలం ప్రతిపాదిత ప్రవాహ మార్గం

మొదటి ప్రతిపాదన

మూసీ అక్విడెక్టు నుంచి 55 కి.మీ. దూరం కాలువ తవ్వి చర్లపల్లి వద్ద నుంచి ఉదయసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని మళ్లించాలి. హాలియా నదిపై కంగలవాగు వద్ద ఆనకట్ట నిర్మించి నాగార్జునసాగర్ ఆయకట్టుకు, ఇంకో అనుసంధానం ద్వారా దిండి ఎత్తిపోతల పథకంలో నిర్మించిన కిష్టంపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించాలి. రాంపూర్ నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని మళ్లించే ఈ ప్రతిపాదనకు రూ.67,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

- ఇందులో 61 కి.మీ దూరం సొరంగ మార్గాలు, 174 కిలోమీటర్లు కాలువ, మరో 78 కి.మీ లింకు కాలువ, 220 మీటర్ల ఎత్తు లిఫ్టులు నిర్మించాలి.

రెండో ప్రతిపాదన

మూసీ అక్విడెక్టు నుంచి 70 కి.మీ దూరం కాలువ తవ్వి నాగార్జునసాగర్ ఎడమగట్టు పరిధిలోని ఉదయసముద్రం, దేవులపల్లి చెరువుకు మళ్లించడం. కాలువ చివర్లో 234 మీటర్ల నుంచి 274 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసేందుకు 40 మీటర్ల ఎత్తుతో లిఫ్టు నిర్మించాలి. 30 కి.మీ దూరం కాలువ ద్వారా నీటిని మళ్లించాలి. మళ్లీ 45 మీటర్ల ఎత్తుతో లిఫ్టు నిర్మించి 310 మీటర్ల ఎత్తుకు నీటిని తీసుకెళ్లాలి. ఈ లిఫ్టు నుంచి 70 కి.మీ దూరం సొరంగ మార్గం తవ్వి ఒక టీఎంసీ నీటిని శ్రీశైలం రిజర్వాయర్లో పోయడం. రాంపూర్ నుంచి శ్రీశైలానికి నీటిని మళ్లించే ఈ ప్రతిపాదనకు రూ.77 వేల కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

- ఇందులో 131 కి.మీ దూరం సొరంగ మార్గాలు, 229 కి.మీ దూరం ప్రధాన కాలువ, 25 కి.మీ దూరం లింక్‌కెనాల్, 305 మీటర్ల ఎత్తుకు లిఫ్టులను నిర్మించాలి.

శిల్పరూప ఆవిష్కారం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దే క్రమంలో, అపురూప శిల్పాల ద్వారా భక్తితత్వాన్ని పెంచేందుకు 'యాడా' మరింత కృషి జరుపుతోంది. పలు శిల్పాలను పొందుపరిచే పనులను ముమ్మరంగా చేపట్టింది. ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంతో, యాదాద్రీశుడి ప్రధానాలయ ప్రవేశమార్గంలో నిర్మితమైన రాతి గోడలకు వివిధ విగ్రహాల అమరిక ప్రక్రియ కొనసాగుతోంది. తూర్పు రాజగోపురం నుంచి ప్రధానాలయంలోకి ప్రవేశించాక, ఇరువైపులా కృష్ణ శిలతోనే ఆంజనేయస్వామి విగ్రహాన్ని చెక్కే పనులకు బుధవారం ప్రధాన స్థపతి ఆనందాచారి వేలు తుదిమెరుగులు దిద్దారు. మహావిష్ణువుకు ప్రీతిపాత్రులైన గరుడ ఆళ్వార్లతో పాటు శంఖు చక్ర నామాలు, ఐరావతం రూపాలు త్వరలోనే ఆవిష్కృతమవుతాయని ఆయన తెలిపారు.

యాదాద్రి ప్రధానాలయ ప్రవేశ మార్గంలో ఆంజనేయ ప్రతిమకు తుది మెరుగు దిద్దుతున్న ఆనందాచారి వేలు

వైద్యవిద్య తొలివిడత ప్రవేశ ఫలితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్న ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్యవిద్య ప్రవేశాల ఫలితాలను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. దాదాపు 2,300 ఎంబీబీఎస్ సీట్లను అభ్యర్థులకు కేటాయించింది. సీట్లు పొందిన అభ్యర్థుల మొబైల్ ఫోన్ నంబర్లకు సంబంధిత సమాచారాన్ని కాళోజీ ఆరోగ్యవర్సిటీ పంపించింది. కళాశాలల వారీగా సీట్ల కేటాయింపు జాబితాను గురువారం అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చుతామని కాళోజీ ఆరోగ్యవర్సిటీ ఉపకులపతి డాక్టర్ కరుణాకరరెడ్డి తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు కేటాయించిన కళాశాలల్లో చేరడానికి ఈ నెల 15ను తుదిగడువుగా నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.

నేడు ఇంజినీర్ల దినోత్సవం

ఈనాడు, హైదరాబాద్: నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినోత్సవ సందర్భంగా గురువారం 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్'లో ఇంజినీర్ల దినోత్సవం నిర్వహిస్తామని సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.రామేశ్వర్‌రావు తెలిపారు. నలుగురు సీనియర్ ఇంజినీర్లకు బహదూర్ స్మారక పురస్కారాలు అందజేస్తామని, సభాకార్యక్రమం ఉదయం 11 గంటలకు మొదలవుతుందని ప్రకటించారు. విజేతలుగా విద్యుత్‌శాఖ నుంచి కె.పెంటారెడ్డి, నీటిపారుదలశాఖ తరపున పి.వెంకట రామారావు, రోడ్లు-భవనాల శాఖకు చెందిన పి.కిషన్, మిషన్ భగీరథకు సంబంధించి జ్ఞానేశ్వర్‌ను ఎంపిక చేశామని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. విలేకరుల సమావేశంలో ఇంజినీర్ల జేఏసీ ఛైర్మన్ టి.వెంకటేశం, ఉపాధ్యక్షుడు శ్రీధర్ దేశ్‌పాండే, కార్యదర్శి చక్రధర్ పాల్గొన్నారు.

'గోదావరి' వినియోగంపై అఖిలపక్ష భేటీకి భాజపా డిమాండ్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: గోదావరి నీటి మళ్లింపు స్థితిగతులపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు యోచిస్తున్న నేపథ్యంలో..ఆ నదీజలాల వాడకంపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని భాజపా నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి కోరారు. భద్రాచలానికి ముంపు ప్రమాదాన్ని నివారించేలా విస్తృతస్థాయి భేటీ ఏర్పాటుకావాలన్నారు.

ఆరోగ్య పథకాలకు రూ.80 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అమలవుతున్న వేర్వేరు ఆరోగ్య పథకాల పనుల కోసం ఆర్థిక శాఖ బుధవారం రూ.80 కోట్లను విడుదల చేసింది. ఇందులో కేసీఆర్ కిట్‌కు రూ.35 కోట్లు, కంటి వెలుగుకు రూ.25 కోట్లతో పాటు ఔషధాలు, శస్త్రచికిత్స పరికరాలు, ప్రాణవాయు సరఫరా కోసం రూ.20 కోట్ల మేరకు నిధులున్నాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

బీసీ కమిషన్ క్షేత్ర పర్యటన మొదలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో తక్కువ జనాభా ఉన్న సంచార కులాలవారిని బీసీ జాబితాలో చేర్చడంపై ఆ కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనను బుధవారం ప్రారంభించింది. సభ్యులు జూలూరి గౌరీశంకర్, డాక్టర్ అంజనేయగౌడ్, వకుళాభరణం కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని వేర్వేరు ఏకసభ్య కమిషన్ బెంచ్‌లు జిల్లాల్లో పర్యటనలు చేపట్టాయి. ఇప్పటికే సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లోని సంచార కులాల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు.

సగం పంటైనా కొనుగోలు చేయాలి

కేంద్రానికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ లేఖ

రైతులు పండిస్తున్న పంటల్లో సగమైనా నేరుగా మద్దతు ధరకు కొనాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ప్రస్తుతం రాష్ట్రంలో పండే పంటల దిగుబడిలో 25 శాతమే కేంద్రం కొంటోంది. మిగిలిన 75 శాతాన్ని రైతులు బయట అమ్ముకుని నష్టపోతున్నారు. కేంద్రం కొనే పంటను 50 శాతానికి పెంచి నిధులు కేటాయించాలని కేంద్రానికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ లేఖ రాసింది. ఈఏడాది ఖరీఫ్, యాసంగిలో సాగుచేసే పంటలు, వాటిని మద్దతు ధరలకు కొనడంపై ప్రణాళిక తయారీకి కేంద్రం రాష్ట్రాల అభిప్రాయాలను కోరింది. పంటల కొనుగోలు అంశమే ప్రధానమని, దీనికి నిధులు లేనందున రైతులు నష్టపోతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు స్పష్టం చేశాయి.

పసుపు సమస్యలపై విస్తృత భేటీ

కేంద్రానికి నిజామాబాద్ ఎంపీ వినతి

ఈనాడు, దిల్లీ: పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇకనైనా పరిష్కరించేలా విస్తృత సమావేశం ఏర్పాటుచేయాలని.. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్‌కు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తిచేశారు. వ్యవసాయ శాఖలోని పలు విభాగాల ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమైన ఎంపీ పలు అంశాలను చర్చించారు. పసుపు పంట నాణ్యత పెంపు, సాగు, వ్యయం, మార్కెటింగ్ అంశాలపై మరింత సమగ్రంగా చర్చించేందుకు రెండు వారాల్లో మళ్లీ సమావేశం కావాల్సి ఉందన్నారు. ఈసారి సమావేశానికి రైతులనూ తీసుకురావాలని ఆయనకు విభాగాధిపతులు సూచించారు. అనంతరం విలేకరులతో అర్వింద్ మాట్లాడుతూ, ప్రస్తుత సమావేశం సంతృప్తి కలిగించిందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నట్లు చెప్పారు.

ఆదివాసీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

- గవర్నర్‌ను కోరిన పలు పార్టీల నేతలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆదివాసీ అటవీ హక్కుల చట్టం-2006ను పూర్తిగా అమలు చేయాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. బుధవారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, తెతెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు గోవర్ధన్, కె.రంగారెడ్డి, తెతెదేపా నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు గవర్నర్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కోదండరాం విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఉన్న చట్టాలు ఆదివాసుల్ని చొరబాటుదారులుగా చూడగా వారికి హక్కుల్ని కల్పిస్తూ 2006 చట్టం తెచ్చారన్నారు. దాదాపు 1.83 లక్షల మంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా లక్ష మందికి ఆమోదించినట్లు తెలిసిందన్నారు. అందులోనూ కొందరికి పాస్ పుస్తకాలు ఇస్తే భూమి ఎక్కడో చూపలేదని, మరికొందరికి పుస్తకాల్లో అధికారుల సంతకాలు లేవని, ఇంకొందరికి ఇచ్చినట్లే ఇచ్చి మళ్లీ ఇస్తామంటూ వెనక్కు తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి దాకా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని కోదండరాం డిమాండ్ చేశారు. అన్నింటిని పెండింగ్ దరఖాస్తులుగా పరిగణనలోకి తీసుకునేలా చొరవ తీసుకోవాలని కోరగా గవర్నర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఎల్.రమణ మాట్లాడుతూ.. ఆదివాసీలు ఏళ్ల తరబడి అడవుల్ని కాపాడుతున్నారని, అలాంటి వారిని ఖాళీ చేయించడంపై జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరామన్నారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి బయటకు వస్తున్న గోవర్ధన్, కోదండరాం, రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

ట్రూత్‌ల్యాబ్స్ ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా కోర్సు

ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ట్రూత్‌ల్యాబ్స్-నల్సార్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్రిమినల్ లా అండ్ ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించనున్నారు. హత్య, అత్యాచారం, డోపిడీ, సైబర్ నేరం, బాంబు పేలుడు... ఇలా నేరం ఏదయినా సరే ఆధారాల సేకరణ, నేర నిరూపణ వంటి అంశాల్లో అనుభవజ్ఞులైన నిపుణులతో రూపొందించిన ఈ కోర్సు న్యాయవాదులతోపాటు ప్రస్తుతం న్యాయవిద్య చదువుతున్న వారు, ఇతర విభాగాల్లోని విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని ట్రూత్‌ల్యాబ్స్ వ్యవస్థాపకులు కె.పి.సి.గాంధీ వెల్లడించారు. నేరాన్ని నిరూపించి, నేరస్థుడిని చట్టానికి పట్టివ్వడం ద్వారా సమాజానికి మేలు చేయడానికి ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఆయా రంగాల్లో ఏళ్ల తరబడి వాస్తవిక అనుభవం ఉన్న నిపుణులతో పాఠ్యాంశాలు రూపొందించామని, క్షేత్రస్థాయి పరిశీలన కూడా కోర్సులో భాగంగా ఉంటుందన్నారు. న్యాయసేవలు అందించే వారితోపాటు బహుళజాతి సంస్థల్లో వివిధ విభాగాల్లో పనిచేసేవారికి సైతం ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

అమ్మాయిలకు రాగి లడ్డూ

❒ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సరఫరా ❒ మధ్యాహ్న భోజనంలో పంపిణీ
❒ 3.53 లక్షల మంది బాలికలకు ప్రయోజనం ❒ విద్యాశాఖ ప్రతిపాదనకు కేంద్రం పచ్చజెండా
❒ 13,694 పాఠశాలల్లో పెరటి తోటల పెంపకానికీ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలను దూరం చేసేందుకు సర్కారు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే బాలికలకు పాఠశాల విద్యాశాఖ రాగి లడ్డూలు అందించనుంది. మధ్యాహ్న భోజనంలో భాగంగా వీటిని ఇవ్వనున్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో మిగిలిన మూడు రోజులు 6, 7, 8 తరగతుల బాలికలకు రాగి లడ్డూలు ఇవ్వనున్నారు. వారానికి 3 రోజుల చొప్పున 13 వారాలు అందిస్తారు. మధ్యాహ్న భోజన పథకం ప్రాజెక్టు ఆమోదిత మండలి(పీఏబీ)లో విద్యాశాఖ ప్రతిపాదించగా.. ఇందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 3,53,565 మంది ప్రయోజనం పొందుతారు. దీనికి ఏడాదికి రూ.8.06 కోట్లు వ్యయం కానుంది. అందులో 60 శాతం.. అంటే రూ.4.84 కోట్లను కేంద్రం అందిస్తుంది. మిగిలిన రూ.3.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

పోషకాహారానికి పెరటి తోటలు

పాఠశాలల ఖాళీ స్థలాల్లో పెరటి తోటలు తయారుచేసి వివిధ కూరగాయలు, పండ్ల తోటలను పెంచాలన్నది విద్యాశాఖ ఆలోచన. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 1328 బడుల్లోని పెరటి తోటల్లో వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నారు. వాటిని మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు. ఇదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి 13,694 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను రూపొందించుకుంటామని విద్యాశాఖ కేంద్రానికి ప్రతిపాదించగా ఆమోదం లభించింది. ఒక్కోదానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.6.66 కోట్లు ఖర్చవుతుంది. దీన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులను భరిస్తాయి.

విద్యాశాఖకు కేంద్రం ఆదేశాలివీ

- ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 96 శాతం మందే మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్నారు. దాన్ని 100 శాతానికి పెంచాలి.
- మొత్తం 30,408 వంట, స్టోర్ రూమ్‌ల నిర్మాణానికి ఆమోదం తెలిపి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు 17,483 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన నిర్మాణాలను ఈ ఏడాదిలోగా పూర్తి చేయాలి.
- 1-8 తరగతుల విద్యార్థులు 19,13,868 మందిలో 14,49,622 మందికే(76 శాతం) వైద్య పరీక్షలు నిర్వహించారు. 72 శాతం మందికే ఐరన్, పోలిక్ యాసిడ్ టాబ్లెట్లను ఇచ్చారు. దీన్ని 100 శాతానికి పెంచాలి.
- 28,623 పాఠశాలల్లో ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థుల హాజరును 23,532(85 శాతం) మాత్రమే ఆటోమేటెడ్ మానిటరింగ్ సిస్టమ్(ఏఎంఎస్) ద్వారా పంపిస్తున్నాయి. దీన్ని 100 శాతం బడులు అమలు చేయాలి.

పార్లమెంట్‌లో కార్మికుల గళం వినిపిస్తాం

- కాంగ్రెస్ ఎంపీలు ఉత్తమ్, రేవంత్, కోమటిరెడ్డి
- ఏఐసీసీ కార్యాలయంలో ఎంపీలకు సన్మానం

ఈనాడు, దిల్లీ: కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని... వారి గళాన్ని సభలో వినిపిస్తామని కాంగ్రెస్ లోక్‌సభ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి గెలుపొందిన ముగ్గురు నేతలను ఏఐసీసీ అనుబంధ భారత జాతీయ భవన నిర్మాణ, కర్ర పని కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారమిక్కడ సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఆర్.సి.కుంతియా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి ఎన్నికైన ముగ్గురు నేతలు ప్రజా క్షేత్రంలో బలమైన పునాదులు కలిగిన వారని ప్రశంసించారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని సభలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఎంపీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు అందాల్సిన రాయితీలు, ప్రయోజనాల విషయంలో అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దిల్లీలో సల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల బాధ్యుడు ఆర్.సి.కుంతియా

వలస కార్మికులను విడిపించాలి

- గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బసంత్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇతర దేశాల్లోని జైళ్లలో ఉన్న వారిని... అక్కడ కుటుంబాల్లో బానిసలుగా మగ్గుతున్న వారిని కేంద్ర ప్రభుత్వం విడిపించాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బసంత్‌రెడ్డి కోరారు. వలస కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి దిల్లీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యాదయ్య ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లి తిరిగిరాలేదని.. పెగడపల్లికి చెందిన పోతుగండు 15 ఏళ్ల క్రితం దుబాయి వెళ్లి తిరిగి రాలేదని ఆయన చెప్పారు. మంచిర్యాల జిల్లా కవ్వాల్‌కు చెందిన కుంటాల లచ్చన్న, శేర్ల రాజు ఏజెంట్ల మోసంతో ఇరాక్ పోలీసుల ఆధీనంలో ఉన్నారని తెలిపారు. చాగల్ అశోక్ అనే కార్మికుడు 11 ఏళ్లుగా మలేసియాలో ఉండిపోయాడని వివరించారు. పాస్‌పోర్టులను యజమానులు ఉంచుకోవడం.. ఏజెంట్లు నకిలీ వర్క్ పర్మిట్లు ఇవ్వడంతో ఆయా దేశాల్లో వలస కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తమ వారిని జీవిత కాలంలో చూసుకుంటామనే ఆశను కోల్పోతున్నామని వలస కార్మికుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అంతకు ముందు వారంతా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను కలిశారు. విదేశాంగ మంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

దిల్లీలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న గల్ఫ్ వలస కార్మికుల కుటుంబ సభ్యులు

సచివాలయం నుంచి సామగ్రి తరలింపు

- బీఆర్‌కే భవన్‌కు బీరువాలు, కంప్యూటర్లు, ఫర్నీచర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ కొత్త సచివాలయం నిర్మాణం దృష్ట్యా ప్రస్తుత సచివాలయం నుంచి సామగ్రి తరలింపు కొనసాగుతోంది. బుధవారం బీరువాలు, ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇతర పరికరాలను వాహనాల్లో బూర్గుల రామకృష్ణారావు భవన్‌కు తరలించారు. రోజంతా ఈ పనులు సాగాయి. ప్రస్తుత సచివాలయం కూల్చివేతకు నిర్ణయం తీసుకున్నందున తరలింపు ప్రక్రియను త్వరగా ముగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి అనుగుణంగా అన్ని శాఖలకు ఆదేశాలివ్వగా.. దస్త్రాలు, సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. మంగళవారం నుంచి దస్త్రాల తరలింపు జరుగుతోంది. బుధవారం సామగ్రి తరలించారు. సచివాలయంలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న భవనాలకు తోడు ఏపీ ప్రభుత్వం నుంచి స్వాధీనం చేసుకున్న భవనాల నుంచి సామగ్రిని యుద్ధప్రాతిపదికన తరలిస్తున్నారు. సచివాలయం తరలింపునకు అవసరమైన వాహనాలు, కూలీలను ఆయా శాఖలే సమకూర్చుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అవసరమైన నిధులను శాఖాపరమైన పద్దుల నుంచి చెల్లించాలని ఆదేశించింది. మరోవైపు బీఆర్‌కే భవన్ నుంచి శాఖాధిపతుల కార్యాలయాల తరలింపు ప్రక్రియ చివరి దశకు చేరింది. దాదాపు 15 శాఖల కార్యాలయాలను గత రెండు రోజుల్లో తరలించారు. శనివారం వరకు మొత్తం బీఆర్‌కే భవన్ సాధారణ పరిపాలన అధీనంలోకి రానుంది.

తెలంగాణ సచివాలయం నుంచి బీఆర్‌కే భవన్‌కు సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

హోస్పేట జైలుకు నౌహీరా షేక్ తరలింపు

మాదన్నపేట, న్యూస్‌టుడే: అధిక వడ్డీ ఆశ చూపి భారీ మొత్తాలను దండుకున్న కేసులో.. నిందితురాలు నౌహీరా షేక్‌ను కర్ణాటక పోలీసులు బుధవారం హోస్పేట జైలుకు తరలించారు. ట్రాన్స్‌ఫర్ వారెంటుపై ఆమెను అక్కడికి పంపించామని చంచల్‌గూడ మహిళా కారాగార అధికారులు వెల్లడించారు. నిందితురాలిని కర్ణాటకకు చేర్చాలని ఆ రాష్ట్ర పోలీసులు చాలా రోజుల కిందటే కోరారు. ఆ మేరకు ఉత్తర్వులు రాకపోవడంతో కొంత జాప్యం చోటుచేసుకున్నట్లయింది. అక్కడి కోర్టులో హాజరుపరిచిన తర్వాత, ఆమెను తిరిగి చంచల్‌గూడకు పంపుతామా లేదా అనేది న్యాయమూర్తుల ఆదేశాలపై ఆధారపడి ఉంటుందని కర్ణాటక పోలీసులు వెల్లడించారు.

ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK
Head office :: Warangal
NOTICE INVITING TENDERS
Empanelment of vendors of procurement of **UPS, INVERTERS & BATTERRIES** at our various branches in AP & Telangana State. **(Refer Tender Notice No.6, Dated: 10/07/2019).**
We invite sealed Tenders for Empanelment of vendors of procurement of **UPS, INVERTERS & BATTERRIES** at our various branches in AP & Telangana State. **For details, see tender documents placed in our Banks' website: www.apgvbank.in.** The last date of submission of tender is **02/08/2019** at HO, Warangal.
General Manager (I)

Bhoj Reddy Engineering College for Women
Vinaynagar, Santoshnagar Crossroads, Saidabad, Hyderabad - 500 059, Telangana
Admissions to all Management Seats in
B Tech Courses: CSE-36, ECE-54, EEE-18, IT-36
based purely on JEE (Main) Rank, EAMCET Rank & Intermediate (10+2) Marks
No donation, No capitation fee, No broker commission. Only fee fixed by government
Application form and detailed notification may be obtained from the college free of cost or may be downloaded from www.brecw.ac.in.
Applications must be submitted in college office by 5 pm on 17th July 2019

SARDAR VALLABHBHAI PATEL NATIONAL POLICE ACADEMY
(Government of India : Ministry of Home Affairs) Shivrampally, Hyd - 500 052
No.11011/14/2019/Estt/R9A1 Date : 09-07-2019
WALK-IN-INTERVIEW
The Sardar Vallabhai Patel National Police Academy, Shivarampally, Hyderabad, Telangana-500 052 intends to f

రాష్ట్రమంతా తీవ్ర వర్షాభావం

- ఒక్క కుమురం భీం జిల్లాలోనే సాధారణ వర్షాలు
- ఖమ్మంలో అత్యధికంగా 68శాతం లోటు వర్షపాతం
- పంటల సాగు సాధారణంలో 40శాతమే
- వ్యవసాయ శాఖ తాజా నివేదిక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రమంతా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో గత నెల ఒకటి నుంచి బుధవారం నాటికి.. ఒక్క కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రమే సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. మిగతా రాష్ట్రమంతా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో సాధారణంకన్నా 33శాతం తక్కువ వర్షపాతం లోటు నమోదవగా ఈ నెలలోనూ ఇప్పటిదాకా 32శాతం ఉంది. జూన్ 1 నుంచి బుధవారం నాటికి సాధారణంగా 197.8 మిల్లీమీటర్ల (మి.మీ.) వర్షం కురవాలి. కానీ 133.2 మి.మీ.లే కురిసింది. గతేడాది ఇదే కాలవ్యవధిలో 237.6 మి.మీ. వర్షం కురిసినట్లు వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో ప్రకటించింది. గత వారం రోజుల్లో వర్షాలు బాగా తక్కువగా ఉన్నాయి. గురువారం నుంచి 4 రోజులపాటు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది. జులై రెండోవారం దాటే వరకు రాష్ట్రంలో పెద్దగా వర్షాలు లేనట్టే. వర్షపాతం లోటు అత్యధికంగా ఖమ్మంలో 68, సూర్యాపేటలో 67, నల్గొండలో 66శాతం ఉంది. ఈ జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులున్నట్లు తెలిపింది. వాతావరణ శాఖ నిబంధనల ప్రకారం వర్షపాతం లోటు 60శాతానికి పైగా ఉంటే కరవు పరిస్థితులున్నట్లు పరిగణిస్తారు. ఈ జిల్లాల్లో వర్షపాతం లోటు అంతకన్నా ఎక్కువగా ఉంది.

పంటల సాగు 40శాతం

రాష్ట్రంలో ఇప్పటివరకు 40శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ సీజన్‌లో మొత్తం 43.34 లక్షల హెక్టార్లకు గాను ఇప్పటికి 17.33 లక్షల హెక్టార్ల(40 శాతం)లోనే పంటలు వేశారు. అత్యధికంగా 10.82 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. ఆహార ధాన్యాల సాగు 43, పప్పుధాన్యాల సాగు 46, నూనెగింజల పంటలు 47శాతం విస్తీర్ణంలో వేశారు. వర్షాలు తక్కువగా ఉన్నందున పంటల సాగు నిదానంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఖరీఫ్ సీజన్ మొత్తం వరినాట్లు 9.64 లక్షల హెక్టార్లల్లో వేయాలి. ఈ సమయానికి 97,132 హెక్టార్లలో నాట్లు పడాల్సి ఉండగా 58,704 హెక్టార్లకే నాట్లు వేశారు. వరి నాట్లు వేయడానికి ఇంకా సమయం ఉందని వ్యవసాయశాఖ తెలిపింది. బోర్లు, బావుల కింద సాగునీటి వసతి ఉన్నచోట నాట్లు వేస్తున్నారు.

పంటల సాగు తీరు (హెక్టార్లు)

పంట	ఇప్పటికి వేయాల్సింది	ఇప్పటికి సాగైంది
పత్తి	11,98,112	10,82,045
సోయాచిక్కుడు	1,29,879	1,12,282
వరి	97,132	58,704
మొక్కజొన్న	2,02,795	1,66,232
జొన్న	21,576	21,214
కంది	1,46,367	1,46,406
పెసర	49,432	33,603
వేరుసెనగ	5,381	2,157

వర్షపాతం లోటు అధికంగా ఉన్న కొన్ని జిల్లాలు

జిల్లా	లోటు శాతం
ఖమ్మం	68
సూర్యాపేట	67
నల్గొండ	66
యాదాద్రి	59
మహబూబాబాద్	58
మంచిర్యాల	45
నిర్మల్	44
భద్రాద్రి	43
మేడ్చల్	40
వరంగల్ గ్రామీణ	36
జనగాం	35

చింతమడక అభివృద్ధికి రూ.10 కోట్లు

పరిపాలన అనుమతి ఉత్తర్వులు జారీ

సిద్దిపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం సిద్దిపేట గ్రామీణ మండలం చింతమడకకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధి ద్వారా రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం పరిపాలన అనుమతి ఇస్తూ జీవో నం. 292 జారీ చేసింది. ముఖ్యమంత్రి త్వరలోనే సొంత గ్రామంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల అయ్యాయి. ఇటీవల చింతమడక సర్పంచి హంసకేతన్‌రెడ్డితో సీఎం కేసీఆర్ సెల్‌ఫోన్‌లో నేరుగా మాట్లాడిన సందర్భంలో అభివృద్ధి పనులపై ప్రస్తావించారు. ఈ తరుణంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, సిద్దిపేట జిల్లా పాలనాధికారి వెంకట రామరెడ్డి దిశానిర్దేశంలో గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తయింది. దీన్ని అధికారులు క్రోడీకరించే పనిలో ఉన్నారు. మరోవైపు వివిధ శాఖలు ప్రత్యేకంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాయి. తాను గ్రామానికి వచ్చే లోపు కొన్ని పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ తాజాగా నిధులు మంజూరు చేశారన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

కవితకు తెరాస సభ్యత్వం

కవితకు సభ్యత్వ రశీదు ఇస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలంగాణ రాష్ట్ర సమితి క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. హైదరాబాద్‌లోని కవిత నివాసంలో బుధవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆమెకు సభ్యత్వ రశీదు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో కొనసాగుతోందన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం, హక్కులు కాపాడటం, ప్రజల ప్రయోజనాలు నెరవేర్చడం తెరాసకే సాధ్యమని పేర్కొన్నారు. కవిత మాట్లాడుతూ.. తెరాస సభ్యురాలిగా ఉండటం తనకు గర్వకారణంగా ఉందన్నారు. తెలంగాణ చరిత్రను తిరగరాసిన ఘనత తెరాసదేనని తెలిపారు. పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందని, తెలంగాణతోపాటు దేశ విదేశాల్లోనూ సభ్యత్వ నమోదు ఉత్సాహంగా సాగుతోందన్నారు.

సెల్ఫీ పంపిస్తేనే హాజరు

బారాబంకీ: ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరు సమస్యను తగ్గించేందుకుగాను ఉత్తర్ ప్రదేశ్‌లోని బారాబంకీ జిల్లాలో అధికారులు అనూహ్య వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల్లోపు పాఠశాలకు వెళ్లి అక్కడ స్వీయచిత్రం(సెల్ఫీ) తీసుకొని పంపిస్తేనే హాజరు వేస్తామని ప్రకటించారు. లేదంటే ఆ రోజు విధులకు హాజరు కానట్లు పరిగణించి, వేతనంలో కోత విధిస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు తమ సెల్ఫీలను 'బేసిక్ శిక్షా అధికారీ(బీఎస్ఏ)' వెబ్‌పేజీకి పంపించాలి. ఆ చిత్రాలను స్వీకరించి, పరిశీలించేందుకు ఆటోమేటెడ్ వ్యవస్థ ఉంటుంది. 'సెల్ఫీ అటెండెన్స్ మీటర్(ఎస్ఏఎం)'గా పిలుస్తున్న ఈ హాజరు వ్యవస్థ బారాబంకీలో 7,500 మంది ఉపాధ్యాయులకు వర్తిస్తుంది. ఉపాధ్యాయులు సమయానికి వచ్చేందుకు, తమ బదులు వేరే వ్యక్తులను పాఠశాలకు పంపించకుండా ఉండేందుకు ఎస్ఏఎం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక 700 మంది ఉపాధ్యాయుల వేతనాల్లో కోత(ఒకరోజుకు) విధించినట్లు వెల్లడించారు.

రూ.10 కోట్ల ఆస్తి ఉన్న వధువు కావలెను



একমাত্র পুত্র, সুদর্শন, নিরামিশাশী, মা পেনশনভোগী। কালিয়াগঞ্জ শহরে বাড়ী। ঘরজামাই থাকতে চাই। শিলিগুড়িতে ছোট ও উচ্চবিত্ত পরিবারে পাত্রীর ১০ কোটি টাকার সম্পত্তি থাকা চাই। প্রকৃত বিয়ে করতে ইচ্ছুক এমন পাত্রী যোগাযোগ করুন। M-7679601141. (M/TR)
■ কায়স্থ (1) 40/5'-5" গৃহশিক্ষক এবং (2) 42/5'-6" প্রতিষ্ঠিত

పత్రికల్లో వధూవరులు కావాలంటూ ప్రకటనలు సాధారణమే. పశ్చిమబెంగాల్‌లోని సిలిగుడికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. వధువుకు రూ.10 కోట్ల ఆస్తి ఉండాలంటూ షరతు పెట్టి వార్తల్లో నిలిచాడు. సిలిగుడిలోని కాలియాగంజ్‌లో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు (42) తనపేరు చెప్పకుండా, అమ్మాయి పేరుమీద రూ.10 కోట్ల ఆస్తి ఉండాలని షరతు పెట్టాడు. ఈ వింత ప్రకటన పాఠకులను ఆకట్టుకుంది. వెంటనే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిపోయింది. దీనికి నెటిజన్లు అనేక మీమ్స్ సృష్టించారు. ప్రకటన ఇచ్చింది ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయ సంఘం నేతలు స్పష్టంచేశారు.

మద్యం కోసం ఏడు నెలల కొడుకును అమ్మేశాడు!

మద్యం వ్యసనానికి బానిసైన కన్న తండ్రి.. ఏడు నెలల పసికందును అమ్మేసిన హృదయవిదారక ఘటన ఒడిశా నవరంగ్‌పూర్‌లో జరిగింది. రూ.10 వేల కోసం కన్నకొడుకునే అమ్మేసుకున్నాడా కసాయి తండ్రి. నవరంగ్‌పూర్ జిల్లా పూజారిగూడకు చెందిన సాగరం లోహర్ తాగుడుకు బానిసయ్యాడు. తాగడానికి డబ్బు లేక.. భార్యను, ఏడునెలల కుమారుడిని బలవంతంగా సమీపంలోని దేవాలయానికి తీసుకెళ్లాడు. అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తుల వద్ద రూ. 10 వేలు తీసుకుని పసికందును అమ్మేశాడు. అలా చేయొద్దని తాను అభ్యంతరపెట్టినందుకు తనను కొట్టాడని, పిల్లాడిని తన దగ్గర్నుంచి లాక్కున్నాడని లోహర్ భార్య సనామతి చెప్పారు. కొడుకును అమ్మిన తర్వాత అత్త వారింటికి వెళ్లి.. కొడుకు చనిపోయాడని వారిని నమ్మించే ప్రయత్నం చేశాడు. కానీ వారు అతడిని నమ్మక నిలదీసి, అమ్మేసిన విషయం తెలిసి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

కేంద్రానికే టోకరా.. కోట్లు చోరీ!

కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖను మోసగించేందుకు యత్నించిన 21 ఏళ్ల అస్సోం యువకుడిని దిల్లీ పోలీసులు అరెస్టుచేశారు. అప్పటికే వివిధ శాఖల అధికారులను బురిడీ కొట్టించి రూ.4 కోట్లు కొల్లగొట్టినట్లు గుర్తించారు. ఒకసారి ఇదే తరహా నేరానికి అరెస్టయి... బెయిల్‌పై వచ్చినా బుద్ధి మారలేదు. ఫలితంగా ఇప్పుడతడు మరోమారు కటాకటాలు లెక్కపెడుతున్నాడు. కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖకు లలిత్ డాగర్ పేరుతో ఓ మెయిల్ వచ్చింది. చెన్నైలోని కార్మికశాఖలో పే అండ్ అకౌంట్స్ అధికారిగా ఎంపికయ్యానని, తనకు ఉద్యోగి యూజర్ ఐడీ, తదితరాలను అందివ్వాలని కోరాడు. ధ్రువీకరణ కోసం చరవాణి సంఖ్య, రెండు పత్రాలను పంపాడు. అందులో నకిలీ నియామక పత్రం చూసి కార్మికశాఖ అధికారులకు అనుమానం వచ్చింది. ఆ పేరుతో నియామకాలేవీ జరగలేదని గుర్తించి దిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అస్సోంకు చెందిన నూర్ మహ్మద్ అలీగా గుర్తించి, అరెస్టు చేశారు. అలీ ఇంతకుముందు వివిధ మంత్రిత్వ శాఖలే లక్ష్యంగా మోసానికి పాల్పడుతూ రూ. 4 కోట్లు కొట్టేశాడని అభియోగాలు ఉన్నాయి. ఇలాంటి ఓ కేసులో ఇంతకుముందే అరెస్టయ్యాడు. ఇటీవలే బయటకు వచ్చి.. రాగానే కార్మిక శాఖను మోసగించేందుకు విఫల యత్నం చేసి... మళ్లీ దొరికేశాడు.

టీమిండియా కోసం ప్రత్యేక చీర

ప్రపంచకప్ సెమీఫైనల్స్‌లో భారతజట్టు ఓడిపోయినా, న్యూజిలాండ్‌పై గెలవాలని క్రికెట్ ప్రియులు కోరుకున్నారు. వారణాసికి చెందిన చేనేత కళాకారులు భిన్నంగా ఆలోచించారు. నీలిరంగు జెర్సీతో పాటు.. క్రికెట్ ప్రపంచకప్ ట్రోఫీ డిజైన్లు, క్రికెట్ బ్యాట్, బంతులతో ప్రత్యేక బనారస్ చీర రూపొందించారు ఉత్తర్‌ప్రదేశ్ వారణాసికి చెందిన వ్యాపారవేత్త సర్వేశ్. ఇందుకోసం 10 మంది చేనేత కార్మికులు నెలరోజులు కష్టపడ్డారు. చీర డిజైన్‌లో 250కి పైగా ప్రపంచకప్ ట్రోఫీలను ముద్రించారు. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో భారత్ జెర్సీలోని నారింజ రంగును.. చీర అంచున డిజైన్ చేశారు. టీమిండియా ప్రపంచకప్ గెలిస్తే బహుమతిగా ఈ చీర ఇవ్వాలని స్వతహాగా క్రికెటర్ అయిన సర్వేశ్ భావించారు.

ఈ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

నీట్‌లో మంచి ర్యాంకు రాలేదని విద్యార్థిని బలవన్మరణం

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

వసంత

బిజినేపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు రాలేదన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన రాంపురం సుల్తాన్, బీములమ్మ దంపతుల మొదటి కుమార్తె వసంత(18) ఇంటర్ బైపీసీ పూర్తి చేసింది. వైద్య విద్యలో ప్రవేశం కోసం నీట్ రాసింది. గత నెలలో విడుదలైన ఆ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సరైన ర్యాంకు రాలేదు. అప్పటి నుంచి వసంత మనోవేదనకు లోనయ్యేది. మంగళవారం రాత్రి పురుగుల మందు తాగగా.. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి అనంతరం మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మండలి ఛైర్మన్ ఉత్తర్వులు సబబే

- రాములునాయక్, యాదవరెడ్డిల పిటిషన్లపై హైకోర్టు వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: ఎమ్మెల్సీ సభ్యత్వంపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి ఛైర్మన్ జనవరి 16న వెలువరించిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్సీలు కె.యాదవరెడ్డి, ఎస్.రాములునాయక్‌లు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లను కొట్టివేస్తూ బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. మండలి ఛైర్మన్ జారీచేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా లేవని పేర్కొంది. పిటిషన్‌లను అనుమతించడానికి ఎలాంటి కారణాలు లేవని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. గత ఏడాది సెప్టెంబరు 14న దిల్లీలో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారన్న కారణంగా వారిపై అనర్హత వేటు వేసినట్లు మండలి తరపు న్యాయవాది తెలిపారు. గవర్నరు నామినేట్ చేసిన వ్యక్తికి పార్టీ ఉండదని, స్వతంత్ర అభ్యర్థిగా ఉంటారన్న రాములునాయక్ వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. వీరిపై అనర్హత వేటుకు సంబంధించి మండలి సమర్పించిన రికార్డులను పరిశీలించిన హైకోర్టు రాములునాయక్, యాదవరెడ్డిల పిటిషన్‌లను కొట్టివేసింది. తీర్పును సవాలుచేస్తూ సుప్రీంకోర్టుకు వెళతామని.. అందువల్ల వారం రోజులపాటు ఈ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయకూడదంటూ ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వాలని యాదవరెడ్డి తరపు సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి అభ్యర్థించారు. ఒకసారి పిటిషన్లను కొట్టివేసిన తర్వాత ఎన్నికలను నిర్వహించవద్దని తామెలా ఆదేశాలు ఇవ్వగలమని ధర్మాసనం ప్రశ్నించింది. అలాంటి ఉత్తర్వులను ఇవ్వజాలమని తెలిపింది. తీర్పు వెలువడ్డాక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్ని రోజుల్లో జారీచేస్తారని ఎన్నికల సంఘం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. వీలైనంత త్వరగా నోటిఫికేషన్ జారీ చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది అవినాశ్‌దేశాయ్ తెలిపారు. సోమవారందాకా నోటిఫికేషన్ జారీ చేయకుండా ఉండటానికి వీలవుతుందేమో చూడాలని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని ధర్మాసనం న్యాయవాదికి సూచించింది.

నామా x నిర్మలా సీతారామన్

- 'ఇంటింటికీ నీరు'పై ఇరువురి సంవాదం
- తెలంగాణలో ఇప్పటికే 'హర్ ఘర్ జల్' : నామా
- తొలుత చేపట్టింది గుజరాతేనన్న నిర్మలా సీతారామన్

ఈనాడు, దిల్లీ: ఇంటింటికీ నీరు విషయంలో మిషన్ భగీరథతో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని తెరాస ఎంపీలు తరచూ సభలో చెబుతుండడంతో.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. గుజరాతే దాన్ని తొలుత మొదలుపెట్టిందంటూ ఆ క్రెడిట్ తమ పార్టీకే దక్కేలా మాట్లాడారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా నిర్మలా సీతారామన్, తెరాస లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు మధ్య ఈ ఆసక్తికర చర్చ సాగింది. ఆర్థిక మంత్రి మాట్లాడుతున్న సమయంలో ఆయా అంశాలపై స్పష్టీకరణకు సమయం ఇవ్వాలని సభాపతి ఓం బిర్లాను నామా కోరారు. హర్ ఘర్ జల్ (ఇంటింటికీ నీరు) ఇప్పటికే ఇస్తున్నామని చెప్పారు. నీతి ఆయోగ్ సైతం ఆ పథకానికి నిధులు ఇవ్వాలని సూచించిందని తెలిపారు. అయిదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలంటే రాష్ట్రాలను కలుపుకొని వెళ్లాలని సూచించారు. 70:30 శాతం తీరుగానైనా ఆయా పథకాలకు (మిషన్ భగీరథ వంటి వాటికి) నిధులు ఇవ్వాలని కోరారు. స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తెలంగాణ ఎన్నో ఆసక్తికర మైన అంశాలు అమలు చేస్తోందన్నారు. అనేక రాష్ట్రాలు ఇంటింటికీ నీరు విషయంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని.. గుజరాత్ తొలుత దాన్ని చేపట్టిందని.. తెలంగాణ ప్రభుత్వం సైతం గుజరాత్ వెళ్లి చూసి ఉండొచ్చన్నారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలు ఈ అంశంలో పలు ప్రయోగాలు చేశాయని తెలిపారు.

నిర్మాణంలోని భవనం కూలి ఆరుగురు దుర్మరణం

- బెంగళూరులో దుర్ఘటన

శిథిలాల తొలగింపులో అగ్నిమాపక సిబ్బంది

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం కూలి బెంగళూరులో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పులికేశినగర పోలీసు ఠాణా పరిధిలోని హచిన్స్ రహదారిలో నిర్మాణ దశలో ఉన్న నాలుగంతస్తుల అపార్ట్‌మెంట్ (ఆది అంబాల్) దాని పక్కనే నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంపై ఒక్కసారిగా ఒరిగిపోయింది. ఆది అంబాల్ అపార్ట్‌మెంట్ నేల అంతస్తులో ఉంటున్న కాపలాదారు నారాయణ (35), ఆయన భార్య నిర్మల (27), కుమార్తె అనుష్క (3)తో పాటు మంజులా దేవి (38), ఖడన్ (31) అనే మరో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. శంభుకుమార్ అనే మరో కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు పోలీసులు తెలిపారు. కాపలాదారుని కుటుంబంతో పాటు భవనంలో వడ్రంగి పనులుచేసే 15 మంది అపార్టుమెంట్ నేల అంతస్తులో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. శిథిలాల్లో చిక్కుకున్న వారిని ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించి ఆసుపత్రులకు తరలించారు. ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా ముగ్గురు బయటపడ్డారు. నిర్మాణం పూర్తికాక ముందే భవనం లోపల పనుల్ని చేపట్టారు. మరో భవనంలో పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. భవన నిర్మాణ ప్రదేశంలో భూమిలో తేమ ఉండటం, ఫిల్టర్ ఇసుక వినియోగించడం వల్ల రెండు భవనాల పునాదులు కుంగిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలపై తెరాసలో చర్చ

ఈనాడు, హైదరాబాద్: రాములు నాయక్, యాదవరెడ్డిల ఎమ్మెల్సీ సభ్యత్వంపై అనర్హత వేటుకు సంబంధించి శాసనమండలి ఛైర్మన్ నిర్ణయానికి అనుగుణంగా హైకోర్టు తీర్పు వెలువడడంతో తెరాసలో ఈ రెండు స్థానాల భర్తీపై చర్చ మొదలైంది. రాములునాయక్ గవర్నర్ కోటాలో, యాదవరెడ్డి శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ పదవి పొందారు. మళ్లీ ఎన్నికలు జరిగితే ఈ రెండు స్థానాలు తెరాసకే దక్కుతాయి. అనర్హత వేటు కారణంగా ఏర్పడే ఈ రెండింటిని ముఖ్యనేతలకు ఇవ్వాలని అధిష్ఠానం ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో ఒక స్థానానికి మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరు ఖరారవగా, రెండోస్థానానికి బస్వరాజు సారయ్య, గట్టు రామచందర్‌రావు, గ్యాదరి బాలమల్లు, బండి రమేశ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డిలు ఆశావహులుగా ఉన్నారు.

ముగ్గుర్ని బలిగొన్న బావి

- ఒకరి తర్వాత ఒకరు దిగిన యువకులు
- శ్వాస ఆడక మృత్యువాత
- కుమురం భీం జిల్లాలో ఘటన

బావిలో యువకుల మృతదేహాలు

కౌటాల, న్యూస్‌టుడే: ఒకరి తర్వాత ఒకరుగా ఇంటి వద్దనున్న బావిలో దిగిన ముగ్గురు అందులోనే ప్రాణాలు కోల్పోయారు. కుమురం భీం జిల్లా కౌటాల మండలంలో బుధవారం జరిగిన ఘటన మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

ముత్యంపేట గ్రామానికి చెందిన కారెం మహేష్(17) ఇంట్లోని బావిలో బిగించిన విద్యుత్తు మోటారుకు మరమ్మతు చేసే నిమిత్తం అందులో దిగాడు. ఎంతకీ తిరిగి రాకపోవడం, ఉలుకూపలుకూ లేకుండా ఉండిపోవడంతో అనుమానించిన బావ వరసయ్యే చొక్కాల శ్రీనివాస్(25) విద్యుత్తు సరఫరా నిలిపేసి అందులో దిగాడు. ఆయనా తిరిగిరాకపోవడం, పిలిచినా స్పందన లేకపోవడంతో ఆయన బావమరిది గాదిరెడ్డి రాకేశ్(19) బావిలో దిగి అక్కడే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులిచ్చిన సమాచారం మేరకు పోలీసులు మందమర్రి నుంచి రెస్క్యూ బృందాలను రప్పించారు. బావిలో ప్రాణవాయువు అందక వారంతా మృతి చెందినట్టు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు ఘొల్లుమన్నారు. ఒకర్ని కాపాడటం కోసమని ఇంకొకరు..ఇలా ముగ్గురూ అనంత లోకాలకు వెళ్లడంతో గ్రామంలో విషాదం అలముకుంది.

మూడు కుటుంబాల్లో విషాదం

కారెం రాజు, బుజ్జవ్వ దంపతులకు మహేష్ ఒక్కడే సంతానం. ఇంటర్ చదువుతున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు చూస్తుండగానే కన్నుమూయడంతో ఆ దంపతులు కుప్పకూలారు. గాదిరెడ్డి అంజయ్య, లక్ష్మక్క దంపతులకు ఒక కుమారుడు రాకేశ్, ఓ కుమార్తె. కుమారుడు, అల్లుడు శ్రీనివాస్ మరణంతో వారు తల్లడిల్లారు. బుజ్జవ్వ, లక్ష్మక్క అక్క చెల్లెళ్లు.

పటాన్‌చెరులో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటాం

తెరాస లోక్‌సభాపక్ష ఉపనేత కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: పటాన్‌చెరు ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెరాస లోక్‌సభాపక్ష ఉప నేత కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వెలువరించిన నివేదికలో అత్యంత కాలుష్య ప్రాంతాల్లో పటాన్‌చెరు ఉండడంపై బుధవారం ఆయన 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు. హైదరాబాద్‌కు చేరువగా ఉండడం.. మౌలిక వసతులు మెరుగ్గా ఉండడంతో పెద్దఎత్తున పరిశ్రమలు అక్కడే స్థాపించారని తెలిపారు. పాతకాలపు సాంకేతికతతో కాలుష్యం ఎక్కువవుతోందని.. ఈ నేపథ్యంలో పరిశ్రమల యజమానులతో పలుమార్లు చర్చించామని తెలిపారు. కాలుష్య నియంత్రణపై గత ప్రభుత్వాలు ఏమాత్రం దృష్టిపెట్టలేదన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం తరపున యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కృష్ణా, గోదావరి బోర్డుల్లోకి సోమేష్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదీ యాజమాన్యబోర్డుల్లో తెలంగాణ తరపున పరిపాలనా సభ్యునిగా సోమేష్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్.కె.జోషి సభ్యునిగా ఉండగా, ప్రస్తుతం నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో సోమేష్‌కుమార్ సభ్యునిగా నియమితులయ్యారు.

చెన్నమనేని రమేశ్‌కు ఊరట

- పౌరసత్వంపై కేంద్రం ఉత్తర్వుల రద్దు
- అభ్యంతరాలన్నింటినీ పునఃపరిశీలించి నిర్ణయం వెలువరించండి
- కేంద్రానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: భారత పౌరసత్వం వ్యవహారంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన భారత పౌరుడు కాదంటూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. రమేశ్ పౌరసత్వానికి సంబంధించి చట్ట ప్రకారం లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాక తిరిగి ఉత్తర్వులు జారీ చేయాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది. అభ్యంతరాలన్నింటినీ 3వారాల్లో కేంద్రానికి సమర్పించాలంటూ ప్రతివాది అయిన ఆది శ్రీనివాస్‌ను, తరువాత 12 వారాల్లో నిర్ణయాన్ని వెలువరించాలం

మకరందం
ఈనాడు
7 కరీంనగర్, గురువారం జులై 11, 2019

యద్భావం తద్భవతి!
నువ్వు ఎలా తలిస్తే అలా...
భగవత్ భక్తిలో భావం ఉంటుంది.
ఆ భావానికి అనుగుణంగానే అవతారం ఉంటుంది..
ఉడుపిలో బాలకృష్ణుడైనా, బృందావనంలో రాధాకృష్ణుడైనా,
నవద్వీపంలో నవనీతచోరుడైనా...
భక్తుల భావాలకు శ్రీకృష్ణుడు ప్రతిరూపంగా నిలిచాడు...
పండరీపురంలోనూ అంతే...
భక్తుడు అక్కడ నిలవమంటే అలా నిల్చుండిపోయాడు...
పుండరీకుడిని అనుగ్రహించిన ఆయన స్వరూపం
అపురూపం... ఆయన కృప అపారం...

భక్తజన హృదయాంతరంగ

హే... పాండురంగా!

మహారాష్ట్రలో చంద్రభాగ నదీతీరంలోని పండరీపురంలో పూజలందుకుంటున్న పాండురంగడిని భక్త సులభుడిగా భావిస్తారు. శ్రీకృష్ణుడే విఠలుడిగా వెలిశాడని నమ్ముతారు. విఠోబాగా కొలుస్తారు. వార్కరీ సంప్రదాయం ప్రకారం విఠ్ అంటే ఇటుక, ఠల అంటే నిలుచుని ఉన్న అనే రెండు పదాల కలయిక. విఠలుడంటే ఇటుకపై నిలుచున్న వాడని అర్థం. ఈ రూపం మిగిలిన శ్రీకృష్ణ రూపాలకు భిన్నంగా కనిపిస్తుంది. నెమలిపింఛం, చేతిలో వేణువు ఈ రూపంలో కనిపించవు. చేతులు నడుముపై పెట్టుకుని ఉన్న బాలుడి రూపంలో స్వామి దర్శనమిస్తాడు. మూడడుగుల తొమ్మిది అంగుళాల నల్లటి విగ్రహాన్ని భక్తకవులు సాక్షాత్తు పరబ్రహ్మంగా దర్శించారు. తలపై ఉన్న పొడవాటి కిరీటం లింగరూపంలో కనిపిస్తుంది కాబట్టి శివకేశవ రూపంగానూ స్వామిని భావిస్తారు. జ్ఞానేశ్వరుడి అభిప్రాయం ప్రకారం విఠోబా శివుణ్ణి తలపై మోస్తున్నాడు. వైష్ణవ పురాణాల ప్రకారం మొట్టమొదటి విష్ణుభక్తుడు శివుడే. అంటే పాండురంగడైన విఠోబా భక్తుల భారాన్ని తలపై మోస్తున్నాడన్నమాట. భక్త తుకారాం వర్ణన ప్రకారం కౌస్తుభమణితో కూడిన తులసిమాలను, మకర కుండలాలను విఠోబా ధరించి ఉంటాడు.

పరమాత్మ పాండురంగడిగా అవతరించడానికి కారణమైన దివ్య సంఘటన ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేస్తుంది. పుండరీకుడు పరమ నాస్తికుడు. తల్లిదండ్రులను విస్మరించి, భార్య మాటను లెక్కచేయకుండా తన సుఖం కోసం తిరిగేవాడు. దైవానుగ్రహం వల్ల విష్ణుభక్తుడుగా మారాడు. తల్లిదండ్రుల సేవకు మించింది లేదని తెలుసుకున్నాడు. ఒకసారి వారి సేవలో మునిగి ఉన్నప్పుడు శ్రీకృష్ణుడు అతని ఇంటికి వచ్చి పుండరీకుణ్ణి బయటకు రమ్మని పిలుస్తాడు. అమ్మనాన్నల సేవలో ఉన్నాను కాసేపు ఆ మెట్టుమీద నిల్చో, వస్తాను అని అంటాడు పుండరీకుడు. అక్కడే శిలారూపంలో దివ్యకాంతులు వెదజల్లుతూ అవతరించాడు స్వామి. ఆ క్షణం నుంచి పుండరీకుణ్ణి ఉద్ధరించిన స్వామి పాండురంగడుగా, ఆయన వెలసిన ఆ పవిత్ర స్థలం పండరీపురం క్షేత్రంగా మారిపోయిందని చెబుతారు. పుండరీకుడి ప్రస్తావన స్కాంద పురాణంలో, పద్మపురాణంలో కనిపిస్తుంది. శ్రీధరుడు రాసిన పాండురంగ మహాత్మ్యం అనే గ్రంథంలో, భక్త కవులు రాసిన అభంగాల్లో పుండరీకుణ్ణి గురించి ఉంది.

వార్కరీ సంప్రదాయానికి చెందిన భక్తకవులను కరుణించిన వాడిగా పాండురంగడు ప్రసిద్ధిచెందాడు. పుండరీకుడి మార్గాన్ని అనుసరించి ఎంతోమంది భక్తకవులు స్వామి సేవలో తరించారు. వారిలో జ్ఞానేశ్వర్, ఏక్‌నాథ్, నివృత్తినాథ్, తుకారాం, నామ్‌దేవ్, చోఖమేళా, ఘోరకుంభార్, సావంత్‌మాలి, జానా బాయి, కన్హో సక్కుబాయి, ముక్తాబాయి తదితరులు ప్రసిద్ధిపొందారు. విఠోబా ఆరాధన ఎప్పుడు ప్రారంభమైందనే విషయంలో స్పష్టతలేకున్నా ఎనిమిదో శతాబ్దానికి చెందిన ఆదిశంకరులు రాసిన పాండురంగాష్టకం స్తోత్రాన్నిబట్టి విఠోబా ఆరాధన అంతకుముందు కూడా ఉందని అర్థం చేసుకోవచ్చు. పండరీపురం ఆలయంలోని ఓ రాతి స్తంభంపై క్రీ.శ. 1237 నాటి శాసనాన్ని కనుగొన్నారు. దాని ప్రకారం హొయిసల రాజైన సోమేశ్వరుడు విఠలుడి వైద్య నివేదన ఖర్చుల కోసం ఒక గ్రామాన్ని దానం చేశారు. అదే పాండురంగడి ఊరు పండరీపురం.

అహో వార్కరి...

ఏటా ఆషాఢశుద్ధ ఏకాదశికి పండరీపుర క్షేత్రంలో వార్కరీ ఉత్సవం జరుగుతుంది. వారి అంటే యాత్ర... కారి అంటే నిర్వహించేవారు అని అర్థం. ప్రయాణం చేస్తూ పరమార్థాన్ని పదిమందికీ పంచడమే వార్కరీ సంప్రదాయం. క్రీ.శ 13వ శతాబ్దానికి చెందిన జ్ఞానేశ్వర్ మహారాజ్ సమాధి క్షేత్రం ఆళంది నుంచి, క్రీ.శ. 17వ శతాబ్దానికి చెందిన భక్త తుకారాం సమాధి ఉన్న దేహూ నుంచి పాద యాత్రలు ప్రారంభమవుతాయి. ఆ రెండు క్షేత్రాల నుంచి నిర్వహించే 250 కిలోమీటర్ల పాదయాత్రనే వార్కరీ యాత్రగా పిలుస్తారు. ఇందులో భాగంగా ఆళంది నుంచి జ్ఞానేశ్వర్ పాదుకలను, దేహూ నుంచి తుకారం పాదుకలను పల్లకీల్లో తీసుకెళతారు. 21 రోజులపాటు జరిగే ఈ పాదయాత్రలు సరిగ్గా తొలిఏకాదశి ముందు రోజు పండరీపురం చేరుకుంటాయి. భక్తులు ఎంతో దీక్షతో, క్రమశిక్షణతో సాగించే భక్తియాత్ర ఇది. ఇందులో పాల్గొనే భక్తులు కఠోర నియమాలు పాటిస్తారు. మద్యమాంసాలు, ఉల్లి వంటి వాటికి దూరంగా ఉంటారు. బ్రహ్మచర్యం పాటిస్తారు. పాదరక్షలు లేకుండా నడుస్తారు. మెడలో తులసిమాల ధరిస్తారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రతి భక్తుణ్ణి పాండురంగడిగా భావించి ఆదరిస్తారు. కులం, ప్రాంతంతో సంబంధం లేకుండా సమూహాలుగా భజనలు, పాటలు పాడుకుంటూ ముందుకు సాగుతారు. ఈ వార్కరీ ఉద్యమం మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనిపలు ప్రాంతాల నుంచి కూడా యాత్ర జరుగుతుంది.

– ఆనందసాయి స్వామి

ఈనెల 12 వార్కరీ ఉత్సవం

ఎందరో మహానుభావులు

పుండరీకుడు మరెందరో మహాభక్తులకూ ఆదర్శప్రాయుడు. ఆయన బాటలో నడిచి, పాండురంగడి సేవలో తరించిన భక్తశిఖామణులెందరో. వారు మహారాష్ట్రలో భక్తి ఉద్యమానికే కాదు, సాంఘిక సంస్కరణలకూ ఆద్యులు...



జ్ఞానేశ్వర్: ఆళందిలో జన్మించారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వాగ్గేయకారుడు, తత్త్వవేత్త. క్రీ.శ.13వ శతాబ్దానికి చెందినవాడు. వార్కరీతత్త్వంలో జీవించారు. నాథ సంప్రదాయానికి చెందిన ఈయన గురువు నివృత్తినాథుడు. భగవద్గీతపై ఈయన రాసిన గ్రంథం, అమృతానుభవం అనే మరాఠీ గ్రంథం చాలా ప్రాచుర్యంపొందాయి.

నామదేవుడు: 12వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారుడు. వార్కరీ సంప్రదాయంలో ప్రముఖుడు. ఈయన రాసిన అనేక గీతాలు అందరూ పాడుకునే భజనపాటలుగా ప్రాచుర్యం పొందాయి. ఈయన పాటల్లో సగుణ, నిర్గుణ బ్రహ్మతత్త్వం గోచరమవుతుంది.

చోఖమేళా: 14వ శతాబ్దానికి చెందిన గొప్ప వార్కరీ సంతు. ఈయన చాలా అభంగాలు రచించారు. మహారాష్ట్రలోని మంగళ్‌వేడా ప్రాంతానికి చెందినవారు. దళిత కవుల్లో ప్రథములు. పండరీపురాన్ని తన నివాసంగా మార్చుకున్నారు. చంద్రభాగ నదీ ఒడ్డున నివసించేవారు. ఈయన సమాధి విఠల ఆలయం ఎదురుగా ఉంది.

తుకారాం: పాండురంగడి మహాభక్తుడు. 17వ శతాబ్దంలో జీవించారు. భగవత్‌సాక్షాత్కారం కోసం పట్టుదలతో దీక్ష సాగించారు. ఎన్నో అభంగాలు రచించారు. సాటి మనిషిలో భగవంతుడిని చూడాలని బోధించేవారు.

ఏకనాథుడు: 16వ శతాబ్దం చివర్లో జీవించారు. వార్కరీ సంప్రదాయంలో ముఖ్యుడైన భానుదాస్ ఇతన్ని పెంచి పెద్దచేశారు. మరాఠీ సాహిత్యంలో ముందు తరం వారైన జ్ఞానేశ్వర్, నామదేవుడు... తరువాతి తరం వారైన తుకారాం, సమర్థ రామదాసులకు వారధిగా నిలిచారు.

ముక్తాబాయి: సంత్ జ్ఞానేశ్వర్ సోదరి. తన జీవితంలో 41 అభంగాలు రచించారు. ఆళందిలోనే జీవించి అక్కడే దేహం విడిచిపెట్టారు.

సక్కుబాయి: మహారాష్ట్రలోని క్రార్ అనే గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. పాండురంగ విఠలుని అత్యంత భక్తిశ్రద్ధలతో సేవించేవారు. ఈ క్రమంలో ఎన్నో బాధలు, పరీక్షలు ఎదుర్కొన్నారు. కానీ విఠోబా పాదాలు మాత్రం విడవలేదు. సనాతనభక్తి ఉద్యమంలో ఈమెది చాలా ముఖ్యపాత్ర.

ఈనెల 16 శాకంబరీ పూజ



బిడ్డల కోసం ఆహారం!

అమ్మ సర్వాంతర్యామి...
ఆకైనా, అలమైనా, కాయయినా, పండయినా వాటిలోని జవం, జీవం ఆమె చైతన్యమే... అందుకే ఆ మూల ప్రకృతికి ప్రణమిల్లుతాం. ప్రణతులు అర్పిస్తాం. పంటలు తొలిదశలో ఉన్న సమయంలో వివిధ కూరగాయలను సమర్పించి, వాటితో అలంకరించి అమ్మవారిని పూజించడం సంప్రదాయం. ఆషాఢమాసంలో శుక్లపక్ష పౌర్ణమిరోజు జరిగే శాకంబరీ ఉత్సవం ఇహపర సందేశాలను అందిస్తుంది.

దుర్గాదేవి ఒక్కో రూపానిది ఒక్కో ప్రత్యేకత. ఆ స్వరూపాలన్నీ అమ్మకు అలంకరణలే కాదు... అవన్నీ భక్తులు తనను వివిధ రూపాల్లో ఉపాసించేందుకు ఆమె సూచించిన మార్గాలు. ఆ పరంపరలో శాకంబరీదేవిగా ఆ జగజ్జనని శోభాయమాన ఆహార్యంతో అలరారుతుంది. అఖండమైన శక్తితో ఆశీస్సులు అందిస్తుంది. దుర్గాసప్తశతిలోని ఆఖరి అధ్యాయమైన 'మూర్తి రహస్యం' ఆ లోకపావని రూపాన్ని అద్భుతంగా వర్ణించింది. శాకంబరి దేవి నీలవర్ణ దేహంతో, మహావిద్యకు ప్రతీక అయిన రత్నమణిమయ కిరీటాన్ని ధరించి, తన బిడ్డలను దయాదృక్కులతో వీక్షిస్తూ కొలువై ఉంటుందని చెప్పింది. ఈ శాకంబరి రూపంపై ధ్యానం చేయడం ఆధ్యాత్మికసాధనలో భాగం. స్కాంద పురాణంలో, దేవీ భాగవతంలో శాకంబరీదేవి గురించి ఉంది. అమ్మ వైభవాన్నే కాకుండా, ఉపాసనా విధానాలు కూడా వీటిలో విస్పష్టంగా ఉన్నాయి. అసలీ తల్లి అవతరించడానికి కారణంగా చెప్పే కథ కూడా మనిషి బాధ్యతను గుర్తు చేస్తుంది.

ఒకప్పుడు దుర్గముడు అనే రాక్షసుడు తీవ్రంగా తపస్సు చేసి బ్రహ్మదేవుడి నుంచి వరాలు పొందాడు. దేవతలు సహా అందరూ వేద విజ్ఞానాన్ని మరచిపోవాలని, నిగమ జ్ఞానమంతా తనకే దక్కాలని వరాన్ని కోరుకున్నాడు. అందరూ వేద విజ్ఞానాన్ని మర్చిపోవడంతో చాతుర్వర్ణాల వారు తమ విధులను విస్మరించారు. వృత్తి నిపుణులు నైపుణ్యాలను మరచిపోయారు. దీంతో పరిస్థితులు అస్తవ్యస్తమయ్యాయి. భూరక్షణ, వ్యాపారం, యజ్ఞయాగాదులు స్తంభించాయి. ఎక్కడ చూసినా కరవు. ప్రజలు ఆకలితో అలమటించారు. అప్పుడు రుషులు సుమేరు పర్వత గుహల్లోకి వెళ్లి తపస్సు చేశారు. దీంతో నీలవర్ణంతో, చతుర్భుజాలతో, ధనుర్బాణాలతో అమ్మవారు ప్రత్యక్షమయ్యారు. తన బిడ్డల దుస్థితిని చూసి ఆమె తొమ్మిది రోజులపాటు కంటికీమింటికీ ఏకధారగా రోదించారు. ఆ కరుణామృతసాగరి కన్నీటికి ఈ భూమిపై నదులన్నీ నిండిపోయాయి. అంతేకాకుండా అశేష జనవాహిని ఆకలికేకల్ని విని ఆమె శాకంబరిగా మారిపోయింది. తన శరీర భాగాలన్నిటినీ పండ్లు, గింజలు, కూరగాయలు, ఆకుకూరలుగా రూపాంతరం చెందేలా చేసింది. అన్నిటినీ తన బిడ్డలకు పంచి తక్షణమే అందరి ఆకలి తీర్చింది. కరవుకాటకాలను అంతం చేసింది. ఆ తర్వాత దుర్గమాసురుణ్ణి సంహరించింది. మనిషి విజ్ఞానం మనుషులను, ప్రకృతిని రక్షించేదిగా ఉండాలి తప్ప విధ్వంసానికి దారితీయకూడదు. ఎప్పుడైతే మనిషి హద్దులు మీరతాడో, ప్రకృతి హననానికి పాల్పడతాడో అప్పుడు సంక్షోభాలు, కరవుకాటకాలు తలెత్తుతాయి. లోకకల్యాణమే జ్ఞానానికి తుదిలక్ష్యం కావాలి అని ఈ కథ మనకు ఉద్బోధిస్తుంది. అమ్మను అనేక రకాల కూరగాయలు, ఆకులతో అలంకరించడం వెనక అంతరార్థం ప్రకృతిని అమ్మగా గ్రహించమని చెప్పడమే.

–చైతన్య

ఈనెల 16 సింహగిరి ప్రదక్షిణ

అప్పన్నా... వస్తున్నా!

అప్పన్నా... అని ఆర్తితో పిలిస్తే చాలు అభయహస్తం అందించే దైవంగా శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామిని కొలుస్తారు భక్తులు. ప్రహ్లాదుడి కోరిక మేరకు సింహగిరిపై వరాహ, నరసింహ రూపాలు ఏకమైన అవతారం భక్తులను అనుగ్రహిస్తోందని నమ్ముతారు. ఈ విశిష్ట క్షేత్రంలో ఆషాఢమాసంలో గిరి ప్రదక్షిణ వైభవోపేతంగా జరుగుతుంది. ఎండ, వానలను లెక్క చేయకుండా... పిల్లలు మొదలు వృద్ధుల వరకు కాలినడకన సింహగిరిని చుట్టివస్తారు. గిరి పరిసరాలు హరినామస్మరణలతో మార్మోగుతాయి. ఈ ఏడాది ఉత్సవం ఈ నెల 15న జరగనుంది. సుమారు 10లక్షల మంది భక్తులు పాల్గొనే ఈ ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ప్రదక్షిణ ఇలా...

జులై 15న సింహాచలం కొండ దిగువన తొలిపావంచా వద్ద గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుడతారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు సింహాచలేశుని ఉత్సవమూర్తుల రథయాత్ర ప్రారంభమవుతుంది. పుష్పరథం వెంట జనతరంగం అశేషంగా తరలివెళ్తుంది. 32 కిలోమీటర్ల ప్రదక్షిణ పూర్తి చేసుకుని తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకుంటుంది.. అక్కడి నుంచి భక్తజనం మెట్లమార్గం గుండా సింహగిరికి చేరుకుని పౌర్ణమి నాడు సింహాచలేశుని దర్శించుకుని పునీతులవుతారు. గిరి ప్రదక్షిణ చేయలేని భక్తులు సింహగిరిపై ఆలయం చుట్టూ 32సార్లు ప్రదక్షిణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు ఈనెల 16 ఆషాఢ పౌర్ణమినాడు చందన సమర్పణ అనంతరం స్వామిని దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోంది.

– శ్రీధర్, అడివివరం

ఆ పక్షులను చూడండి...

క్రీస్తువాణి

ఒక పెద్దాయన చింతించడం ప్రారంభించాడు.

తన ఆస్తి నాలుగు తరాల వరకు సరిపోతుంది. ఆ తరువాత పరిస్థితి ఏంటి?

ఈ ఆలోచనలతో అతని బాధ ద్విగుణీకృతమైంది. అలా బాధపడుతూనే తనువు చాలించాడు.

అతడి చింత చితి వరకు ప్రయాణించేలా చేసింది. ఈ సందర్భంలో క్రీస్తువాణి గుర్తు చేసుకోవాలి.

'ఆకాశ పక్షులను చూడండి. అవి విత్తవు. కోయవు. నిల్వ చేసుకోవు. అయినా దేవుడు వాటికి కావాల్సిన ఆహారం ఇస్తున్నాడు కదా'

ఇక్కడ ప్రభువు ఉద్దేశం సోమరులుగా ఉండమనికాదు. పోషణ కోసం కష్టపడాలి. కనీస అవసరాలు తీరాలంటే పని చేయాలి.

అయితే ఆయన దేనికోసం చింతపడాలి?

ఇక్కడ మీరు చింతిస్తున్నారంటే డబ్బుకు దాసులవుతున్నారన్న మాట.

ఈ భౌతిక సంపద పక్షిరాజు ఆకాశానికి ఎగిరిపోయినట్లు ఏదో ఒకరోజు ఎగిరిపోతుంది.

కానీ ఆధ్యాత్మిక సంపదలు ఎక్కడికీ పోవు. అవి శాశ్వతం. వాటికోసం ఆరాటపడండి. చింతించండి.

'మీలో ఎవరైనా బాధ పడడం వల్ల వారి ఎత్తు పెరుగుతుందా?'

కష్టం తర్వాత సుఖం ఉంటుంది. వేదన తర్వాత వేడుక ఉంటుంది. ఇవన్నీ వచ్చిపోయేవే.

కానీ నీలోని ఆధ్యాత్మికత నీ పరలోక సంపదను వృద్ధి చేస్తుందన్నది ప్రభువు ఉపదేశం.

– ఎం.సుగుణరావు

ఈనాడు సినిమా

అల్లు అర్జున్

సంక్రాంతి పండక్కి వచ్చేస్తున్నాడు!

సంక్రాంతి సీజన్ టాలీవుడ్‌కి చాలా కీలకం. ఎన్ని చిత్రాలొచ్చినా వసూళ్ల వర్షం కురిపించడం ఈ పండగ ప్రత్యేకత. అందుకే పెద్ద సినిమాలన్నీ వరుస కడుతుంటాయి. 2020 ముగ్గుల పండక్కి స్టార్లు సందడి చేయబోతున్నారు. ఆ జాబితాలో అల్లు అర్జున్ కూడా చేరారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. పూజా హెగ్డే కథానాయిక. గీతా ఆర్ట్స్, హారిక హాసిని క్రియేషన్స్ సంస్థలు తెరకెక్కిస్తున్నాయి. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. 'అలకనంద', 'నాన్న..నేను' అనే పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

తమన్నా

మేజర్ అజయ్‌కృష్ణ

మహేష్‌బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. రష్మిక మందన్న కథానాయిక. రామబ్రహ్మం సుంకర, దిల్‌రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కశ్మీర్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో మహేష్ ఆర్మీ మేజర్ పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. ఆ పాత్ర పేరు అజయ్ కృష్ణ అని ట్విటర్ ద్వారా వెల్లడించారు దర్శకుడు అనిల్ రావిపూడి. కశ్మీర్‌లో ఆపరేషన్ మొదలైందని ఆయన ట్వీట్ చేశారు. అజయ్ పేరుతో తెరపై కనిపించడం మహేష్‌కి కొత్త కాదు. 'ఒక్కడు', 'దూకుడు' చిత్రాల్లో ఆ పేరుతోనే సందడి చేశారు. 'పోకిరి'లో కృష్ణ మనోహర్ పేరుతో కనిపిస్తారు. ఆ రెండు పేర్లని గుర్తు చేస్తోంది 'సరిలేరు నీకెవ్వరు'లోని పాత్ర పేరు. వచ్చే సంక్రాంతికి విడుదల కాబోతున్న ఈ చిత్రంలో విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. 13 ఏళ్ల తర్వాత ఆమె నటిస్తున్న చిత్రమిది. జగపతిబాబు, రాజేంద్రప్రసాద్, బండ్ల గణేష్ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: దేవిశ్రీప్రసాద్.

అద్భుతం జరిగేటప్పుడు ఎవరూ గుర్తించరు. జరిగాక గుర్తించాల్సిన అవసరం లేదు.

చిత్రం: ఖలేజా
– పంపినవారు: బి.కృష్ణమాచారి, హైదరాబాద్

యముడితో ఆటాడినట్టే



విక్రమ్

విక్రమ్ కథానాయకుడిగా రాజేష్ ఎం. సెల్వ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ కె.కె'. అక్షర హాసన్, అభిహాసన్ కీలక పాత్రలు పోషించారు. తమిళ చిత్రం 'కదరమ్ కొండన్'కి అనువాద రూపమిది. టి.నరేష్ కుమార్, టి.శ్రీధర్ ఈ నెల 19న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. టి.అంజయ్య సమర్పిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "యాక్షన్ ప్రధానంగా సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఎలాంటి సవాళ్లనైనా అవలీలగా ఎదుర్కొనే సమర్థవంతమైన కమాండర్‌గా విక్రమ్ కనిపిస్తారు. ట్రైలర్‌లో వినిపించిన 'నువ్వు ఆడుతున్నది నాతో కాదు.. యముడితో' అనే సంభాషణని బట్టే విక్రమ్ ఎలాంటి పాత్రలో నటించారో అర్థమవుతోంది. ఆయన గెటప్ ఇందులో ప్రత్యేకంగా ఉంటుంది. స్క్రీన్‌ప్లే, విజువల్స్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అక్షర హాసన్ నటనకి ప్రాధాన్యమున్న పాత్రలో కనిపిస్తారు. అందరినీ అలరించేలా చిత్రాన్ని తీర్చిదిద్దారు దర్శకుడు. త్వరలోనే విడుదల ముందస్తు వేడుకని నిర్వహించబోతున్నాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్.

"ఒకొక్కరిలో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అందుకే ఒకరిని చూసి అనుకరించడం కాకుండా, మనలా మనం ఉండటానికి ప్రయత్నించాలి" అంటోంది తమన్నా. దక్షిణాది అగ్ర కథానాయికల్లో తమన్నా ఒకరు. హిందీలోనూ అవకాశాలు అందుకొంటోంది. నటి కావాలనే లక్ష్యంతోనే పెరిగి, తన కలల్ని సాకారం చేసుకొన్న కథానాయిక తమన్నా. మీ నటనపై ఎవరి ప్రభావం ఎక్కువగా ఉంటుందని అడిగితే... "మాధురీదీక్షిత్ డ్యాన్సులు చూడటం మొదలుకొని... టీవీల్లో ఏ కథానాయిక కనిపించినా వాళ్లని ప్రత్యేకంగా గమనించేదాన్ని. కానీ వాళ్లలా కాకుండా నాకంటూ ప్రత్యేకత ఉండాలనుకొన్నా. అలాగే కెరీర్‌ని తీర్చిదిద్దుకున్నా. పని విషయంలో తపన ఉంటే కోరుకొన్నవన్నీ దరి చేరుతాయనేది నా నమ్మకం. అందరూ నమ్మాల్సింది కూడా అదే" అంది తమన్నా.

అందరూ నమ్మాల్సింది అదే

జగపతిబాబు, నాని, లిప్సిక, అలీ, బిక్రమ్ దుగ్గల్, రవిశంకర్

ఎందుకూ పనికి రాని గొంతు.. డిస్నీ వరకూ వెళ్లింది

జాన్ ఫెవరూ దర్శకత్వం వహించిన హాలీవుడ్ చిత్రం 'ద లయన్‌కింగ్'. డిస్నీ వరల్డ్ స్టుడియోస్ సంస్థ నిర్మించింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈనెల 19న విడుదల కానుంది. 'లయన్ కింగ్'లోని ముఫాసా, స్కార్, సింబా, నల, పుంబా, టిమోన్ పాత్రలకు తెలుగులో రవిశంకర్, జగపతిబాబు, నాని, లిప్సిక, బ్రహ్మానందం, అలీ డబ్బింగ్ చెప్పారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రవిశంకర్ మాట్లాడుతూ "ముఫాసా అనే సింహానికి డబ్బింగ్ చెప్పాను. మానవ జీవితాల్లోని భావోద్వేగాలకు ఈ చిత్రం ప్రతిబింబంగా అనిపించింది. నా జీవితంలోని అనుభవాలు గుర్తుకొచ్చాయ"న్నారు. జగపతిబాబు మాట్లాడుతూ "అన్ని వయసుల వారినీ మెప్పించే చిత్రమిది. నేను డబ్బింగ్ చెప్పేటప్పుడు సినిమాని చూస్తూ ఆశ్చర్యానికి గురయ్యాను. యానిమేషన్ చిత్రానికి డబ్బింగ్ చెప్పడం చాలా కష్టం. ఎందుకంటే జంతువుల్లోని భావాలు, భావనలకి అతికేలా డబ్బింగ్ చెప్పాలి. ఇదివరకు నా వాయిస్ ఎందుకూ పనికిరాదని అన్నవాళ్లు ఉన్నారు. ఇప్పుడు నా గొంతు డిస్నీ వరకూ వెళ్లినందుకు గర్వంగా ఉంద"న్నారు. నాని మాట్లాడుతూ "ఇప్పటి వరకూ నా కోసం నేను సినిమాలు చేశాను. ఇది మాత్రం మా అబ్బాయి కోసం చేశాను. జంతువుల హావభావాలకి అతికేలా డబ్బింగ్ చెప్పేటప్పుడు నవ్వేసేవాణ్ని. బ్రహ్మానందం, అలీ డబ్బింగ్ చెప్పిన పాత్రలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇది హాలీవుడ్ చిత్రమే అయినా, మన భారతీయుల జీవితాల్లో తొణికిసలాడే భావోద్వేగభరితమైన కథ. అందుకే అందరికీ బాగా నచ్చేస్తుంద"న్నారు. "డిస్నీ తెరకెక్కించిన చిత్రానికి డబ్బింగ్ చెప్పడం నాకు దక్కిన గొప్ప గౌరవం. గొంతు విషయంలో అమితాబ్ బచ్చన్‌కు వచ్చినట్లే జగపతిబాబుకూ విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత అదే అమితాబ్‌ని ప్రపంచమంతా గొప్ప నటుడన్నారు. జగపతిబాబుని కూడా అన్ని భాషా చిత్రాలూ కోరుకుంటున్నాయి" అన్నారు అలీ. కార్యక్రమంలో బిక్రమ్ దుగ్గల్ పాల్గొన్నారు.

రాక్షస సంహారం

అనుపమ పరమేశ్వరన్, సాయి శ్రీనివాస్

పురాణాల్లోనే కాదు, ఆధునిక యుగంలోనూ రాక్షసులు ఉన్నారు. కాకపోతే రూపమే మారింది. రాక్షసుల్ని సంహరించడానికి దేవుడు ఇప్పటికీ అవతారాలు ఎత్తుతూనే ఉన్నాడు. ప్రతి యుగంలోనూ ఒక్కో రూపంలో రాక్షస సంహారం జరుగుతుంది. మరి మా చిత్రంలో ఎలా జరిగిందో? ఆ రాక్షసుడు ఎవరో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే అంటున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. రమేష్ వర్మ దర్శకుడు. కోనేరు సత్యనారాయణ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఆగస్టు 2న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "తమిళంలో మంచి విజయాన్ని అందుకున్న 'రాచ్చసన్' చిత్రానికి రీమేక్ ఇది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగుతుంది. దేవిశ్రీ ప్రసాద్ సోదరుడు, ప్రముఖ గాయకుడు సాగర్ ఈ చిత్రంతో సంభాషణల రచయితగా పరిచయం అవుతున్నారు. నేపథ్య సంగీతం, పోరాట ఘట్టాలు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయ"న్నారు.

సి.కల్యాణ్, జాని, షకలక శంకర్

కేడీ ఇచ్చే సందేశం ఇదే!

షకలక శంకర్ కథానాయకుడుగా నటించిన చిత్రం 'నేనే కేడీ నెం 1'. ముష్కాన్ నాయిక. పృథ్వీ కీలక పాత్రధారి. జాని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 26న విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ "మాస్‌లో షకలక శంకర్‌కి ఓ ఇమేజ్ ఉంది. ఆ ఇమేజ్‌ని పెంచే చిత్రమిది. కథాబలం ఉన్న చిన్న సినిమాలు ఆదరణ పొందితేనే పరిశ్రమ కళకళలాడుతుంది. చిన్న చిత్రాల శ్రేయస్సు కోసం నిర్మాతల మండలి కృషి చేస్తుంద"న్నారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "పిల్లల పట్ల పెద్దలు బాధ్యత వహించాలనే సందేశం ఇందులో ఉంది. దాన్నే వినోదప్రధానంగా చెప్పాం. శంకర్ పాత్ర మూడు కోణాల్లో కనిపిస్తుంద"న్నారు. 'నేను నటించిన 'శంభో శంకర' చిత్రాన్ని ఆదరించారు. ఈ 'కేడీ' కూడా వాళ్లందరికీ నచ్చుతాడ"న్నారు శంకర్.

కార్తీక్ ఆర్యన్

జాన్వీకపూర్

ప్రేమికులు కాదు... అన్నాచెల్లెళ్లు

'దోస్తానా'కు సీక్వెల్‌గా 'దోస్తానా 2'ని నిర్మిస్తున్నారు కరణ్ జోహార్. ఇందులో కార్తీక్ ఆర్యన్, జాన్వీ కపూర్ నటిస్తున్నట్లు కరణ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఇద్దరూ జంటగా నటిస్తున్నారనే అందరూ అనుకున్నారు. కానీ ఈ చిత్రంలో కార్తీక్, జాన్వీ అన్నాచెల్లెళ్లట. "దోస్తానా 2'లో జాన్వీ, కార్తీక్ మధ్య ఎలాంటి రొమాన్స్ ఉండదు. ఓ కొత్త అన్నాచెల్లెళ్లను వెండితెరకు పరిచయం చేస్తున్నారు కరణ్" అని కరణ్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇందులో కార్తీక్, జాన్వీలు ఒకే వ్యక్తిని ప్రేమించడం విశేషం. ఆ పాత్ర కోసం ఓ కొత్త నటుణ్ని పరిచయం చేసే ఆలోచనలో కరణ్ ఉన్నారని సమాచారం. 'దోస్తానా 2'లో భాగం కావడం చాలా సంతోషంగా ఉందంటోంది జాన్వీ. కొల్లిన్ డి కున్హా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

పునర్నవి భూపాలం

హాస్యం + ప్రేమ = సైకిల్

పునర్నవి భూపాలం, మహత్ రాఘవేంద్ర, శ్వేతావర్మ, సూర్య ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'సైకిల్'. ఆట్ల అర్జున్ రెడ్డి దర్శకుడు. పి.రాంప్రసాద్, డి.నవీన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణతో పాటు డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "హాస్య ప్రధానమైన కథకి, ప్రేమలోని మేజిక్ తోడైతే ఆ సినిమా ఎంత కొత్తగా ఉంటుందో తెరపై చూపించబోతున్నాం. సైకిల్ అనే పేరుని ఎందుకు పెట్టామనేది తొలి సన్నివేశంలోనే తెలుస్తుంది. దానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయంతో ముడిపెడుతూ ఈ సినిమాని ముందుకు నడిపించాం. త్వరలోనే టీజర్‌తోపాటు పాటల్ని విడుదల చేయబోతున్నాం" అన్నారు. సుదర్శన్, అనితా చౌదరి, మధుమణి, నవీన్ నేని, లక్ష్మణ్, అన్నపూర్ణమ్మ, జోగి బ్రదర్స్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సిద్ధం మనోహర్, సంగీతం: జి.ఎం.సతీష్, కూర్పు: గడుతూరి సత్య, కళ: రామ్‌కుమార్.

'దర్పణం' పాట సందడి

ఎలక్సియస్, తనిష్కరెడ్డి

తనిష్కరెడ్డి, ఎలక్సియస్ జంటగా రామకృష్ణ వెంప తెరకెక్కిస్తున్న చిత్రం 'దర్పణం'. క్రాంతికిరణ్ వెల్లంకి నిర్మాత. ఈ చిత్రంలోని 'ఎదురయే..' పాటని నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "నేరం నేపథ్యంలో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. చివరి సన్నివేశం వరకూ ఉత్కంఠ రేకెత్తిస్తుంద"న్నారు. ఈ నెలలోనే విడుదల చేస్తామన్నారు నిర్మాత. "సిద్ధార్థ్ స్వరపరచిన పాట బాగుంద"న్నారు రాజ్ కందుకూరి.

పసిపిల్లలకు ఏది మంచో... ఏది చెడో తెలియదు. చాక్లెట్ ఇస్తే ముద్దు పెడతారు. ముద్దు చేస్తే... ఆప్యాయంగా అల్లుకుపోతారు. అన్న, అంకుల్, తాతయ్య...అంటూ వరసలు కలుపుతారు. కానీ ఆ బంధాల చాటున బుసలు కొట్టే కొన్ని పాములు ఉంటాయని వారికి తెలియదు. కామంతో తడిమే కర్కశులు వారని అర్థం చేసుకోలేరు. అలాంటివారిని ఎలా గుర్తించవచ్చో తెలియజేసేందుకు పిల్లలకోసం ఓ కార్యక్రమాన్ని ప్రారంభించారు వరంగల్ గ్రామీణ జిల్లా కలెక్టర్ హరిత. అదే బాల్యానికి భరోసా!

చెడు స్పర్శ చెబుతారిలా!

రోజురోజుకీ మన దేశంలో పెరిగిపోతున్న మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు... వంటి దురాగతాల సంఖ్య తగ్గాలంటే వీటిపై అవగాహన బాగా పెరగాలి. ఆప్యాయంగా హత్తుకునే వారెవరో... వావివరసలు, వయసు తేడాలు లేకుండా ప్రవర్తించేదెవరో... గుర్తించే నైపుణ్యం పిల్లలకు అవసరం. ఆ నైపుణ్యం అందించేందుకు వరంగల్ గ్రామీణ జిల్లా కలెక్టర్ ఎం.హరిత 'బాల్యానికి భరోసా' పేరుతో ఓ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది ప్రస్తుతం పర్వతగిరి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మొదలైంది. జిల్లాలోని మొత్తం 151 ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు 45 వేల మందికి ఈ కార్యక్రమం చేరనుంది. ఆరో తరగతి నుంచి ఇంటర్‌వరకూ లైంగిక విద్యపై అవగాహన కల్పించనుందీ కార్యక్రమం. ముఖ్యంగా మంచి స్పర్శ (గుడ్ టచ్) చెడు స్పర్శ (బ్యాడ్ టచ్)లపై పిల్లలకు అర్థమయ్యే రీతిలో చెబుతారు కొందరు అధికారులు.

లఘుచిత్రాలతో అవగాహన...

కౌమార దశ నుంచి అమ్మాయిల్లో అనేక శారీరక మార్పులు మొదలవుతాయి. అవి ఎలా ఉంటాయో... ఈ కార్యక్రమంలో వివరిస్తారు. నెలసరి మొదలయ్యాక పాటించాల్సిన శుభ్రత....ఎదురయ్యే అనారోగ్య సమస్యల గురించీ లఘుచిత్రాల రూపంలో తెలియజేస్తారు. పిల్లలకు ఎవరి నుంచి ఎలాంటి హాని ఎదురవుతుందో ఉదాహరణలతో చెబుతారు. ఓ తాతయ్య బాలికపై ఎలా అఘాయిత్యానికి పాల్పడొచ్చు? వరుసకు అన్నయ్య అయ్యే వ్యక్తి ఎలాంటి మాయమాటలు చెప్పి లొంగదీసుకోవాలనుకుంటాడు.... అసలు ఆప్యాయతతో కూడిన స్పర్శ ఎలా ఉంటుంది? దురుద్దేశంతో తాకితే ఎలా గుర్తించాలి... వంటివన్నీ ఈ చిత్రాల ద్వారా చూపిస్తున్నారు. బాల్య వివాహాల నియంత్రణపై తల్లిదండ్రులకూ అవగాహన కల్పిస్తున్నారు. ఇది మాత్రమే కాకుండా... ప్రతి పాఠశాలలో ఓ సలహాల పెట్టె ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు తమకు ఎదురవుతోన్న ఇబ్బందులు, వేధింపులు, ఇవ్వాలనుకున్న సలహాల్ని ఓ కాగితంపై రాసి అందులో వేయొచ్చు. జిల్లాలోని బాలల సంరక్షణ విభాగం రెండు బృందాలుగా ఏర్పడి మంగళ, శుక్రవారాల్లో పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా అమలు అయ్యేలా చూస్తున్నారు ఆ జిల్లా పాలనాధికారి ఎం.హరిత.

– జి.పాండురంగ శర్మ, ఈనాడు, వరంగల్

వసుంధర

హాయిగా ఆడుతూ, పాడుతూ తిరిగే పిల్లాడు... జ్వరంతో మంచం పడితేనే... తల్లిమనసు తల్లడిల్లిపోతుంది. అలాంటిది అకస్మాత్తుగా అతడికి బ్రెయిన్‌డెడ్ అయ్యిందనీ... ఇక దక్కడని తెలిస్తే! ఆ అమ్మ బాధ తీర్చలేం. ఓదార్చలేం. ఈ తల్లి కథా అలాంటిదే. అంతా ఆమె కొడుకు చనిపోయాడని చెబుతూ... అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తోంటే...! ఆమె తన బిడ్డ బతికే ఉన్నాడని... తుది వీడ్కోలు చెప్పడానికి వీల్లేదని పట్టుబట్టింది. పోరాడింది. ఐదురోజులకు ఆ అబ్బాయి లేచి కూర్చున్నాడు. ఈ పోరాటం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా పిల్లలమర్రికి చెందిన సైదమ్మది.

కొడుకుకోసం యముడితో పోరాడింది...

ప్రతి తల్లి తన పిల్లలకు ఇచ్చే దీవెన 'నా ఆయుష్షూ పోసుకుని నూరేళ్లు బతుకు బిడ్డా...' అనే. సైదమ్మా అలాంటి తల్లే. నవ మాసాలు మోసి... రక్తమాంసాలు పంచిన కన్నకొడుకు ఆమె కళ్లముందు జీవచ్ఛవంలా పడి ఉంటే తట్టుకోలేకపోయింది. అతడిని ఎలాగైనా కాపాడుకోవాలనుకుంది. ఆ తపన, తల్లిగా ఆమెకు ఉన్న నమ్మకమే సైదమ్మను గెలిపించింది. అసలేం జరిగిందంటే...

మాది నిరుపేద కుటుంబం. నాకు చిన్నప్పుడే పెళ్లయ్యింది. మా ఆయన ఉపేందర్ రోజుకూలి. మాకు ఇద్దరబ్బాయిలు. సాయి, కిరణ్. హాయిగా గడిచిపోతున్న మా జీవితంలో ఓ పెనుతుపాను. కొన్నాళ్లక్రితం మా ఆయన తీవ్ర అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటికి నా వయసు ఇరవై రెండేళ్లే. పెద్దవాడికి నాలుగు, చిన్నవాడికి రెండేళ్లు. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితి. ఆస్తులు లేవు. చదువురాదు. చివరకు బాగా ఆలోచించి నేను కూలిపనులకు వెళ్లడం మొదలుపెట్టా. ఎంత కష్టపడైనా సరే... పిల్లల్ని ఉన్నతంగా చదివించాలనుకున్నా. పిల్లలు బడికెళ్లడం మొదలుపెట్టాక ఇంకాస్త ఎక్కువగా కష్టపడ్డా. పొలం పనులు, ఇళ్లల్లో పనులు చేసుకుంటూ వారిని చదివించేదాన్ని. పుట్టింటినుంచి కొంత సాయం అందేది. ఇప్పుడు నా పిల్లలు కాలేజీ స్థాయికి వచ్చారు. పెద్దవాడు డిగ్రీ పూర్తిచేసి టీచర్ పరీక్ష రాస్తే... రెండోవాడు ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నాడు.

చనిపోయాడని చెప్పారు...

నా పిల్లలని చెప్పడం కాదు. వాళ్లకు ఏ చెడు అలవాటు లేదు. ఇల్లు, చదువు తప్ప వారికి మరో ప్రపంచం ఉండేది కాదు. ఎప్పుడైనా సెలవు దొరికితే... నాతో కూలిపనులకు వచ్చేవారు. ఆ డబ్బులతో చదువుకునేవారు. వారి కాళ్లపై వాళ్లు నిలబడతారని ఆశపడ్డా. నా దురదృష్టం. అనుకోకుండా చిన్నోడు జబ్బుపడ్డాడు. కాలేజీ నుంచి వచ్చిన కిరణ్‌కు గత నెలాఖరులో జ్వరం వచ్చింది. పరీక్షల్లో డెంగ్యూ అని తెలిసింది. స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించా. రెండో రోజుకే కామెర్లతోపాటు హెపటైటిస్ బి పాజిటివ్ అని తేలడంతో అక్కడి నుంచి మరో ఆసుపత్రికి పంపించారు వైద్యులు. మూడు రోజులపాటు రెండు మూడు ఆసుపత్రులకు తిప్పిన తరువాత ప్రాణాపాయమని చెప్పి, హైదరాబాద్‌కు తీసుకెళ్లమన్నారు. జూన్ 26న అక్కడి పెద్దాసుపత్రిలో చేర్పించా. చేతిలో చిల్లిగవ్వ లేదు. వైద్యం కోసం అక్కడక్కడా అప్పులు చేశా. మూడు రోజులు బాగానే ఉన్నాడు. ఆ రాత్రి జ్వరం ఎక్కువైంది. అంతలోనే కాళ్లు చేతులు కొట్టుకోవడం మొదలుపెట్టాడు. డాక్టర్లు పరీక్షలు చేసి మెదడుకు జ్వరం సోకిందని, ఐసీయూలో ఉంచారు. తల తాకట్టు పెట్టైనా నా కొడుకుని బతికించుకోవాలనుకున్నా. మనసులో ఏదో దిగులు. దాంతో నాకు రక్తపోటు పడిపోయింది. నీరసంగా అయిపోయా. ఈనెల మూడో తేదీ సాయంత్రం నన్ను ఓ గదిలో ఉంచారు. నా పెద్ద కొడుకు వచ్చి నీకు ఒంట్లో నలతగా ఉందిగా, ఇక్కడే ఉండు... తమ్ముడిని నేను చూసుకుంటాలే' అని అన్నాడు. ఓ గంట తరువాత మళ్లీ వచ్చి 'ఆసుపత్రికి డబ్బులు కట్టాలి, ఊరెళదాం. తమ్ముడి దగ్గర తాత ఉన్నాడు... అని చెప్పి ఇంటికి తీసుకెళ్లాడు. తీరా ఇంటికెళ్తే...

అంత్యక్రియలన్నారు...

ఊరంతా మా గుమ్మం దగ్గర ఉంది. నన్ను పలకరించడానికి వచ్చారనుకున్నా. వాకిట్లో ఉన్న మంచాన్ని చూసి ఉలిక్కిపడ్డా. దానిపై చిన్నోడు స్పృహలేకుండా పడి ఉన్నాడు. పరుగెత్తుకెళ్లా. 'కిరణ్ మెదడు పనిచేయడం మానేసింది. బతకడం కష్టం, చుట్టాలందరికీ చెప్పుకోండని డాక్టర్లు అన్నారు...' అని పక్కనున్నవారెవరో చెప్పారు. నాకేం అర్థం కాలేదు. ఒక్కసారిగా కళ్లు తిరిగిపోయాయి. నాలుగైదు గంటలకు మెలకువ వచ్చింది. ఇంటినిండా జనం. కిరణ్‌కు అంత్యక్రియలు చేయడానికి ఓవైపు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు వాడి స్నేహితులంతా కలిసి వాడి ఫొటోతో శ్రద్ధాంజలి పోస్టర్లు తయారు చేస్తున్నారు. అవన్నీ చూసేసరికి ఏడుపు ఆగలేదు. నా కొడుకు ఎక్కడికీ పోడు. మరోసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దామని ఏడ్చా. బిడ్డ పోయిన బాధలో ఉన్నాననుకుని అంతా నన్ను ఓదార్చారు. దగ్గరకు వెళ్లి బిడ్డా లేవరా అంటూ వాడిని పట్టుకుని ఏడుస్తున్నా. అకస్మాత్తుగా వాడి కళ్ల చివర నుంచి కొన్ని చుక్కల నీరు కనిపించింది. అక్కడ ఉన్నవారందరితో నా కొడుకు చనిపోలేదు. వాడికి వైద్యం ఇప్పించండి. అంటూ ప్రాధేయపడ్డా. ఓదారుస్తున్నారే తప్ప ఒక్కరూ నా మాట నమ్మలేదు. నన్ను పిచ్చిదానిలా చూశారు. నా మాట నమ్మమని అందరికీ చేతులెత్తి దణ్ణం పెట్టి వేడుకున్నా. చివరకు మా ఊళ్లో ఉండే ఆర్ఎంపీ జి.రాజాబాబు రెడ్డిని పిలిపించారు. ఆయన కిరణ్ నాడిని పరిశీలించి గుండె కొట్టుకుంటున్నట్లు గుర్తించాడు. వెంటనే గ్లూకోజు ఎక్కించడానికి ఏర్పాట్లు చేశాడు.

అమ్మా అని పిలిచాడు...

హైదరాబాద్ ఆసుపత్రిలోని డాక్టర్లకు రాజాబాబు సర్ ఫోన్ చేసి విషయాన్ని చెప్పాడు. వాళ్లు కొన్ని మందులు చెప్పారు. అవేమో చాలా ఖరీదు. ఇప్పటివరకూ నా కష్టంమీదే బతికిన నేను ఏ మాత్రం ఆలోచించకుండా అక్కడున్న వారందరినీ ఎంతో కొంత డబ్బు సాయం చేయమని అడిగా. తలా కొంత ఇచ్చారు. వాటితో మందులు తెప్పించి డాక్టర్ వైద్యం ప్రారంభించాడు. మందులు వాడినా.. బతుకుతాడో లేడోనని చెప్పారు. వాడు కళ్లు తెరవాలని ప్రతి దేవుడికీ దణ్ణం పెట్టుకున్నా.. ఒక రోజు గడిచింది. చుట్టూ ఉన్నవారిలో ఆశ పోయింది. పచ్చి మంచినీళ్లు ముట్టకుండా పిల్లాడి పక్కనే కూర్చుండిపోయా. అంతా 'నీది పిచ్చి ఆశ సైదమ్మ...' అనడం మొదలుపెట్టారు. నాకు ఎవరి మాటలూ వినపడలేదు. నా కొడుకు బతుకుతాడనే నమ్మకం తప్ప. ఐదో రోజున కళ్లు తెరిచి, అమ్మా అని పిలిచాడు. భగవంతుడు నా మొర విన్నాడని అనిపించింది. ఇప్పుడు జ్వరం తగ్గింది. కామెర్లూ తగ్గుతున్నాయి. ఓసారి మెదడు పరీక్షలు చేయించాలట. మళ్లీ హైదరాబాద్ తీసుకెళ్లాలంటున్నారు. 20 వేల రూపాయలు అవుతాయని అంటున్నారు. అప్పు కోసం ప్రయత్నిస్తున్నా. కచ్చితంగా వాడు మళ్లీ మామూలుగా తిరిగేలా చేస్తా.

నేను, మా ఊరికి చెందిన ఓ అబ్బాయి ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నాం. నేను ప్రైవేటుగా చదువుకుంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా. ఈ ఏడాది అతడి చదువు పూర్తయింది. మా మధ్య బలమైన బంధం ఉంది. భవిష్యత్తు ప్రణాళికలూ వేసుకున్నాం. ఈ మధ్య అతడి తల్లిదండ్రులు మా పెళ్లికి అంగీకరించారు. కానీ మా అమ్మానాన్నలు ఒప్పుకోకపోవచ్చని వాళ్లు అతడితో అన్నారట. పైగా నాతో ఫోనులో ఎక్కువసేపు మాట్లాడొద్దనీ చెప్పారట. అప్పటి నుంచి అతడి ప్రవర్తన మారిపోయింది. ఓసారి నేను లేకుండా ఉండలేనని అంటాడు. మరోసారి నాకు మంచి భవిష్యత్తు ఉంటుందనీ, వేరే పెళ్లి చేసుకోమనీ చెబుతాడు. నేను మాత్రం అతడినే కోరుకుంటున్నానని చెబుతున్నా అర్థం చేసుకోవడంలేదు. నేనెలా నచ్చజెప్పాలి?

– ఓ సోదరి

నేనంటే ఇష్టమే కానీ...

డియర్ వసుంధర

డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

ఏడేళ్లుగా మీరు ప్రేమించుకుంటున్నారని, బలమైన బంధం, జీవితానికి సంబంధించిన ప్రణాళికలు ఉన్నాయని ఉత్తరంలో రాశారు. పెళ్లికి ఇంట్లో వాళ్లను ఎలా ఒప్పించాలి... ఒక వేళ వారు అంగీకరించకపోతే తరువాత ఏం చేయాలి... ఉద్యోగాలు, ఆర్థికంగా స్థిరపడటంలో మీ ఆలోచనలు... ఇలా భవిష్యత్తులో ఎదురయ్యే వివిధ అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయించుకునేదే ప్రణాళిక.

మరి మీరు దేనికి సంబంధించి ప్రణాళిక వేసుకున్నారో ఉత్తరంలో రాయలేదు. మీ ఇంట్లో వాళ్లు ఒప్పుకోరనే ఉద్దేశంతో అతడి కుటుంబ సభ్యులు మీకు దూరంగా ఉండమని చెబుతున్నారు. మీ విషయాన్ని పెద్దలకు చెప్పారా... చెబితే వాళ్లెలా స్పందించారు... మీ ఇంటి పరిస్థితులు అబ్బాయి వాళ్ల కుటుంబసభ్యులు అనుకున్నట్లే ఉంటే మీరు ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలనుకుంటున్నారో ఆలోచించండి. మీ వాళ్లు వద్దంటారని అతడి అమ్మానాన్న చెప్పగానే... ఆ అబ్బాయి అంతగా చలించిపోవడానికి కారణం ఏదయినా ఉందా...! మీ ప్రణాళికలో దీని గురించి మాట్లాడుకోలేదా? ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు కదా... మీ మధ్య మానసిక బంధం స్థిరంగానే ఉందా... లేదా స్నేహాన్నే ప్రేమగా భావిస్తున్నారా... అన్నింటినీ ఓసారి అంచనా వేసుకోండి. కొన్ని సందర్భాల్లో అతడు తనని మర్చిపో అని చెప్పడం, మరోసారి మీరు లేకుండా ఉండలేనని అనడం అతడిలోని గందరగోళాన్ని సూచిస్తోంది. ముందు అతడి మనసు తెలుసుకొని, స్థిరత్వం తేవడానికి ప్రయత్నించండి. ఒకవేళ ఇరు కుటుంబాలు తిరస్కరిస్తే మీరేం చేయాలనుకుంటున్నారో కలిసి చర్చించుకోండి. మీతోనే జీవితమని అతడు స్పష్టంగా చెప్పకపోయినా దాని తాలూకు పర్యవసానాలు ఎదుర్కోగలరా లేదా అనేది మాట్లాడుకోండి. అతడి చదువు పూర్తయింది. మీరు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. ముందు ఇద్దరూ జీవితంలో ఆర్థికంగా స్థిరపడటానికి ప్రయత్నించండి. మీ మధ్య బంధాన్ని దృఢం చేసుకోండి. ఇరు కుటుంబాలు తిరస్కరిస్తే ఏం చేయాలనుకుంటున్నారో ఆలోచించుకోండి. ఇద్దరికీ ఈ విషయంపై స్పష్టత కచ్చితంగా ఉండాలి. ఆ తరువాతే ఓ నిర్ణయానికి రావడం మంచిది.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

నజరానా

చర్మం పొడిబారిందా...కొద్దిగా పెట్రోలియం జెల్లీలో అర చెంచా గులాబీనీరు కలిపి... ముఖానికి రాసి మర్దన చేయాలి. చర్మం తేమగా, తాజాగా కనిపిస్తుంది.

బంగారం వెండి

10 న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,270	3,264
వెండి (గ్రా)	41.00	40.80

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	35,300	35,330	35,280	35,370	34,300	34,250	35,340	35,330	34,980	34,980
ఆర్నమెంట్	32,960	32,970	32,700	32,710	31,690	31,650	32,680	32,640	32,530	32,530
వెండి(కిలో)	38,950	38,780	39,100	39,200	38,900	38,900	39,000	38,900	39,500	38,500

పాత సీసాలు పనికొచ్చేలా

బయటకు వెళ్లినప్పుడల్లా ఒకటిరెండు నీళ్లసీసాలు కొనుక్కోవడం మనలో చాలామంది చేసేదే. పనైపోయిన వెంటనే వాటిని పారేయకండి. వాటితో గృహాలంకరణ వస్తువులను సులువుగా తయారు చేయొచ్చు. ఎలాగంటే... సీసాల పైభాగాలను ఒకే పద్ధతిలో కత్తిరించాలి. కాస్త మందంగా ఉండే దారాలను రకరకాల రంగుల్లో ముంచి... వాటిని సీసాల చుట్టూ అందంగా చుట్టి... అంచులు అతికించాలి. వీటికి నచ్చినట్లుగా చమ్కీలు, అద్దాల్లాంటివి అలంకరిస్తే చాలు. నాలుగైదు చొప్పున వేలాడదీసినా... పూల కుండీలా చేసుకున్నా చూడముచ్చటగా ఉంటుంది. కుదిరితే కొవ్వొత్తులు, బల్బులనూ అమర్చి చూడండి.

ముద్దులొలికే చిన్నారులు.. ముచ్చటైన యూనిఫాంలో!

అమ్మాయిలైతే రెండు జడలు, అబ్బాయిలైతే నీటుగా దువ్విన జుట్టు, నెక్‌టై, నడుముకో బెల్టు, భుజాలకు చిట్టిపొట్టి బ్యాగ్, వీటన్నింటినీ మరింత హైలైట్ చేసే ఇస్త్రీ నలగని యూనిఫాం.. స్కూలుకెళ్లే చిన్నారుల అందమైన ఆహార్యం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. సహజంగానే ఎంతో ముద్దొచ్చే మన పిల్లలు ఇక స్కూల్ డ్రస్ వేసుకుంటే వాళ్ల ఎటైర్ అదిరిపోవాల్సిందే! ఇలా ముచ్చటైన యూనిఫాంలో ముస్తాబై ఆకట్టుకునే చిన్నారులు మీ ఇంట్లోనూ ఉన్నారా? అయితే వారిని అదే ఎటైర్‌లో ఫొటోల్లో బంధించండి. వాటిని వసుంధర.నెట్ వేదికగా పంచుకోండి. ఉత్తమ ఫొటోకి చక్కటి బహుమతి అందుకోండి.

మరిన్ని వివరాల కోసం
www.vasundhara.net
సందర్శించండి

91212 92740

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీ కోఆపరేటివ్ బ్యాంకు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (ఆప్కాబ్)... కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** స్టాఫ్ అసిస్టెంట్-54, మేనేజర్ (స్కేల్ 1)-23 **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఆంధ్రప్రదేశ్ స్థానిక అభ్యర్థి అయి ఉండాలి. **వయసు:** 20-28 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

పరీక్ష తేది: ఆగస్టు 25 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** జులై 28 **వెబ్‌సైట్:** www.apcob.org

రైల్వేలో స్కౌట్స్ కోటా పోస్టులు

కోల్‌కతా కేంద్రంగా పనిచేస్తున్న ఆగ్నేయ రైల్వే 2019-20 సంవత్సరానికిగానూ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** లెవెల్ 1/ లెవెల్ 2 **ఖాళీలు:** 10 **అర్హత:** పదోతరగతి, ఐటీఐ/ ఎన్ఏసీ, ఇంటర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ అర్హతలు. **వయసు:** లెవెల్ 1 పోస్టులకు 18-33, లెవెల్ 2కు 18-30 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ మార్కుల మదింపు, వైద్య పరీక్షల ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్

చివరి తేది: ఆగస్టు 5 **వెబ్‌సైట్:** http://rrcser.co.in/

షిప్‌యార్డులో ప్రాజెక్టు ఆఫీసర్లు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... ముంబయి షిప్ రిపేర్ యూనిట్‌లో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** ప్రాజెక్టు ఆఫీసర్ **ఖాళీలు:** 11 **విభాగాలవారీ ఖాళీలు:** మెకానికల్-06, ఎలక్ట్రికల్-03, సివిల్-01, ఇన్‌స్ట్రుమెంటేషన్-01. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, రెండేళ్ల అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** జులై 30

వెబ్‌సైట్: https://cochinshipyard.com/

ప్రవేశాలు

డెవలప్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)... తెలంగాణ యూనివర్సిటీ (నిజామాబాద్) భాగస్వామ్యంతో 2019-20 విద్యా సంవత్సరానికిగానూ పీహెచ్‌డీ కోర్సులను అందిస్తోంది. **కోర్సు:** పీహెచ్‌డీ (డెవలప్‌మెంట్ స్టడీస్) **విభాగాలు:** ఎకనామిక్స్, సోషియాలజీ/ ఆంత్రోపాలజీ/ సోషల్ వర్క్, జాగ్రఫీ/ జియోఇన్ఫర్మేటిక్స్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్. **మొత్తం సీట్ల సంఖ్య:** 15 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ/ ఎంఫిల్, యూజీసీ-నెట్/ స్లెట్/ యూజీసీ-ఎఫ్‌డీపీ అర్హత.

ఎంపిక: ప్రవేశ పరీక్ష, రిసెర్చ్ ప్రపోజల్, ఇంటర్వ్యూ ఆధారంగా. **పరీక్షతేది:** ఆగస్టు 30 **దరఖాస్తు:** ఆఫ్‌లైన్

చివరితేది: ఆగస్టు 15 **వెబ్‌సైట్:** www.cess.ac.in

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో.

దరఖాస్తు చేశారా?

- **ఎన్‌పీసీఐఎల్‌లో స్టైపెండరీ ట్రెనీలు**
  అర్హత: పదోతరగతి, ఐటీఐ, ఇంటర్; చివరితేది: జులై 11
- **భెల్‌లో ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు**
  అర్హత: బీఈ/ బీటెక్, డిప్లొమా, అనుభవం; చివరితేది: జులై 12

- **డీఆర్‌డీవోలో సైంటిస్టులు**
  అర్హత: బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్; చివరితేది: జులై 12
- **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్**
  అర్హత: ఇంటర్, డిగ్రీ, పీజీ; చివరితేది: జులై 12
- **జేఎన్‌సీఏఎస్ఆర్‌లో మెటీరియల్ సైన్స్ పీజీ డిప్లొమా**
  అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ; చివరితేది: జులై 12
- **ఎయిర్ ఫోర్స్‌లో ఎయిర్‌మన్ పోస్టులు**
  అర్హత: ఇంటర్/ ఇంజినీరింగ్ డిప్లొమా; చివరితేది: జులై 15
- **గుంటూరు పొగాకు బోర్డులో పోస్టులు**
  అర్హత: బీఎస్సీ అగ్రికల్చర్, డిగ్రీ/ డిప్లొమా; చివరితేది: జులై 15
- **ఎన్ఎస్‌టీఐ రామాంతపూర్‌లో వృత్తి నైపుణ్య కోర్సులు**
  అర్హత: పదోతరగతి; చివరితేది: జులై 17

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అందుబాటులో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. దీంతో ముందస్తు ప్రణాళిక లేకపోతే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఏ దేశానికి వెళ్లాలి, ఏయే యూనివర్సిటీలు ఉన్నాయి, ప్రామాణిక పరీక్షలేవి, వాటికి ఎప్పటి నుంచి సిద్ధం కావాలి, ఎంత ఖర్చవుతుంది..? ఇలాంటి విషయాలపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలి. వచ్చే ఏడాది విదేశాల్లో డిగ్రీ లేదా పీజీ చేయాలనుకునే వారికి ఇదే సరైన సమయం. అందుకే ఏయే అంశాలపై దృష్టిపెట్టాలో ఇప్పటి నుంచే తెలుసుకోవాలి.

ఎగిరే ముందు...



నాణ్యమైన విద్యతోపాటు భవిష్యత్తు, ఉద్యోగావకాశాలను మెరుగుపరచుకునే ఉద్దేశంతో ఎక్కువమంది విదేశీ విద్యపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో విభిన్న సంస్కృతులు, అంతర్జాతీయ ఆలోచన విధానాలపై అవగాహన ఏర్పడుతోంది. ఏ దేశంలో చదవాలి అన్నది విద్యార్థి ఆసక్తి, స్థోమత, కెరియర్ అవకాశాల ఆధారంగా నిర్ణయించడం మంచిది.

మనదేశ విద్యార్థులకు ఫారిన్ ఎడ్యుకేషన్ అనగానే సాధారణంగా పీజీ గుర్తొస్తుంది. కొన్నేళ్లుగా కొందరు గ్రాడ్యుయేషన్‌పైనా దృష్టిపెడుతున్నారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం, డిగ్రీ తుది సంవత్సరం చదువుతున్నవారు విదేశాల్లో చదవాలని అనుకుంటే.. అందుకు సంబంధించిన విశ్వవిద్యాలయాలు, వాటి దరఖాస్తు విధానం వంటి అంశాలపై ఇప్పటి నుంచే అవగాహన ఏర్పరచుకోవడం అవసరం. అబ్రాడ్ ఎడ్యుకేషన్‌కి సంబంధించి ఎంతో సమాచారం ఇప్పుడు అంతర్జాలంలో అందుబాటులో ఉంది. కానీ తగిన వాటిని నిర్ణయించుకోడానికి కొన్ని అంశాలను పరిశీలించుకోవాలి.

ఏ యూనివర్సిటీ ?

ఎక్కడుంది?: విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంతం మనకు తగ్గట్టుగా, నివాసయోగ్యంగా ఉండాలనుకుంటే, ఇంకొందరు నగరాలకు దగ్గరగా ఉండాలని కోరుకుంటారు. ప్రశాంతంగా ఉంటే చాలనుకునేవాళ్లూ ఉన్నారు. తెలిసినవారు, బంధువులు దగ్గరగా ఉండే ప్రదేశాల్లో ఉండాలనుకోవడమూ మంచిదే. మన వ్యక్తిగత పరిస్థితులకు అనుగుణంగా వీటిలో వీలైనన్ని కుదిరే విధంగా చూసుకోవాలి. అన్నీ ఉండాల్సిందే అని పట్టుబట్టి అవకాశాలను జారవిడుచుకోకూడదు.

ఎలా ఉంది?: అందరికీ ఒకేరకమైన బోధనా వాతావరణం ఉంటుందని చెప్పలేం. కొందరు తరగతి ఎంత పెద్దదైనా, ఎంతమంది ఉన్నా ఆసక్తిగానే ఉంటారు. ఇంకొందరైతే తక్కువమంది విద్యార్థులున్నప్పుడే సందేహాలు నివృత్తి చేసుకోవచ్చనుకుంటారు. ఇలాంటివీ పరిగణనలోకి తీసుకోవాలి. రిసెర్చ్ సెంటర్లు, స్పోర్ట్స్, క్లబ్‌లు, క్యాంపస్ లోపల, వెలుపల దగ్గర్లో హాస్టల్ సౌకర్యాల గురించీ విచారించుకోవాలి.

ఏ కోర్సు: నాణ్యమైన విద్యకు పేరు పొందిన విశ్వవిద్యాలయాన్ని ఎంచుకోవాలి. పరిశోధన అవకాశాలు, ప్లేస్‌మెంట్స్ సంగతి చూసుకోవాలి. యూకే, కెనడాలకు చెందిన కొన్ని విశ్వవిద్యాలయాలు ప్లేస్‌మెంట్ ఇయర్‌ను అందిస్తాయి. అంటే చదువులో భాగంగా ఏడాదిపాటు వేతనంతో కూడిన ప్లేస్‌మెంట్ అవకాశాన్ని కల్పించడం. దీని వల్ల అంతర్జాతీయంగా పని అనుభవంతోపాటు నెట్‌వర్క్‌ను పెంచుకోవచ్చు.

ఏ కోర్సు చేయాలో తేల్చుకోలేని అభ్యర్థులకు యూఎస్, కెనడాలాంటి చోట్ల 'అన్‌డిసైడెడ్ స్టూడెంట్' అవకాశముంది. దీని ప్రకారం విద్యార్థి తన మొదటి సంవత్సరంలో వివిధ సబ్జెక్టులపై అవగాహన ఏర్పరచుకొని, దాని ఆధారంగా మేజర్‌ను ఎంచుకోవచ్చు.

> ఏ కోర్సు చేయాలో తేల్చుకోలేని అభ్యర్థులకు మరో చక్కటి అవకాశం ఉంది. అదే 'అన్‌డిసైడెడ్ స్టూడెంట్'. దీని ప్రకారం విద్యార్థి తన మొదటి సంవత్సరంలో వివిధ సబ్జెక్టులపై అవగాహన ఏర్పరచుకొని, దాని ఆధారంగా మేజర్‌ను ఎంచుకునే వీలుంటుంది.

ఎంత వ్యవధి: కోర్సు కాలవ్యవధి ఎంచుకున్న దేశం, విశ్వవిద్యాలయాన్ని బట్టి మారుతుంటుంది. యూకేలో గ్రాడ్యుయేషన్ కాలవ్యవధి మూడేళ్లు. యూఎస్, కెనడా, ఇంకా కొన్ని దేశాల్లో నాలుగేళ్లు. విద్యార్థి తన స్థోమత ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

స్కాలర్‌షిప్, పని అవకాశాలు: గడువులను గమనించి వీలైనంత ముందుగా దరఖాస్తు చేసుకుంటే అడ్మిషన్ అవకాశాలు మెరుగుపడి, ఉపకార వేతనాలూ సాధించవచ్చు. మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్ అవకాశాలున్నాయో లేదో చూసుకోవాలి. చాలావరకూ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు వారాంతాల్లో, సెలవుల్లో పనిచేసుకునే వీలును కల్పిస్తుంటాయి. సాధారణంగా ఇది వారానికి 20 గంటలు, సెలవుల్లో వారానికి 40 గంటలు ఉంటుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని తమ నివాస, ఇతర ఖర్చుల కోసం ఉపయోగించుకోవచ్చు.

దేశాల పరంగా...

వీసా నిబంధనలు: ఎంచుకున్న దేశం ఎలాంటి నిబంధనలతో వీసా ఇస్తోందో ముందుగానే తెలుసుకోవడం మంచిది. ఇమిగ్రేషన్ ఆలోచన ఉంటే, దానికి సంబంధించిన వివరాలనూ చూసుకోవాలి. ❖ **భాష:** విద్యార్థి చదువులో భాగంగా తోటి విద్యార్థులతో మాట్లాడాల్సి వస్తుంది. అందువల్ల స్థానిక భాషపై అవగాహన ఉండటం అవసరం. ఎక్కువ దేశాల్లో ఇంగ్లిష్ స్థానికభాషగా ఉంది. కానీ జర్మనీ లాంటి దేశాన్ని ఎంచుకున్నప్పుడు అక్కడి భాష తెలిసుండటం తప్పనిసరి అవుతోంది. ❖ **ఖర్చు:** విదేశీ విద్య అంటే ఖర్చుతో కూడుకున్నదే. అనవసరమైన ఇబ్బందులను నివారించాలంటే దీనిపై ముందస్తు అవగాహన ఏర్పరచుకోవాలి. విమాన టికెట్ల నుంచి, ట్యూషన్, హాస్టల్ వసతి, ఆహారం, వీసా, పాస్‌పోర్ట్, ఉండే ప్రదేశంలో అయ్యే ఖర్చు పరిగణనలోకి తీసుకుని ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. ❖ **వాతావరణం:** ఎంచుకున్న దేశంలో వాతావరణ పరిస్థితులు చెక్ చేసుకోవాలి. మన వాతావరణానికి దగ్గరగా ఉండేలా చూసుకోవడం మంచిదే. వ్యక్తిగతంగా ఆరోగ్య సంబంధమైన ఇబ్బందులున్నవారు ఏడాది మొత్తం స్థానిక వాతావరణ వివరాలను పరిశీలించుకొని నిర్ణయం తీసుకోవాలి.

ఏ పరీక్షలు రాయాలి?

ఎస్ఏటీ: గ్రాడ్యుయేషన్ చేయాలనుకునేవారు ముందుగా (ముఖ్యంగా యూఎస్, కెనడాల్లో) స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాలి. దీనిలో మూడు విభాగాలు ఉంటాయి. అవి- ఎవిడెన్స్ బేస్డ్ రీడింగ్ అండ్ రైటింగ్, మేథమేటిక్స్, ఎస్సే. ❑ **ఎంక్యాట్, ఎల్‌శాట్, యూకేక్యాట్:** మెడిసిన్‌కు ఎంక్యాట్, లా కోర్సుల్లో ప్రవేశాలకు ఎల్‌శాట్ రాయాలి. యూకేలో ఎంబీబీఎస్ చదవాలనుకునేవారు యూకేక్యాట్‌లో అర్హత పొందాలి. ❑ **జీమ్యాట్:** మేనేజ్‌మెంట్ ఆధారిత కోర్సులను చేయాలనుకునేవారు జీమ్యాట్ రాయాలి. జీమ్యాట్‌లో అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్, ఇంటిగ్రేటెడ్ రీజనింగ్, క్వాంటిటేటివ్, వెర్బల్ అంశాలను పరీక్షిస్తారు. ❑ **జీఆర్ఈ:** ఇంజినీరింగ్ తదితర కోర్సులకు జీఆర్ఈ రాయాలి. ఇందులో అనలిటికల్ రైటింగ్, వెర్బల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ రీజనింగ్‌లను పరీక్షిస్తారు. ❑ **ఐఈఎల్‌టీఎస్, టోఫెల్, పీటీఈ:** కోర్సు ఏదైనప్పటికీ ఇంగ్లిష్ సంబంధిత పరీక్షలను తప్పక రాయాలి. ఐఈఎల్‌టీఎస్, టోఫెల్, పీటీఈ అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏదో ఒకదానిలో తప్పక అర్హత సాధించి ఉండాలి.

ఈ టెస్టుల స్కోర్లను ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు అంగీకరిస్తున్నాయి. అయితే ఎంచుకున్న విశ్వవిద్యాలయం ఏ స్కోరును ఆధారం చేసుకుంటోందో చూసుకోవాలి.

(ఏ పరీక్షల్లో ఎంత స్కోరు చేస్తే మంచిది, దరఖాస్తు సమయానికి సిద్ధం చేసుకోవాల్సినవి ఏమిటి.. వివరాలను www.eenadupratibha.net లో చూడవచ్చు.)

Call off, Held up.. రెంటికీ ఒకే అర్థమా?

Call off , Held up... ఈ వ్యక్తీకరణలను వినేవుంటారు. వీటి అర్థం తెలుసా? వీటిని వాక్యాల్లో ప్రయోగించటం ఎలాగో ఉదాహరణల ద్వారా తెలుసుకుందాం.

Sekhar: The hooligans disturbed the meeting the president and the others were holding. They started throwing stones at the meeting, and the meeting was called off. The president could not do anything. (ఆ అధ్యక్షుడు, ఇతరులు పెడుతున్న సభను ఆ రౌడీలు ఆపేశారు. వాళ్ళు ఆ సభ మీద రాళ్ళు రువ్వి ఆ సభను జరగనీయకుండా చేశారు. అధ్యక్షుడు ఏమీ చేయలేకపోయాడు)

ఎం. సురేశన్

MODERN ENGLISH USAGE

Mohan: I don't know why the rowdies disturbed the meeting and why the president and the other office bearers had to cancel the meeting. (నాకు తెలీటంలేదు, ఎందుకు ఆ రౌడీలు ఆ సభను ఆపేశారో. అధ్యక్షుడు, ఇతరులు, ఆ సభను ఆపేయాల్సివచ్చిందో)

Sekhar: They should have called the police and threatened the hooligans. (ఆ సభ నిర్వాహకులు పోలీసులను పిలిచి ఆ రౌడీలను భయపెట్టి ఉండాల్సింది.)

Mohan: The office bearers had to call off the meeting because the hooligans threw stones at the meeting and the president and office bearers could not do anything. They should have called the police and should have arrested the rowdie (సభ నిర్వాహకులు రాళ్ళు రువ్వటం వల్ల ఆ అధ్యక్షుడు, ఇతరులు ఏమీ చేయలేకపోయారు. వాళ్ళు పోలీసులను పిలిచి ఆ రౌడీ మూకను ఖైదు చేయించి ఉండాల్సింది)

Sekhar: They had to call off the meeting and they did not call the police. The rowdies did not allow the meeting to progress. (అధ్యక్షుడు, ఇతరులు సభను రద్దు చేశారు. పోలీసులను పిలవాల్సింది. ఆ రౌడీలు సభకు అడ్డు పడ్డారు)

Mohan: the rowdies held up the meeting and did not allow the meeting to progress. (ఆ రౌడీలు సభను ఆపేసి, అది కొనసాగకుండా చేశారు.)

Sekhar: They should have called the police and should have arrested the rowdies. (వాళ్ళు పోలీసులను పిలిచి ఆ రౌడీలను ఖైదు చేసి ఉండాల్సింది.)

Notes: 1) Hooligans = రౌడీలు.
2) Threatened = gave signs of warning (బెదిరింపులు చేయటం)

Look at the following words from the conversation

1) Call off = Cancel (రద్దు చేయటం)

Ramesh: The office bearers had to call off the meeting, as the rowdies disturbed the meeting. (రౌడీలు అంతరాయం కల్పించటం వల్ల నిర్వాహకులు సభను రద్దు చేయాల్సివచ్చింది.)

2) Held up - the past tense of hold up = Stop a meeting. (సభను రద్దు చేయటం)

Balaram: Suddenly they held up the meeting (అకస్మాత్తుగా వాళ్ళు సభను రద్దు చేశారు).

ఒకటి తర్వాత... రెండెందుకు?

చంద్రయాన్-1 ఓ సంచలనం. భారత అంతరిక్ష చరిత్రలో పెద్ద ముందడుగు! వినువీధిలో భారత్ సత్తా చాటేందుకు మన 'మిస్సైల్ మ్యాన్'.. అబ్దుల్ కలాం కన్న కల అది. భారత్‌కు చంద్రుడి మీదకు వెళ్లేంత సత్తా ఉందా? అని యావత్ ప్రపంచం ఉత్కంఠగా చూస్తున్న ఘడియల్లో.. మన ఇస్రో ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ సరిగ్గా 11 ఏళ్ల క్రితం చంద్రయానాన్ని నిజం చేసి చరిత్ర సృష్టించింది. దాదాపు దశాబ్దం తర్వాత ఇప్పుడు మళ్లీ రెండో చంద్రమండల యాత్రకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో చంద్రయాన్-1 సాధించిందేమిటి? మళ్లీ ఇప్పుడు చంద్రయాన్-2 ఎందుకు? మొదటి యాత్రకూ, తాజా ప్రయత్నానికీ ఏమిటి తేడా? వంటి ఎన్నో ఆసక్తికర ప్రశ్నలు పైకొస్తున్నాయి!

చంద్రయాన్-1

కక్ష్యకే పరిమితం

గతంలో పంపిన చంద్రయాన్-1 ప్రధానంగా చంద్రుడి చుట్టూ ఓ కక్ష్యలో తిరుగుతూ.. చంద్రుడికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, భూమికి పంపింది. కాకపోతే చంద్రుడిపై భారత ముద్ర ఉండాలన్న ఉద్దేశంతో ఓ 35 కేజీల పరిశోధక 'మూన్ ఇంపాక్ట్ ప్రోబ్'ను (ఎంఐపీ) చంద్రుడి మీదికి జారవిడిచింది. అది విసిరేసినట్లుగా వెళ్లి చంద్రుడిని బలంగా ఢీ కొట్టింది. జాబిల్లి ఉపరితలాన్ని తాకి బద్దలయ్యేలోగా కొన్ని పరిశోధనలు చేసి, సమాచారం పంపింది.

సాధించిందేమిటి?

- చంద్రుడి ఉపరితలం మీద నీరు, ఐస్ ఉందని గుర్తించడం చంద్రయాన్-1 సాధించిన సంచలన విజయం! అంతరిక్ష ప్రయోగాల దిశ, దశ మార్చిన ఆవిష్కారం ఇది. చంద్రుడి మీద నీరు.. మనం రోజువారీ చూసే నీటి రూపం (హెచ్2ఓ)లో కాకుండా హైడ్రాక్సైల్ అయాన్ల (ఓహెచ్) రూపంలో ఉందని ఇది గుర్తించింది.
- చంద్రయాన్-1లో అమెరికా, ఐరోపా, బల్గేరియాలు కూడా తమతమ సొంత పరిశోధనల కోసం ఆరు పరికరాలను పంపాయి. నీటి ఆనవాళ్లను ముందుగా అమెరికా సాధనం 'మూన్ మినరాలజీ మ్యాపర్' పట్టుకుంది, అందుకే నీటి ఉనికి గురించి ముందు 'నాసా' ప్రకటించింది. ఆ తర్వాత ఇస్రో కూడా దాన్ని నిర్ధారించింది.
- భూకంపాల తరహాలోనే చంద్రకంపాలు కూడా వస్తున్నాయని, చంద్రుడి ఎగువ ఫలకాల్లో కదలికలు సంభవిస్తున్నాయని (టెక్టానిక్ యాక్టివిటీ) గుర్తించింది. అలాగే చంద్రుడిలో శాశ్వతంగా చీకటిలోనే ఉండిపోయే అనేక బిలాలను తొలిసారిగా ఫోటోలు తీసి పంపింది. చంద్రుడి ఉపరితల 'హై రిజల్యూషన్ మ్యాప్'ను సిద్ధం చేసింది.

చంద్రయాన్-1 చంద్రుడి చుట్టూ దాదాపు 3 వేల సార్లు పరిభ్రమించి 70,000 ఫొటోలను పంపింది.

అర్ధంతరంగా ముగిసింది!

రెండేళ్లు పని చేసేలా రూపొందించినా చంద్రయాన్-1 ప్రస్థానం 10 నెలలకే ముగిసింది. ప్రయోగించిన కొద్దివెల్లకే వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. మొదట్లోనే విద్యుత్ వ్యవస్థ విఫలమైంది. ఇస్రో ఇంజినీర్లు శ్రమించి, దాన్ని అధిగమించారు. 2009 జనవరిలో వ్యోమనౌకలోని ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తాయి. దాంతో వేడి పెరిగిపోయింది. మెల్లగా దానిలోని 'స్టార్ సెన్సర్' విఫలమై, అది గాడి తప్పింది, 2009 ఆగస్టు 29న దాంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్పటికే అది తన లక్ష్యాల్లో 90% వరకూ పూర్తి చేయటంతో శాస్త్రవేత్తలు దాన్ని చాలావరకూ విజయంగానే పరిగణించారు. తర్వాత 2016లో ఒకసారి అది చంద్రుడి చుట్టూ ఒక దిశానిర్దేశం లేకుండా తిరుగుతూ నాసా రాడార్ల కంటపడింది.

బుల్లి సాధనం వల్లే..

మొదట్లో చంద్రుడి కక్ష్యలోని ఉష్ణం వల్లే చంద్రయాన్-1 కథ అర్ధంతరంగా ముగిసిందని భావించినా.. తర్వాత చేసిన పరిశోధనల్లో అమెరికా నుంచి దిగుమతి చేసుకుని, దానిలో వాడిన చిన్న 'డిసి-డిసి కన్వర్టర్' వల్లే అది విఫలమైందని వెల్లడైంది. 5వేల డాలర్లతో కొన్న ఆ కన్వర్టర్ బరువు కేవలం 110 గ్రాములు. అంత చిన్న పరికరం మొత్తం వ్యోమనౌకే విఫలమయ్యేలా చేయటం చూసి.. "ఇది ఒక చీమ.. ఏనుగును చంపడం లాంటిదన్నమాట" అని ఇస్రో ఇంజినీర్ ఒకరు వ్యాఖ్యానించారు. అందుకే ఈ పరికరాన్ని ఇప్పుడు మరింత సమర్థంగా దేశీయంగానే రూపొందించి చంద్రయాన్-2లో వాడుతున్నారు. గతంలో మంగళ్‌యాన్‌లో కూడా దీన్ని వాడగా, అది ఇప్పటికీ అద్భుతంగా పనిచేస్తోంది!



చంద్రయాన్-2 ఏమిటి తేడా?

వాస్తవానికి చంద్రయాన్-2కు మూలాలన్నీ చంద్రయాన్-1లోనే ఉన్నాయి. కాకపోతే దానికి ఇది పెద్ద కొనసాగింపు. చంద్రయాన్-1 చంద్రుడి కక్ష్యలోనే తిరిగితే.. చంద్రయాన్-2 చంద్రుడి చుట్టూ కక్ష్యలో తిరగటమే కాదు.. సున్నితంగా చంద్రుడి మీద దిగుతుంది కూడా. చంద్రయాన్-1 అనుభవాలను పునాదిగా చేసుకుని ఇస్రో దీన్ని మరింత పకడ్బందీగా తీర్చిదిద్దుతోంది.

ఇవీ తేడాలు

- **ఢీకొట్టటం కాదు.. నిదానంగా దిగటం:** చంద్రయాన్-1లోని ఎంఐపీ.. విసిరేసినట్టుగా చంద్రుడిని ఢీ కొట్టి బద్దలైపోగా.. చంద్రయాన్-2లోని ల్యాండర్ మాత్రం తన రాకెట్లతో వేగాన్ని నియంత్రించుకుంటూ చాలా నిదానంగా చంద్రుడి మీద దిగుతుంది. దానిలో నుంచి రోవర్ బయటకొచ్చి చంద్రుడి మీద ఆ ప్రాంతమంతా కలియదిరుగుతుంది కూడా. ఒక రకంగా చంద్రుడిని ఢీకొట్టటంతో మొదటిదాని ప్రస్థానం ముగిసిపోగా.. చంద్రుడి మీద దిగటంతోనే చంద్రయాన్-2 ప్రస్థానం మొదలవుతుందని చెప్పుకోవచ్చు.
- **అపూర్వ సమాచారం:** చంద్రయాన్-2లో ఎంతో సూక్ష్మంగా, అత్యంత సమర్థంగా పని చేసే ఎన్నో పరికరాలు అమర్చారు. వీటితో అపూర్వ సమాచారం మనకు అందబోతోంది. చంద్రయాన్-1లోని మొత్తం 11 పరికరాల్లో 5 మాత్రమే మనవి. కానీ చంద్రయాన్-2లోని మొత్తం 14 ఉపకరణాల్లో 13 మనవే. కేవలం లేజర్ రిట్రో రిఫ్లెక్టోమీటర్ అర్రే (ఎల్ఆర్ఏ) అనే ఒక్క పరికరాన్నే అమెరికా నుంచి తీసుకున్నారు. ఇదేమంత కీలక పరికరం కాదు.
- చంద్రయాన్-1 గుర్తించిన చంద్రుడి మీది నీటి (హైడ్రాక్సైల్ అయాన్ల) తీరు తెన్నులను చంద్రయాన్-2 మరింత లోతుగా పరిశోధిస్తుంది. ఇందుకోసం దీనిలో ఖనిజాలు, నీటి అణువుల వంటివాటిని సవివరంగా గుర్తించే ఇమేజింగ్ ఐఆర్ స్పెక్ట్రోమీటర్ (ఐఐఆర్ఎస్), సింథటిక్ అపెర్చర్ రాడార్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి ఖనిజాలను మనం తవ్వితెచ్చుకునే వీలుందా? అన్నదీ తెలుస్తుంది. చంద్రుడికి సంబంధించిన త్రీడీ మ్యాప్‌లను రూపొందించేందుకు, జాబిల్లి పుట్టుక గురించి తెలుసుకునేందుకు అవసరమైన సమాచారాన్ని కూడా చంద్రయాన్-2 సేకరిస్తుంది. అంతిమంగా భవిష్యత్తులో మనం అక్కడికి వెళ్లి ఆవాసం ఏర్పాటు చేసుకునే వీలుందా? అన్న ప్రశ్నకు కొంతవరకైనా కచ్చితమైన జవాబును అందిస్తుంది.

	బరువు	వ్యయం	పరిశోధన పరికరాలు	వాహకనౌక	ప్రయోగ తేదీ
చంద్రయాన్-1	1.38 టన్నులు	రూ.386 కోట్లు	11 (భారత్‌వి 5, విదేశాలవి 6)	పీఎస్ఎల్‌వీ సి-11	2008 అక్టోబర్ 22
చంద్రయాన్-2	3.8 టన్నులు	రూ.978 కోట్లు	14 (అమెరికా సాధనం ఒకటి)	జీఎస్ఎల్‌వీ మార్క్-3	2019 జులై 15

– ఈనాడు ప్రత్యేక విభాగం

49,012 మందికి బీటెక్ సీట్లు

- 49 కళాశాలల్లో అన్ని సీట్లు కేటాయింపు
- ఆప్షన్లు ఇచ్చుకున్నా 3,499 మందికి దక్కలేదు
- మిగిలిపోయిన సీట్లు 16,432
- అత్యధికంగా మిగిలింది మెకానికల్, ఈఈఈ, సివిల్, ఈసీఈ బ్రాంచీల్లోనే
- రుసుం చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు ఈ నెల 15

ఈనాడు – హైదరాబాద్

ఇంజినీరింగ్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 49,012 మందికి బీటెక్ సీట్లు దక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటా కింద 65,444 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిల్లో 75 శాతం సీట్లను కేటాయించారు. అత్యధికంగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లోనూ 961 సీట్లు మిగిలిపోవడం గమనార్హం. సీట్లు పొందిన వారిలో ఎంత మంది కళాశాలల్లో చేరతారన్నది ఈనెల 15వ తేదీ నాటికి తేలనుంది. ఈసారి సున్నా ప్రవేశాలు ఉన్న కళాశాలలు ఒక్కటీ లేకపోవడం విశేషం. ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు ఎంసెట్ ప్రవేశాల కమిటీ బుధవారం సాయంత్రం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సీట్లు కేటాయించింది. సీట్లు పొందిన వారు ఈనెల 15లోపు నెట్ బ్యాంకింగ్/క్రెడిట్ కార్డు/డెబిట్ కార్డు ద్వారా ఎంసెట్ వెబ్‌సైట్ నుంచి రుసుం చెల్లించి.. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఎంసెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిత్తల్ తెలిపారు. టీఏఎఫ్ఆర్‌సీ, ప్రభుత్వ తుది నిర్ణయం మేరకు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికి జోసా కౌన్సెలింగ్ ఈనెల 18తో ముగుస్తుంది. ఈ క్రమంలో ఎంసెట్ తుది విడత కౌన్సెలింగ్ ఈనెల 20 తర్వాత జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సీట్ల కేటాయింపు పరిస్థితి..

- ◆ ఎంసెట్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణులైన వారు: 93,943
- ◆ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన వారు: 53,934
- ◆ ఆప్షన్లు ఇచ్చుకున్న వారు: 52,628
- ◆ మొత్తం బీటెక్ సీట్లు: 65,444
- ◆ బీటెక్ సీట్లు పొందిన వారు: 49,012
- ◆ మిగిలిపోయిన బీటెక్ సీట్లు: 16,432

ఫార్మసీలో..

- ◆ మొత్తం బీఫార్మసీ, ఫార్మా డి సీట్లు వరుసగా: 3,280; 535
- ◆ బీఫార్మసీ, ఫార్మా డి సీట్లు పొందిన వారు వరుసగా: 87; 30
- ◆ మిగిలిపోయిన సీట్లు: 3,698

సీట్ల కేటాయింపులో ముఖ్యాంశాలు..

- ◆ 13 ప్రభుత్వ, 36 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అన్ని సీట్లను కేటాయించారు.
- ◆ ఐచ్ఛికాలు ఇచ్చుకున్నా 3,499 మందికి సీట్లు దక్కలేదు. తక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవడమే కారణం.
- ◆ ప్రభుత్వ కళాశాలలు మొత్తం 14 ఉండగా.. వాటిల్లో కేవలం 2 సీట్లు మాత్రమే భర్తీ కాలేదు.
- ◆ అత్యధికంగా మెకానికల్‌లో 4,642 సీట్లు మిగిలిపోయాయి. మొత్తం 38లో 25 బ్రాంచీల్లో 100 శాతం సీట్లు కేటాయించారు.
- ◆ ఈ విద్యా సంవత్సరం కొత్తగా ప్రవేశపెట్టిన బీటెక్ కృత్రిమ మేధలో 84 సీట్ల కోసం 2,256 మంది పోటీ పడ్డారు. అన్నీ సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్ఐటీలో 42 సీట్లుండగా 1644 మంది పోటీపడ్డారు.

86 శాతం మందికి సీఎస్ఈనే కావాలి

మొత్తం 52,628 మంది ఐచ్ఛికాలు ఇచ్చుకోగా వారిలో 45,514 మంది (86.48 శాతం) మంది కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్ఈ)ను కోరుకున్నారు. వారందరు మొత్తం 9,50,748 ఐచ్ఛికాలు ఇచ్చుకున్నారు. సగటున ఒక్కో విద్యార్థి 21 కళాశాలల్లో సీఎస్ఈ సీటు కోసం పోటీ పడ్డారు. 35,937 మంది ఈసీఈకి, 21,646 మంది ఐటీ సీట్లకు, 20,410 మంది ఈఈఈ, 16,608 మంది సివిల్, 14,612 మంది మెకానికల్ ఇంజినీరింగ్ సీట్ల కోసం ఐచ్ఛికాలు ఇచ్చుకున్నారు.

ప్రధాన బ్రాంచీల వారీగా భర్తీ, మిగిలిపోయిన సీట్ల వివరాలు

బ్రాంచీ	మొత్తం	సీట్లు భర్తీ	ఖాళీ
సీఎస్ఈ	7248	6287	961
ఐటీ	4272	4192	80
మెకానికల్	9193	4551	4642
ఈఈఈ	8282	4552	3730
ఈసీఈ	15581	12352	3229
సివిల్	8363	4860	3503

విద్యాసంస్థల వారీగా కేటాయింపు పరిస్థితి..

విద్యాసంస్థ	సంఖ్య	మొత్తం	సీట్లుభర్తీ	ఖాళీ
ప్రభుత్వ	14	3071	3069	02
ప్రైవేట్	169	62373	45943	16430
మొత్తం	183	65444	49012	16432

రద్దయిన నిబంధన పరిధిలో వాదనలా?

ఎర్రమంజిల్ వివాదంలో హైకోర్టు వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: చారిత్రక నిర్మాణాలుగా గుర్తించడానికి వీలుగా ఉన్న హుడా నిబంధన రద్దయిందని, దాని ఆధారంగా ఇక్కడ వాదనలు వినిపించడం సరికాదంటూ బుధవారం హైకోర్టు వ్యాఖ్యానించింది. 2015లో ఆ నిబంధనను తొలగిస్తూ జారీ అయిన జీవోను సవాలు చేయకుండా ప్రస్తుతం నిబంధన అమల్లో ఉన్నట్లుగా వాదించరాదంది. సంబంధిత శాఖ చారిత్రక కట్టడంగా గుర్తిస్తే ఆ విషయాన్ని చెప్పాలని స్పష్టం చేసింది.

ఎర్రమంజిల్ భవనం స్థానంలో అసెంబ్లీ నిర్మాణాన్ని చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ జె.శంకర్, లుబ్నా సార్వత్, ప్రొ.పీఎల్ విశ్వేశ్వరరావు, దేబరాలు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం విదితమే. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు రమాకాంత్‌రెడ్డి, రచనారెడ్డిలు వాదనలు వినిపించారు. చారిత్రక నిర్మాణాలను గుర్తించడానికి వీలుగాఉన్న నిబంధనను రద్దు చేయడమే సరికాదన్నారు. వీటిపై గురువారమూ వాదనలు కొనసాగనున్నాయి.

వారసుల పిటిషన్‌పై విచారణకు అనుమతి

ఎర్రమంజిల్ భవనం ఉన్న స్థలానికి సంబంధించిన వివాదం నడుస్తోందని, దాని స్థానంలో అసెంబ్లీ నిర్మాణం చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నవాబ్ సఫ్దర్‌జంగ్ ముషీరుద్దౌలా ఫఖరుల్ ముల్క్ వారసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు హైకోర్టు అనుమతించింది. పిటిషనర్ల తరపు న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ ఎర్రమంజిల్ భవనం ప్రాంతంలో తమకు 12 ఎకరాల భూమిపై హక్కు ఉందని, వాటి పంపిణీకి సంబంధించి 1951 నుంచి వివాదం నడుస్తోందని పేర్కొన్నారు. ఈ స్థలానికి హైకోర్టు సంరక్షక పాత్ర పోషిస్తోందని, అందువల్ల రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదిగా చేసినట్లు తెలిపారు. దీంతో రిజిస్ట్రీని నామమాత్రపు ప్రతివాదిగా పరిగణిస్తూ విచారణకు అనుమతించింది.

ఐటీడీఏ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు

ఈనాడు, హైదరాబాద్: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో ఆరు గిరిజన క్రీడా పాఠశాలల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉట్నూరు, ఏటూరు నాగారం, భద్రాచలం ఐటీడీఏల పరిధిలో నాలుగు బాలుర, రెండు బాలికల క్రీడా పాఠశాలల్ని కేంద్రం మంజూరు చేసింది. వీటిలో ఒకటో తరగతిలో 40 మంది చొప్పున ఆరు పాఠశాలల్లో 240 మందిని చేర్చుకునేలా ప్రవేశాలు జరుగుతున్నాయి. ఈ నెల 15 వరకు ఈ ప్రవేశాలు పూర్తవుతాయని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టీనా తెలిపారు. ఈ క్రీడా పాఠశాలల్లో అధికారులు, సిబ్బందికి రెండు రోజులపాటు తెలంగాణ క్రీడాపాఠశాల సమన్వయంతో నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయని పేర్కొన్నారు. ఏటా ఒక్కో తరగతిని పెంచుతూ పదేళ్లలో పూర్తిస్థాయి క్రీడా పాఠశాలలుగా వీటిని తీర్చిదిద్దుతామని వెల్లడించారు. శిక్షణ కార్యక్రమ ముగింపు సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, తెలంగాణ క్రీడా పాఠశాల ఓఎస్‌డీ నరసయ్యగౌడ్, ఐటీడీఏ పీవోలు పాల్గొన్నారు.

ఆరు రైళ్ల రాకపోకలు యథాతథం

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్-డోన్ సెక్షన్‌లో నియంత్రించనున్నట్లు ప్రకటించిన ఆరు రైళ్ల రాకపోకలు జులై 11, 12, 13 తేదీల్లో యథావిధిగా సాగుతాయని దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇటిక్యాల-మనపాడ్ స్టేషన్ల మధ్య పట్టాల మరమ్మతుల నేపథ్యంలో జులై 13 వరకు నిర్ణీతవేళల్లో పలు రైళ్ల రాకపోకల్ని నియంత్రించనున్నట్లు జూన్ 18న ప్రకటించింది. ఆ పనులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పూర్తయ్యాయి. దీంతో కాచిగూడ-గుంతకల్ ప్యాసింజర్, కర్నూలుసిటీ-సికింద్రాబాద్ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్, గుంతకల్-కాచిగూడ ప్యాసింజర్, కాచిగూడ-గుంటూరు డెమూ, కాచిగూడ-కర్నూలుసిటీ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌తో పాటు కాచిగూడ-మధురై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 11, 12, 13 తేదీల్లో నిర్ణీత సమయం ప్రకారమే రాకపోకలు సాగిస్తాయని ద.మ.రైల్వే పేర్కొంది.

ఒడిశా ముఖ్యమంత్రి సహాయనిధికి సింగరేణి రూ.కోటి విరాళం

ఈనాడు, హైదరాబాద్, గోదావరిఖని, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో దెబ్బతిన్న ఒడిశాకు సింగరేణి సంస్థ రూ.కోటి విరాళంగా అందజేసింది. బుధవారం సంస్థ ఛైర్మన్ శ్రీధర్ భువనేశ్వర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిసి చెక్కును అందజేశారు. వరదల సమయంలో సింగరేణి బృందాలు సేవలందించిన విషయాన్ని కూడా ఒడిశా ముఖ్యమంత్రికి సింగరేణి ఛైర్మన్ గుర్తుచేసినట్లు సంస్థ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఒడిశాలోని అంగూల్ జిల్లాలోని నైనీ బొగ్గు గనిని ఈ సంస్థకు కేంద్రం గతంలో కేటాయించింది. ఈ గనిలో బొగ్గు తవ్వకాలకు సహకరించాలని కోరేందుకు సింగరేణి అధికారులు భువనేశ్వర్ వెళ్లి అక్కడి అధికారులు, సీఎంతో చర్చించారు.

ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్‌కు చెక్కును అందజేస్తున్న సింగరేణి ఛైర్మన్ శ్రీధర్

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 14న ఓటర్ల జాబితా ప్రచురించండి
- ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పురపాలక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఓటర్ల జాబితాల ప్రచురణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు మేరకు ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేయాలని మార్గదర్శనం చేశారు. పురపాలక ఎన్నికల నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల కమిషనర్లకు ఎన్నికల సంఘం శిక్షణ సదస్సు నిర్వహించింది. కార్యదర్శి అశోక్‌కుమార్, పురపాలకశాఖ సంచాలకురాలు టి.కె.శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీన ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఆదేశాలిచ్చారు. ఎన్నికలు జరుగుతున్న అన్ని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల్లో రాజకీయ పార్టీల నేతలతో గురువారం సమావేశమై పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. తప్పనిసరి అయితేనే పోలింగ్ కేంద్రాలను మార్చాలని స్పష్టం చేశారు. అనంతరం ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్ల జాబితాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేసుకోవాలని పురపాలక శాఖ సంచాలకురాలు శ్రీదేవి సూచనలిచ్చారు. ఓటర్ల జాబితా అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి, పురపాలకశాఖ సంచాలకురాలు శ్రీదేవి

డిగ్రీ కళాశాలల్లో 20% యాజమాన్య కోటా!

- ప్రభుత్వ ఆమోదం కోసం ఉన్నత విద్యామండలి ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో యాజమాన్య కోటా అమలు చేయనున్నారు. మొత్తం సీట్లలో 20 శాతం సీట్లను కళాశాలలు సొంతగా భర్తీ చేసుకునేలా యాజమాన్య కోటా కింద అవకాశం ఇవ్వనున్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు గత ఏడాది నుంచి దీనిపై ప్రభుత్వానికి విన్నవిస్తున్నాయి. ఇటీవల యాజమాన్య ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తదితరులకు వినతిపత్రాలు అందించారు. వారు కూడా 20 శాతం యాజమాన్య కోటా ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) ద్వారా మూడు విడతల్లో సీట్లు కేటాయించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెలువడితే మరోసారి కొత్తగా రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇచ్చి సీట్లు కేటాయించాలన్నది దోస్త్ అధికారుల ఆలోచన. దానిపై నోటిఫికేషన్ ఇచ్చేలోపు యాజమాన్య కోటాపై నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

విద్యాశాఖ కార్యదర్శికి ప్రతిపాదన

యాజమాన్యాల వినతిని ప్రస్తావిస్తూ యాజమాన్య కోటాపై నిర్ణయం తీసుకోవాలన్న ప్రతిపాదనను దోస్త్ అధికారులు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ జనార్దన్‌రెడ్డికి పంపారు. దీనిపై ఈ వారంలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. యాజమాన్య కోటా ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి బోధనారుసుముల భారం కొంత తగ్గే అవకాశం ఉంది. అలాగే ఏ కోర్సులో సీటు రానివారు యాజమాన్య కోటా ఉంటే చివరి అవకాశంగా డిగ్రీలో చేరుతారని భావిస్తున్నారు.

ఇదీ దోస్త్ సీట్ల పరిస్థితి

- ◆ మొత్తం కళాశాలలు: 984(వీటిలో 132 ప్రభుత్వ కళాశాలలు)
- ◆ మొత్తం సీట్లు: 3,86,204
- ◆ మూడు విడతల కౌన్సెలింగ్‌లో చేరిన వారు: 1,19,098
- ◆ ఇప్పటివరకు మిగిలిపోయిన సీట్లు: 2,67,106

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలెప్పుడు?

ఆలస్యంతో విద్యార్థుల పరేషాన్

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల కోసం వేలాది మంది విద్యార్థులతోపాటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు జూన్ 12తో పూర్తయ్యాయి. నెల రోజులవుతున్నా ఫలితాలపై ఇంటర్ బోర్డు అధికారులు నోరు విప్పడంలేదు. బోర్డు కమిషనర్ అశోక్‌ను అడిగితే త్వరలో అని మాత్రమే సమాధానం ఇచ్చారు. పరీక్షలకు మొత్తం 4.63 లక్షల మంది హాజరయ్యారు. రెండో ఏడాది ఫలితాలైనా తొలుత వెల్లడిస్తే బాగుంటుందని, ఉత్తీర్ణులైన వారు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉత్తీర్ణులైన వారిలో కొందరు ఇంజినీరింగ్, ఇతరకోర్సుల్లోనూ చేరనున్నారు.

లేఖలు ఇస్తున్న ఇంటర్‌బోర్డు

కొందరు విద్యార్థులు ఇంటర్‌లో తప్పినా.. ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీల్లో సీట్లు పొందారు. సప్లిమెంటరీ ఫలితాలు రాకపోవడంతో వారు ఇంటర్ బోర్డును ఆశ్రయిస్తున్నారు. 'ఫలితాలు రావాల్సి ఉంది, దీన్ని పరిగణనలోకి తీసుకొని సీటు ఇవ్వండి' అంటూ జేఈఈ ఛైర్మన్‌ను కోరుతూ బోర్డు ఆయా విద్యార్థులకు లేఖలు ఇస్తోంది. జులై 2వ వారంలో ఫలితాలు వెల్లడిస్తామని ఆ లేఖల్లో పేర్కొనడం గమనార్హం. మరోవైపు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన మరుసటి రోజు ప్రత్యేక విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ ఇస్తామని బుధవారం 'దోస్త్' కన్వీనర్ ఆచార్య ఆర్.లింబాద్రి ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.లక్షలిస్తే గురుకులాల్లో కొలువు

- వెలుగు చూసిన బోగస్ కన్సల్టెన్సీ మోసం
- 'ఈనాడు-ఈటీవీ'ని ఆశ్రయించిన బాధితులు

ఖమ్మం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగాల కోసం ఎదురుచూసే నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకొని రూ.లక్షలు వసూలు చేసేందుకు ఓ ప్రైవేటు ఏజెన్సీ సంస్థ గురుకులాల్లో పొరుగు సేవల పేరిట ఎర వేసింది. బాధితులు 'ఈనాడు-ఈటీవీ'ని ఆశ్రయించడంతో.. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అది బోగస్ సంస్థ అని తేల్చి చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోరియస్ సె

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ
174 ↓	57 ↓
38557	11499

డోజోన్స్	నాస్‌డాక్
85 ↑	52 ↑
26869	8194

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00ప (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి	ముడిచమురు
68.58 ↓ 07 పైసలు	66.77 ↑
(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)

నిఫ్టీ	10న	మార్పు%
YES BANK	93.00	1.81
COAL INDIA	233.35	1.63
SUN PHARMA	392.20	1.50
KOTAK BANK	1475.85	0.89
ICICI BANK	430.90	0.56
WIPRO	266.95	0.55
HDFC BANK	2388.75	0.40

గ్రహణం (-)

నిఫ్టీ	10న	మార్పు%
BAJAJ FINANCE	3429.05	-4.83
INDIABULLS HSG	659.60	-4.00
BPCL	349.60	-2.92
TATA STEEL	454.80	-2.91
JSW STEEL	254.90	-2.84
TATA MOTORS	151.65	-2.66
BAJAJ FINSERV	7658.20	-2.51

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	62.44	72.41	బహ్రెయిన్ దీనార్	169.01	193.37
పౌండ్ స్టెర్లింగ్	77.75	90.19	కువైట్ దీనార్	186.59	231.96
యూరో	69.98	81.15	ఒమన్ రియాల్	165.38	189.45
జపనీస్ యెన్/100	57.33	66.50	సౌదీ రియాల్	16.61	19.68
ఆస్ట్రేలియా డాలరు	43.22	50.01	యూఏఈ దిర్హమ్	16.99	19.87
సింగపూర్ డాలరు	45.84	54.30	మలేషియా రింగిట్	14.77	18.16
థాయ్ బాత్/100	202.47	242.09	చైనీస్ యువాన్	7.05	11.45

బుధవారం నిఫ్టీ కదలికలు

10న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	429	వరంగల్	432
చిల్లరగా(ఒక గుడ్డు)	4.90	విశాఖపట్నం	444
బెంగళూరు	455	చెన్నై	475
11వ తేదీకి...		చిత్తూరు	468
విజయవాడ/గోదావరి	420	నమక్కల్	465

యూఎస్ మార్కెట్‌కు అరబిందో ఔషధం

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా యూఎస్ మార్కెట్లో సినకాల్సిట్ హైడ్రోక్లోరైడ్ అనే జనరిక్ ఔషధాన్ని విడుదల చేసింది. బహుళ జాతి ఔషధ కంపెనీ అయిన ఆమ్‌జెన్ ఇంక్., విక్రయిస్తున్న సెన్సిపార్ అనే ట్యాబ్లెట్‌కు సినకాల్సిట్ హైడ్రోక్లోరైడ్ జనరిక్ ఔషధమని అరబిందో ఫార్మా వివరించింది. గత ఏడాది కాలంలో ఈ ఔషధం యూఎస్ మార్కెట్లో 1,449 మిలియన్ డాలర్ల విక్రయాలను నమోదు చేసినట్లు వెల్లడించింది. మూత్రపిండాల వ్యాధితో పాటు సెకండరీ హైపర్‌పారాథైరాయిడిజమ్ (హెచ్‌పీటీ) ఉన్న వారికి ఈ ఔషధాన్ని సిఫార్సు చేస్తారు.

ఐఎల్ & ఎఫ్ఎస్ తొలి ఎగవేతకు పాల్పడి అపుడే ఏడాది గడిచింది. మరి ఈ సంవత్సర కాలంలో వ్యవస్థను చక్కదిద్దడానికి సెబీ ఏం చేసింది? ముందస్తు సంకేతాలను వెలువరచలేని రేటింగ్ ఏజెన్సీలపై ఝుళిపించిన కొరడా సత్ఫలితాలను అందిస్తుందా? భవిష్యత్‌లో ఎటువంటి సంక్షోభాలు ఎదురుకావా? ఒక వేళ ఎదురైనా ముందుగానే హెచ్చరికలు వచ్చేలా కట్టుదిట్టం చేసిందా? ఇవన్నీ యక్ష ప్రశ్నలుగానే తోస్తున్నాయి. వాటికి సమాధానం అంత సులువైతే కాదు.

మరో ఐఎల్ & ఎఫ్ఎస్ ఎదురవుతుందా?

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్(ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) సంక్షోభం బారిన పడి సంవత్సరం పూర్తయింది. సరిగ్గా ఏడాది కిందట రూ.450 కోట్ల అంతర్గత కార్పొరేట్ డిపాజిట్లు, వాణిజ్య పత్రాల విషయంలో తొలి ఎగవేత చేసిందా కంపెనీ. అదే 'మినీ లేమాన్' సంక్షోభానికి దారితీసింది. కార్పొరేట్లకు రుణాలిచ్చే సంస్థలే ద్రవ్య సంక్షోభం బారిన పడితే ఎలా ఉంటుంది? షాడో బ్యాంకర్లుగా పిలిచే వీటిలోనే డబ్బులు లేకపోతే మనీ మార్కెట్ కుదేలు కాక ఏమవుతుంది. కార్పొరేట్ రుణాలు ప్రియం కాక ఏంచేస్తాయి. ఒక్క సంస్థతో ఆ సంక్షోభం ఆగి ఉండి ఉంటే పెద్దగా ఇబ్బంది లేకపోయేది. అంటు రోగంలా అది ఇతర బ్యాంకింగేతర సంస్థలకు, గృహ ఆర్థిక కంపెనీలకు పాకింది. దేవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటివి కూడా వాణిజ్య పత్రాలు, డిబెంచర్ల చెల్లింపుల విషయంలో కష్టాలను ఎదుర్కొన్నాయి.

పాపం రేటింగ్ ఏజెన్సీలదేనా?: మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు రేటింగ్ ఏజెన్సీల వ్యవహార శైలి చాలా మంది మార్కెట్ వర్గాలకు కోపం తెప్పించింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభాన్ని ముందుగానే పసిగట్టడంలో అవి విఫలం కావడం వారు జీర్ణించుకోలేకపోయారు. ప్రాజెక్టులు ఆగిపోయి.. నగదు ప్రవాహం నిలిచిపోయేంత వరకు కూడా కొద్దిగా కూడా ప్రమాదాన్ని పసిగట్టలేకపోవడం ఆ కోపానికి కారణం. ఆగస్టులో కంపెనీ ఎగవేత చేసేంత వరకూ ఎలాంటి సంకేతాలను ఇవ్వలేకపోవడం దారుణమేగా. విచిత్రం ఏమిటంటే.. 2008-09 అంతర్జాతీయ సంక్షోభ సంక్షోభం లోనూ రేటింగ్ ఏజెన్సీలు ఎటువంటి ప్రమాద ఘంటికలనూ ముందుగా మోగించలేకపోవడం ఇక్కడ గమనించదగ్గ విషయం. ప్రఖ్యాతిగాంచిన స్టాండర్డ్ అండ్ పూర్స్, మూడీస్, ఫిచ్‌లు ఏ కోశానా కనిపెట్టలేకపోయాయి.

2880 ఎకరాల భూవిక్రయం

గుజరాత్ కచ్ ప్రాంతంలోని 7 గ్రామాల్లో తనకున్న 2880 ఎకరాల భూమిని ఐఎల్&ఎఫ్ఎస్ విక్రయించనుంది. ఆస్తులను నగదీకరించడంలో భాగంగా ఈ చర్య చేపడుతోంది. ఇప్పటికే ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. మూడు అనుబంధ సంస్థలకు(ఆవాశ్ లాజిస్టిక్ పార్క్స్, సీలాండ్ పోర్ట్స్, గుజరాత్ ఇంటిగ్రేటెడ్ మారిటైమ్ కాంప్లెక్స్) చెందిన ఆ భూముల విక్రయానికి ప్రోపర్టీ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ సహాయం చేస్తోంది. దాదాపు 40 బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్ రూ.లక్ష కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్న సంగతి తెలిసిందే.

సంక్షోభాన్నే అవకాశంగా..: ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభాన్ని సెబీ ఒక అవకాశంగా భావించి రంగంలోకి దిగింది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలపై నిబంధనలను కఠినతరం చేసి వారి బాధ్యతను పెంచింది. మరో సారి ఈ తరహా సంక్షోభం తలెత్తకుండా చేయడానికి గట్టి చర్యలు చేపట్టింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు మేలో ఇచ్చిన రేటింగ్ ఆధారంగా ఇక్రాపై చర్యలు మొదలుపెట్టింది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల వెల్లడి నిబంధనలపై కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. సరైన సమయంలో ఎగవేతలను గుర్తించడానికి ఒక విశిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

మ్యూచువల్ ఫండ్‌లూ ఇబ్బందుల్లో..

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం సెగ మ్యూచువల్ ఫండ్ సంస్థలకూ తగిలింది. కంపెనీల ప్రమోటర్లకు వారి షేర్లను తనఖా పెట్టుకుని ఫండ్‌లు రుణాన్ని ఇచ్చేవి. అయితే జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్(జీ) ప్రమోటర్లు డిఫాల్ట్ కావడంతో ఫండ్‌లపైనా సెబీ దృష్టి సారించాల్సి వచ్చింది. ప్రమోటర్లు మ్యూచువల్ ఫండ్‌లతో చేసుకునే స్టాండ్‌స్టిల్ ఒప్పందాలను రద్దు చేసింది. ఫండ్‌లు బ్యాంకులు కాదంటూ వారికి గుర్తు చేసింది.

మొత్తమ్మీద సెబీ చర్యలతో భవిష్యత్‌లో ఎటువంటి సంక్షోభాలు ఎదురుకాకుండా ఉంటాయా లేదా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

ఎగుమతుల్లో 3వ స్థానమే లక్ష్యం

- త్వరలో ఎగుమతుల ప్రోత్సాహక వ్యూహం
- సీఐఐ సదస్సులో జయేశ్ రంజన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఎగుమతుల ప్రోత్సాహక వ్యూహాన్ని ఆవిష్కరించనుందని పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యధికంగా ఎగుమతులు నమోదు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ప్రస్తుతం 5వ స్థానంలో ఉందని, 3వ స్థానానికి ఎదగాలనే లక్ష్యంతో ఈ నూతన వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు ఆయన వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఉన్న ఎగుమతి అవకాశాలపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ విభాగం బుధవారం ఇక్కడ నిర్వహించిన సదస్సులో జయేశ్ రంజన్ మాట్లాడారు. రాష్ట్రం నుంచి ప్రస్తుతం రక్షణ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులు, గ్రానైట్ అధికంగా ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు ఆయన తెలిపారు. మన దేశం నుంచి నమోదవుతున్న గ్రానైట్ ఎగుమతుల్లో 70 శాతం తెలంగాణ నుంచే జరుగుతున్నాయన్నారు. సేవల విషయానికి వస్తే... సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎగుమతులను ఇంకా పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక చర్యలు ప్రతిపాదిస్తోందన్నారు. స్థానిక ఎంఎస్ఎంఈ యూనిట్లకు ఎగుమతులను గణనీయంగా పెంచుకునే అవకాశాలున్నాయని సీఐఐ-తెలంగాణ విభాగం ఛైర్మన్ డి.రాజు అన్నారు. ఎంఎస్ఎంఈ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వీటిని వినియోగించుకోవాలని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ సైనీ పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు ఎగుమతులు నిర్వహించేందుకు అవసరమైన పత్రాల తయారీలో ఎస్‌బీఐ సహాయపడుతోందని ఆ బ్యాంకు డీజీఎం దేవాశిష్ మిశ్రా వివరించారు. సీఐఐ-తెలంగాణ ఎంఎస్ఎంఈ విభాగం కన్వీనర్ ఏవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సీపీఎస్ఈ ఈటీఎఫ్ ఆరో ఇష్యూ

రూ.10000 కోట్ల సమీకరణ!

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) ఈటీఎఫ్ ఆరో విడత ఇష్యూ ఈ నెల 18న రాబోతుంది. ఈ ఇష్యూతో రూ.10,000 కోట్ల వరకు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. సీపీఎస్ఈ ఈటీఎఫ్‌లో 11 ప్రభుత్వ రంగ సంస్థలు - ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, ఐఓసీ, రూరల్ ఎలక్ట్రిఫికేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఆయిల్ ఇండియా, ఎన్‌బీసీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, ఎస్‌జేవీఎన్‌లు ఉన్నాయి. ఈ ఇష్యూతో కనీసం రూ.8,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒక వేళ్ల అధిక స్పందన లభిస్తే ఈ మొత్తాన్ని మరో రూ.2000 కోట్లకు పెంచేందుకు (గ్రీన్ షూ ఆప్షన్) కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రూ.6,423 కోట్లు ఆవిరి

దిల్లీ: ఇండిగో ప్రమోటర్లయిన రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్‌ల మధ్య పాలనాపరమైన వ్యవహారాల్లో తలెత్తిన విబేధాల నేపథ్యంలో, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జోక్యం చేసుకోవాలని కోరుతూ రాకేశ్ గంగ్వాల్ మంగళవారం లేఖ రాయడంతో ఆ ప్రభావం బుధవారం ట్రేడింగ్‌లో ఇండిగో షేరుపై పడింది. బీఎస్ఈలో షేరు 10.73 శాతం నష్టంతో రూ.1,397.75 వద్ద ముగిసింది. ఒక దశలో 17.54 శాతం నష్టపోయి, రూ.1,291 ఇంట్రాడే కనిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. ఎన్ఎస్ఈలో 11.12 శాతం నష్టంతో రూ.1,392 వద్ద స్థిరపడింది. ఒక దశలో 19.24 శాతం కోల్పోయి రూ.1,264.85 కనిష్ఠ స్థాయిని తాకింది.

ఇండిగో భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,422.6 కోట్లు ఆవిరైపోయింది. ట్రేడింగ్ ముగిసే సరికి బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.53,765.40 కోట్లకు పరిమితమైంది. ట్రేడింగ్ పరిమాణం చూస్తే, బీఎస్ఈలో 10 లక్షల షేర్లు చేతులు మారగా, ఎన్ఎస్ఈలో ఏకంగా కోటికి పైగా షేర్లు చేతులు మారడం గమనార్హం.

✦ ఇండిగో మాతృసంస్థ అయిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌లో గంగ్వాల్, అతని అనుబంధ సంస్థలకు 37 శాతం వాటా ఉంది. రాహుల్ భాటియా, అతని అనుబంధ సంస్థలకు (ఐజీఈ గ్రూపు) 38 శాతం వాటా ఉంది.

మళ్లీ నష్టాల్లోకి..

- భారత్ అధిక సుంకాలపై ట్రంప్ ప్రకటనతో..
- తోడైన వాహన విక్రయాల క్షీణత ప్రభావం

సూచీలు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలు విధిస్తూ వస్తోందని, మున్ముందు ఇది ఆమోదయోగ్యం కాదంటూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో మదుపర్లు నిరుత్సాహానికి గురయ్యారు. దీనికితోడు దేశీయ ప్రయాణికుల వాహన (పీవీ) విక్రయాలు వరుసగా ఎనిమిదో నెలా (జూన్) తగ్గుముఖం పట్టాయని సియామ్ విడుదల చేసిన గణాంకాలు కూడా విక్రయాలకు పురిగొల్పాయి. దీంతో సెన్సెక్స్ 174 పాయింట్లు, నిఫ్టీ 57 పాయింట్ల చొప్పున నష్టపోయాయి. అంతర్జాతీయ సూచీలకొస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి..

సెన్సెక్స్ ఉదయం 38,701.99 పాయింట్ల వద్ద ప్రతికూలంగా ప్రారంభమైంది. ప్రారంభ కొనుగోళ్ల మద్దతుతో కొద్దిసేపటికే 38,854.85 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. అయితే తర్వాత మళ్లీ అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ ఎక్కడా కోలుకోలేకపోయింది. ఒక దశలో 38,474.66 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 173.78 పాయింట్ల నష్టంతో 38,557.04 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 57 పాయింట్లు కోల్పోయి 11,498.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,593.70-11,475.65 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ టీసీఎస్ జూన్ త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోవడంలో విఫలమవడంతో షేరు 1 శాతానికి పైగా నష్టపోయింది. బీఎస్ఈలో 1.11 శాతం కోల్పోయి రూ.2,107.70 వద్ద ముగిసింది. ఒక దశలో 2.87 శాతం నష్టపోయి రూ.2,070.10 స్థాయిని కూడా తాకింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 4.91 శాతం కోల్పోయింది. టాటా స్టీల్ 2.94%, టాటా మోటార్స్ 2.79%, యాక్సిస్ బ్యాంక్ 2.25%, ఎల్అండ్‌టీ 1.80%, ఎంఅండ్ఎం 1.77%, హీరో మోటోకార్ప్ 1.68%, బజాజ్ ఆటో 1.54%, ఎస్‌బీఐ 1.38%, హెచ్‌యూఎల్ 1.24%, ఓఎన్‌జీసీ 1.17%, టీసీఎస్ 1.11%, ఎయిర్‌టెల్ 1.06% చొప్పున నష్టపోయాయి. యెస్ బ్యాంక్ అత్యధికంగా 1.81 శాతం లాభపడింది. సన్ ఫార్మా 1.44%, కోటక్ బ్యాంక్ 0.85% మేర లాభపడ్డాయి.

ఈసారి నిరాశాజనకమే!

- పదేళ్ల కనిష్ఠానికి అమ్మకాల వృద్ధి
- లోహ, ఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు కుదేల్
- బ్యాంకులు ఆకర్షణీయం

త్రైమాసిక ఫలితాల సీజను మొదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నిఫ్టీ-50 కంపెనీలు పదేళ్లలోనే అత్యల్ప అమ్మకాల వృద్ధిని నమోదు చేయొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బ్యాంకులు ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ.. లోహ, ఇంధన, వినియోగ ఆధారిత కంపెనీలు బలహీన ఫలితాలు నమోదు చేయొచ్చని అభిప్రాయపడుతున్నారు. 18 బ్రోకరేజీ సంస్థల సగటు అంచనాల ప్రకారం.. నిఫ్టీ సూచీలోని 48 కంపెనీల నికర విక్రయాలు స్వల్పంగా 3 శాతం పెరగొచ్చు. గత మూడేళ్లలో వాహన, ఎఫ్ఎమ్‌సీజీ, లోహ కంపెనీలు దన్నుగా నిలవడంతో రెండంకెల అమ్మకాల వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో మొండి బకాయిలపై అధిక కేటాయింపులతో బ్యాంకింగ్ రంగం కుదేలైంది. జనవరి- మార్చితో పోలిస్తే నిఫ్టీ 50 కంపెనీల అమ్మకాలు 3 శాతం వరకు పడొచ్చు. నికర లాభం గతేడాది పోలిస్తే 9 శాతం పెరగొచ్చని, అయితే త్రైమాసికంతో పోలిస్తే 10 శాతం తగ్గొచ్చని అంటున్నారు. బ్రోకరేజీ సంస్థల అంచనాలు..

✦ దేశీయంగా వినియోగం మందగించడం, అంతర్జాతీయ వృద్ధి, వాహన, లోహ, ఇంధన సంస్థల విక్రయాలు తగ్గడం ప్రతికూలంగా మారింది. కేటాయింపులు తగ్గడం, అధిక వడ్డీ ఆదాయంతో బ్యాంకులు మెరుగ్గా కనిపిస్తున్నాయి. ఫైనాన్స్, ఫార్మా, సిమెంట్ కంపెనీలు సానుకూలంగానే కనిపిస్తున్నాయి.

✦ బ్రిటానియా, హెచ్‌యూఎల్, ఐటీసీలు అమ్మకాలు, లాభంలో రెండంకెల వృద్ధి సాధించొచ్చు. ఈ మూడు కంపెనీల నికర విక్రయాలు 12 శాతం, లాభం 13 శాతం మేర పెరగొచ్చు.

✦ వాహన, లోహ, చమురు శుద్ధి కంపెనీల లాభాలు గణనీయంగా క్షీణించొచ్చు. రుణ లభ్యత తగ్గడంతో అన్ని విభాగాల్లో వాహన విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. వాహన సంస్థల నికర విక్రయాలు 11 శాతం, లాభం 30 శాతం మేర తగ్గొచ్చు.

✦ సబ్సిడీ భారం, ధరలు పెరగడంతో చమురు శుద్ధి సంస్థలు డీలాపడొచ్చు. అంతర్జాతీయ వృద్ధి, వాణిజ్య ఉద్రిక్తతలతో హిందాల్కో, టాటా స్టీల్ అమ్మకాలు 1 శాతం, నికర లాభం 32 శాతం తగ్గొచ్చు. పెట్రోకెమికల్స్, రిఫైనింగ్ వ్యాపారం బలహీనంగా ఉండటంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ నిరాశపరచొచ్చు.

✦ ఐటీ కంపెనీల లాభం గతేడాది పోలిస్తే 5 శాతం పెరగొచ్చు. గత త్రైమాసికంతో పోలిస్తే మాత్రం 7 శాతం తగ్గొచ్చు. నిర్వహణ మార్జిన్లు, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం ప్రభావం చూపనున్నాయి.

✦ తక్కువ బేస్ ఎఫెక్ట్‌తో ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ అంచనాలకు మించి రాణించే అవకాశం ఉంది. ఎన్‌బీఎఫ్‌సీల నగదు లభ్యత సమస్యలు ఉన్నప్పటికీ.. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీలు కళకళలాడొచ్చు.

✦ కొత్త ఉత్పత్తులు, జనరిక్ ఔషధ ధరల స్థిరత్వం వల్ల ఔషధ కంపెనీలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.

ఏప్రిల్- జూన్‌లో నిఫ్టీ కంపెనీల పనితీరు అంతంతే

కంపెనీ	విక్రయాలు (రూ.కోట్లలో)	లాభాలు (రూ.కోట్లలో)	విక్రయాలు (క్రితం ఏడాదితో పోలిస్తే మార్పు%లో)	లాభాలు (క్రితం ఏడాదితో పోలిస్తే మార్పు%లో)	ఫలితాల తేదీ
బజాజ్ ఆటో	7,633.6	1096.2	3	(2)	జులై 26
ఐషర్ మోటార్స్+	2,383.7	492.0	(6)	(15)	-----
హీరో మోటోకార్ప్	8,207.8	777.8	(7)	(14)	జులై 30
ఎం అండ్ ఎం	12,721.4	928.0	(6)	(24)	------
మారుతీ సుజుకీ	19,071.7	1330.3	(13)	(33)	జులై 26
టాటా మోటార్స్+	57,420.0	(1,912.6)	(13)	--	జులై 25
యాక్సిస్ బ్యాంక్★	5,948.1	1,947.3	15	178	జులై 30
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్★	13,311.0	5,653.9	23	23	జులై 20
ఐసీఐసీఐ బ్యాంక్★	7,527.9	1,763.3	23	---	జులై 27
కోటక్ బ్యాంక్★	3,144.3	1,481.1	22	45	జులై 22
ఎస్‌బీఐ★	23,123.9	3,481.2	6	--	---
ఇండస్‌ఇండ్ బ్యాంక్★	2,733.2	1,123.6	29	8	జులై 12
యెస్ బ్యాంక్★	2,511.3	(142.6)	13	---	జులై 17
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	5,155.5	465.2	8	(28)	----
అల్ట్రాటెక్ సిమెంట్	9,836.7	1,178.6	17	97	జులై 26
యూపీఎల్+	6,497.0	496.7	57	(3)	జులై 18
ఎల్ అండ్ టీ+	31,229.4	1,594.6	10	31	---
బజాజ్ ఫైనాన్స్★	3,346.3	1,196.4	30	43	జులై 25
హెచ్‌డీఎఫ్‌సీ★	3,115.6	3,206.6	12	46	ఆగస్టు 2
బ్రిటానియా ఇండస్ట్రీస్+	2,763.2	286.1	9	11	ఆగస్టు 9
హెచ్‌యూఎల్	10,292.9	1,733.7	10	13	జులై 23
ఐటీసీ	11,968.0	3,168.4	13	12	---
హెచ్‌సీఎల్ టెక్+	16,175.9	2,362.2	17	(3)	జులై 26
ఇన్ఫోసిస్+	21,882.8	3,680.4	14	2	జులై 12

కంపెనీ	విక్రయాలు (రూ.కోట్లలో)	లాభాలు (రూ.కోట్లలో)	విక్రయాలు (క్రితం ఏడాదితో పోలిస్తే మార్పు%లో)	లాభాలు (క్రితం ఏడాదితో పోలిస్తే మార్పు%లో)	ఫలితాల తేదీ
టెక్ మహీంద్రా	8,745.1	982.6	6	9	జులై 30
విప్రో+	14,839.9	2,331.2	6	10	జులై 17
టైటన్	5141.9	429.7	20	23	-----
జీ ఎంటర్‌టైన్‌మెంట్+	1,970.2	380.3	11	17	-----
హిందాల్కో	10810.7	148.0	2	(64)	--
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	19825.4	1101.6	(1)	(53)	జులై 26
టాటా స్టీల్	37,117.5	1457.7	(1)	(25)	---
వేదాంతా	21,242.0	1545.8	(4)	1	---
బీపీసీఎల్	75,326.2	1,279.1	5	(44)	----
గెయిల్	19,036.5	1,231.4	10	(2)	జులై26
ఐఓసీ	1,31,314.9	3096.1	1	(55)	జులై26
ఓఎన్‌జీసీ	26,933.9	5,510.8	(1)	(10)	జులై26
ఆర్ఐఎల్	97,290.5	8,574.1	7	(3)	-----
సిపా+	4,468.6	481.8	16	7	------
డాక్టర్ రెడ్డీస్+	4013.4	591.5	10	24	జులై 29
సన్‌ఫార్మా+	8058.0	1029.5	13	5	జులై 26
ఎన్‌టీపీసీ	23,696.9	2868.5	4	11	జులై 26
కోల్ ఇండియా+	24,362.2	4360.4	(29)	15	జులై 17
పవర్‌గ్రిడ్	9286.8	2570.8	14	15	జులై 17
భారతీ ఎయిర్‌టెల్+	20,964.9	(812)	4	---	జులై 26
భారతీ ఇన్‌ఫ్రాటెల్+	3569.3	594.2	110	(7)	జులై 17
ఏషియన్ పెయింట్స్+	4829.9	567.7	10	2	జులై 24
అదానీ పోర్ట్స్	2925.3	1217.0	21	76	జులై 17

+ ఏకీకృత ★ నికర వడ్డీ ఆదాయం

శాసించండి ఈ ప్రపంచాన్ని

అద్భుత అవకాశాల కృత్రిమ మేధ

డాక్టర్ బి. గోపాలకృష్ణ

మీరు మొబైల్ గేమ్ ఆడే ఉంటారు. అయితే ప్రతీ మొబైల్ గేమ్ తయారీకి కావాల్సిందేమిటో తెలుసా?

మీరు జరిపే బ్యాంకు లావాదేవీలు అంత పకడ్బందీగా ఎలా జరుగుతున్నాయో తెలుసా?

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. వందలకొద్దీ ప్రయోజనాలు కలుగుతున్నది కేవలం కృత్రిమ మేధ(ఏఐ)తోనే. అది అందించిన పలు అప్లికేషన్లతోనే.

వచ్చే అయిదేళ్లలో భారత్‌ను 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యంలో ఏఐ, 5జీ సాంకేతికతలు కీలక పాత్ర పోషించనున్నాయి.

ఇపుడు వర్తమాన సాంకేతికత ఉద్యోగాలకు గిరాకీ ఉంది. అయితే దురదృష్టవశాత్తూ అవన్నీ ఖాళీగా ఉంటున్నాయి. అందుకు తగ్గ నైపుణ్యాలున్న వారు లభించకపోవడమే ఇందుకు కారణం. బిగ్ డేటా, క్లౌడ్, కృత్రిమ మేధ(ఏఐ), డేటా సైన్స్ వంటి వాటిని ఎలా నేర్చుకోవాలో కూడా చాలామందికి తెలియడం లేదు. కంప్యూటర్లలో తెలివైన ప్రోగ్రాములను రూపొందించి తెలివైన యంత్రాలను/లేదా అప్లికేషన్లను తయారు చేసే శాస్త్ర విజ్ఞానమే కృత్రిమ మేధ. జ్ఞానాన్ని ఉపయోగిస్తూ అత్యంత క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాన్ని చూపే సామర్థ్యాన్ని ఏఐ కలిగిస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ అనేవి కంప్యూటర్ సైన్స్ రంగంలో ప్రతి చోటా కనిపిస్తుంటాయి. మొత్తం మీద ఏఐలో మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్ వంటి మూడు అంశాలుంటాయి. వీటి ద్వారా గొంతు, మాటను గుర్తించడం; ముఖాన్ని గుర్తించడం, వస్తువును గుర్తించడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం, వైవిధ్యంగా ఆలోచించడం వంటివన్నీ సులభ సాధ్యమవుతాయి.

ఏఐ మార్కెట్ విస్తృతి ఇదీ..

గత 20 ఏళ్లలో ఏఐపై పరిశోధన చాలా విస్తృతంగా జరిగింది. బిగ్ డేటా, రోబోటిక్స్, వైద్య పరిశోధన, స్వయం చోదిత వాహనాల వంటివన్నీ ఏఐలో భాగంగానే వచ్చాయి. ఇన్మైట్ నివేదిక ప్రకారం.. వాహన తయారీ, క్లౌడ్ సేవల్లో ఏఐ విలువ 2024 కల్లా 10.73 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు. మిలటరీలో ఏఐ మార్కెట్ విలువ 2025 కల్లా 18.82 బి. డాలర్లకు చేరుకుంటుందని అంచనా. సీఐఎస్ ఇండియా నివేదిక ప్రకారం.. 2025 కల్లా భారత ఆర్థిక వ్యవస్థకు 957 బి. డాలర్లను ఏఐ జత చేస్తుందంటే దాని ప్రాధాన్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. 2035 కల్లా భారత వార్షిక వృద్ధి రేటును 1.3 శాతం మేర పెంచగల సత్తా ఏఐకి కలుగుతుందని ఓ అంచనా.

ఏఐ.. ఇక్కడ నేర్చుకోవచ్చు

2019-20 విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ఈ ఏఐని తొమ్మిదో తరగతిలో ఒక ఐచ్ఛిక పాఠ్యాంశంగా చేయడం విశేషం. ఇక ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ పొవాయ్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబేలు ఇప్పటికే ఏఐలో కొత్త కోర్సులను ప్రారంభించాయి. ఐఐఎస్‌సీ రెండేళ్ల ఎంటెక్ ప్రోగామ్‌ను ఆగస్టు 2019 నుంచి మొదలుపెట్టనుంది. ఏఐ ఇంజినీర్లకు ఉన్న గిరాకీ నేపథ్యంలో ప్రతీ సంస్థా ఇపుడు ఏఐని అందిపుచ్చుకుంటోంది. విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, ఐబీఎమ్, మైక్రోసాఫ్ట్, యాక్సెంచర్, అమెజాన్, క్యాప్‌జెమిని, హెచ్‌సీఎల్ టెక్ వంటివి ఏఐ ఇంజినీర్లను నియమించుకుంటున్నాయి.

- ప్రభుత్వంతో ప్రజలు అనుసంధానం కావడానికి ఏఐని ఉపయోగించుకోవచ్చు. పౌర సేవలనూ పొందవచ్చు. చాబాట్స్ లేదా వర్చువల్ అసిస్టెంట్ల ద్వారా ప్రజల ప్రశ్నలకు ప్రభుత్వ సమాధానాన్ని ఇప్పించవచ్చు. లేదా ఆయా విజ్ఞప్తులను సంబంధిత అధికారులకు పంపవచ్చు.
- వాహన పరిశ్రమపై ఏఐ ప్రభావం భారీగానే ఉంది. ముఖ్యంగా స్వయం చోదిత వాహనాలను తయారు చేయడానికి ఏఐ చాలా కీలకం. ఆడి, కాడిలాక్, వోల్వో వంటి కంపెనీలు అధునాతన స్వయం చోదిత సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నాయి.
- రక్షణ రంగం విషయానికొస్తే ఆధునిక యుద్ధ తంత్రంలోనూ ఇది కీలకంగా వ్యవహరించే సత్తా ఉంది. స్వయం నియంత్రిత యుద్ధ వ్యవస్థలను రూపొందించడానికి ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. సైబర్ భద్రత, సైబర్ దాడులను అడ్డుకోవడానికి, కనిపెట్టడానికి సైతం ఇదే కావాలి. మిలటరీలో స్వయం చోదిత వాహనాలను వాడి సైనికుల ప్రమేయాన్ని తగ్గించవచ్చు.
- ఆరోగ్యసంరక్షణ రంగంలో దీని పాత్ర అంతకంతకూ పెరగనుంది. ఇప్పటికే కాన్సర్ గడ్డల(ట్యూమర్ల)ను కనిపెట్టడానికి, రోగాల విశ్లేషణకు, రోబో సహాయ సర్జరీలు చేయడానికి, వర్చువల్ నర్సింగ్ అసిస్టెంట్లను ఉపయోగించుకోవడానికి సైతం వీలు కలుగుతోంది. ప్రాథమిక రోగ నిర్ధరణ, ఆటోమేటెడ్ ఇమేజ్ డయాగ్నసిస్ వంటి వాటికీ ఇదే మందు. కేన్సర్‌ను కనిపెట్టడానికి ఒక జాతీయ రిపాజిటరీని ఏర్పాటు చేయడం కోసం ఏఐపై ఆధారపడాలని నీతి ఆయోగ్ యోచిస్తోంది కూడా.
- ఇ-కామర్స్ కంపెనీలు తమ వినియోగదారుల నిర్ణయాల విషయంలో; ఉత్పత్తులపై ఇచ్చే సలహాలను వడబోత చేయడానికి, వినియోగదార్లు ఇష్టపడే ఇతర వస్తువులను విశ్లేషించడానికి ఏఐని ఉపయోగిస్తున్నాయి.
- బ్యాంకింగ్, బీమా రంగంలో ఏఐ వల్ల ఆటోమేషన్ వచ్చేసింది. లావాదేవీ ప్రక్రియ సులభతరమైంది. చాబాట్‌లను ఉపయోగించుకోవడం వల్ల వినియోగదార్లకు మెషీన్ల ద్వారా సమాధానాలను ఇప్పిస్తున్నారు. వెల్త్‌మేనేజ్‌మెంట్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెర్, కార్డ్ మేనేజ్‌మెంట్‌లకూ ఇది ఉపయోగిస్తున్నారు. బీమా కంపెనీలైతే ఆటోమేటింగ్ క్లెయిము హ్యాండ్లింగ్‌లకు దీనినే వాడుతున్నారు.
- ప్రచురణ పరిశ్రమ కూడా ఏఐ ద్వారా రాతపూర్వక అంశాలను వీడియో కంటెంట్‌గా మార్చుకుంటున్నాయి.

ఇవీ ఉపయోగాలు

ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లు ఇతోధికంగా ఉపయోగపడుతున్నాయి. పలు భాషల్లో ఈ అప్లికేషన్లు లభ్యం అవుతున్నాయి.

- **చాబాట్:** ఏఐ అల్గారిథమ్స్‌ను అమలు చేసే సమయంలో వినియోగదార్ల వివరాలను ఇది ట్రాక్ చేస్తుంది. వినియోగదార్లు అడిగే ప్రశ్నలకు మెషీన్ లెర్నింగ్ ద్వారా సమాధానాలను ఇస్తుంది.
- **మొబైల్ గేమ్స్:** వీడియోగేమ్‌కు ఏఐనే పునాది. అది లేకుండా గేమ్స్ రూపకల్పన అసాధ్యం.
- **సిరి:** యాపిల్ ఫోన్లలో వినియోగదార్ల ప్రశ్నలను అర్థం చేసుకుని సమాధానమిస్తుంది అప్లికేషన్‌కు.
- **టెస్లా:** స్వయం చోదిత వాహనాలను రూపొందిస్తున్న ఈ కంపెనీ ఉపయోగిస్తున్న సాంకేతికత కృత్రిమ మేధే.

ఉద్యోగావకాశాలు

2020 కల్లా ఏఐ సాంకేతికత రంగంలో 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అంచనా. 2022 కల్లా మెషీన్ లెర్నింగ్ మార్కెట్ పరిమాణం 8.81 బిలియన్ డాలర్ల మేర వృద్ధి చెందుతుందని నిపుణులు అంటున్నారు. కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానాల నుంచి ప్రయోజనాలను అందిపుచ్చుకోవడం కోసం ఒక జాతీయ ఏఐ పోర్టల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రం ఇదివరకే ప్రకటించింది కూడా. ఈ పోర్టల్ ద్వారా ఏఐ, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్‌లలో మరిన్ని ఉద్యోగాలు వస్తాయి. డేటా ఆర్కిటెక్ట్, అప్లైడ్ సైంటిస్ట్, ఎమ్ఎల్ స్పీచ్ విజన్, అనలిస్ట్ బీఐ వంటి ఉద్యోగాలు వస్తాయని నాస్‌కామ్ అంటోంది.

ప్రభుత్వం, పరిశ్రమలకూ ఉపయోగమే

(రచయిత విప్రో టెక్నాలజీస్‌లో లీడ్ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్)

ఈనాడు బిజినెస్

ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యం రూ.13.35 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని ప్రభుత్వం రూ.13.35 లక్షల కోట్లుగా నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం కష్టమే అయినప్పటికీ.. సాధించవచ్చని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ ప్రమోద్ మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు ఇస్తున్న మినహాయింపులు, రాయితీలను దశలవారీగా ఎత్తివేసిన తర్వాతే ప్రభుత్వం కార్పొరేట్ పన్ను రేట్లను మరింత తగ్గించే యోచన చేయాలని అన్నారు. '2019-20 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం రూ.13.78 లక్షల కోట్ల లక్ష్యాన్ని పెట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది దాదాపు 24 శాతం అధికం కావడంతో లక్ష్యం చేరుకోవడం వాస్తవ దూరంగా మారింది. బడ్జెట్ చర్చల్లో ఇదే విషయాన్ని తెలియజేశాం. దీంతో తాజాగా ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని రూ.13.35 లక్షల కోట్లుగా చేశారు' అని ప్రమోద్ మోదీ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే తాజా లక్ష్యం దాదాపు 17.5 శాతం ఎక్కువ. గత మూడేళ్లలో వసూళ్ల వృద్ధికి ఇది అనుగుణంగానే ఉందని మోదీ అన్నారు. కొత్త లక్ష్యం విశ్వాసాన్ని నింపిందని, కష్టమైన లక్ష్యమే అయినప్పటికీ సాధించలేనిది కాదని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ముందుగా రూ.13.80 లక్షల కోట్ల లక్ష్యాన్ని విధించుకోగా.. ఐటీ శాఖ రూ.11.37 లక్షల కోట్ల వసూళ్లను సాధించగలిగింది.

రూ.లక్ష పైబడిన సేవింగ్స్ డిపాజిట్లపై ఎస్‌బీఐ వడ్డీ రేట్ల కోత

ముంబయి: సేవింగ్స్ ఖాతాలో రూ.లక్షకు పైబడిన నగదు నిల్వపై వడ్డీ రేటును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 3 శాతంగా చేసింది. సవరించిన రేట్లు జులై 1 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపింది. జూన్ 6న రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ రెపో రేటును 0.5 శాతం మేర కోత విధించింది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీ తగ్గించింది. మే 1 నుంచి ఆర్‌బీఐ రెపో రేటుకు అనుగుణంగా కొన్ని సేవింగ్స్ ఖాతాలపై ఇచ్చే రేట్లను ఎస్‌బీఐ అనుసంధానం చేసింది. రూ.లక్ష పైబడిన సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీని రెపో రేటు 5.75 శాతం పోలిస్తే 2.75 శాతం తక్కువగా నిర్ణయించినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. రూ.లక్ష లోపు సేవింగ్స్ నిల్వలపై ఇచ్చే వడ్డీ రేటును 3.50 శాతం వద్ద యథాతథంగా ఉంచింది. బుధవారం నుంచి అన్ని కాలవ్యవధుల రుణాలపై ఎంసీఎల్ఆర్‌ను 0.05 శాతం తగ్గించినట్లు బ్యాంక్ తెలిపింది.

కన్నాట్ ప్లేస్.. అద్దె ఎక్కువే

- ప్రపంచవ్యాప్త కార్యాలయ కిరాయిల్లో 9వ స్థానం
- సీబీఆర్ఈ నివేదిక

దిల్లీ: ప్రపంచంలో అతి ఖరీదైన కార్యాలయ ప్రాంతాల్లో కన్నాట్ ప్లేస్ మరోసారి చోటు దక్కించుకుంది. స్థిరాస్తి కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన జాబితాలో తాజాగా 9వ స్థానంలో నిలిచింది. ఇక్కడ చదరపు అడుగుకు ఏడాదికి చెల్లించాల్సిన అద్దె సగటున 144 డాలర్లు (దాదాపు రూ.10,080). దిల్లీలో రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతాల్లో ఒకటైన కన్నాట్ ప్లేస్ గతేడాది సైతం 9వ స్థానంలోనే ఉంది. 'గ్లోబల్ ప్రైమ్ ఆఫీస్ ఆక్యూపెన్సీ కాస్ట్స్' పేరిట విడుదల చేసిన నివేదికలో సీబీఆర్ఈ ఈ విషయాలను వెల్లడించింది. ఇక ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ 27, నారిమన్ పాయింట్ 40వ స్థానాలకు దిగజారాయి. 2018లో బాంద్రా కుర్లా కాంప్లెక్స్, నారిమన్ పాయింట్‌లు వరుసగా 26, 37వ స్థానాల్లో నిలిచాయి. బాంద్రా కుర్లాలో వార్షిక అద్దె చదరపు అడుగుకు 90.67 డాలర్లు, నారిమన్ పాయింట్‌లో 68.38 డాలర్లుగా ఉన్నాయి. ప్రపంచంలో 10 ఖరీదైన కార్యాలయ ప్రాంతాల్లో ఆరు ఆసియాలోనే ఉండటం గమనార్హం. 'వాణిజ్య ప్రాంతాల్లో పెట్టుబడులకు భారత ప్రాంతాల్లో ఇప్పటికే సానుకూలంగా ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి' అని సీబీఆర్ఈ ఛైర్మన్, సీఈఓ (భారత్, దక్షిణాసియా, మధ్య ప్రాచ్య, ఆఫ్రికా) అన్షుమన్ మ్యాగజీన్ తెలిపారు.

అగ్రస్థానం హాంకాంగ్‌దే: అతి ఖరీదైన కార్యాలయ ప్రాంతాల జాబితాలో హాంకాంగ్‌లోని సెంట్రల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం వరుసగా రెండో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడ చదరపు అడుగుకు ఏడాదికి చెల్లించాల్సిన సగటు అద్దె 322 డాలర్లు. లండన్‌లోని వెస్ట్ ఎండ్ 2వ స్థానంలో నిలిచింది. హాంకాంగ్ (కౌలూన్), న్యూయార్క్ (మిడ్‌టౌన్ మన్‌హట్టన్), బీజింగ్ (ఫైనాన్స్ స్ట్రీట్)లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఐఐటీ అంకురం ప్యూర్‌ఈవీలో వీసీ నన్నపనేని పెట్టుబడులు

ప్యూర్‌ఈవీ ఆవిష్కరించిన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు

ఈనాడు, సంగారెడ్డి: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ అంకుర సంస్థ 'ప్యూర్‌ఈవీ' అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుంది. బ్యాటరీల సాయంతో నడిచే నాలుగు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను ఇటీవలే ఇది అందుబాటులోకి తెచ్చింది. ఈ తరుణంలో ఫార్మా దిగ్గజం వీసీ నన్నపనేని ఈ అంకుర సంస్థలో పెట్టుబడులు పెట్టడం విశేషం. వెంచర్ క్యాపిటల్ విధానంలో వచ్చిన ఈ పెట్టుబడుల ద్వారా ప్యూర్‌ఈవీ సంస్థ విలువ రూ.240 కోట్లకు చేరింది. ఐఐటీ హైదరాబాద్‌లో సహ ఆచార్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నిశాంత్ దొంగరి 2016లో ఈ సంస్థను స్థాపించారు. ఐఐటీ ముంబయి పూర్వ విద్యార్థి రోహిత్ వదేరా సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2019-20లో 10వేల ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తేవాలనేది ఈ సంస్థ లక్ష్యం. రానున్న రోజుల్లో ప్రతి నెలా 2వేల వాహనాలను ఉత్పత్తి చేసేలా ఈ సంస్థ తాజాగా ప్రణాళికలు రూపొందించింది. 2019 అక్టోబరులోగా అధిక వేగంతో ప్రయాణించే మోటారు సైకిల్‌ను, ఒకసారి ఛార్జింగ్ చేస్తే అత్యధిక దూరం వెళ్లే స్కూటర్‌ను 2020 ప్రారంభంకల్లా మార్కెట్లోకి అందుబాటులో తెచ్చేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పెట్టుబడులు రావడంతో పరిశోధన, అభివృద్ధి అంశాలపై మరింతగా దృష్టి సారించడంతో పాటు వాహనాల తయారీ ప్లాంటునూ మరింత విస్తరించేందుకు వీరికి అవకాశం వచ్చింది. ఈ మేరకు ఐఐటీ వర్గాలు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశాయి.

ప్రముఖ సంస్థగా పేరొందాలి: ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా తాము చేస్తున్న కృషికి 'ప్యూర్‌ఈవీ' నిదర్శనంగా నిలుస్తుందని ఐఐటీ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ యు.బి.దేశాయ్ అన్నారు. లిథియం అయాన్ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో ఈ సంస్థ గొప్ప పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంకుర సంస్థ వ్యవస్థాపకుల దార్శనికత, సాధించాలనే తపనే ఇందులో తాను పెట్టుబడులు పెట్టేందుకు కారణమని వీసీ నన్నపనేని పేర్కొన్నారు. సమాజానికి మేలు జరిగేలా చూడటంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేసే యువ వ్యాపారవేత్తలకూ తమ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ పెట్టుబడులతో తాము తొలుత తయారీ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారిస్తామని ప్యూర్‌ఈవీ సీఈఓ రోహిత్ వదేరా వివరించారు. ఒక అంకుర సంస్థకు తొలి దశలోనే ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం గొప్ప విషయమని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నిశాంత్ దొంగరి హర్షం వ్యక్తం చేశారు.

ఇండిగో.. అంతా బానే ఉందా!?

కార్యకలాపాలు యథాతథం

- ప్రమోటర్ల మధ్య విభేదాలు సమసిపోతాయ్
- ఉద్యోగులకు సీఈఓ లేఖ

దేశీయ విమానయాన రంగంలో దాదాపు సగం వాటా కలిగిన ఇండిగో ప్రమోటర్ల మధ్య బహిర్గతమైన విభేదాలు విపణిలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. స్టాక్‌మార్కెట్‌లో ఇండిగో షేరు 11 శాతానికి పైగా నష్టపోయింది. పాతికేళ్లకు పైగా ప్రైవేటురంగంలో సేవలందించిన జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిలిచిపోయి 3 నెలలు కూడా కాకముందే, మార్కెట్ అగ్రగామి సంస్థలో ఏర్పడిన పరిస్థితిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. అయితే ప్రమోటర్ల విభేదాల వల్ల సంస్థకు, కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది లేదని వివరిస్తూ ఇండిగో ఉద్యోగులకు లేఖ రాసిన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వారికి భరోసా కల్పించారు.

ఏడాదిగా లుకలుకలున్నా..

'ఇండిగో ప్రమోటర్ల మధ్య ఏడాది కాలంగా లుకలుకలు నెలకొన్నాయని, అవి తీవ్ర విభేదాలుగా మారాయంటూ' ఈ ఏడాది మే నెలలో వార్తలొచ్చాయి. అప్పుడు కూడా షేరు 10 శాతానికి పైగా నష్టపోయింది. అయితే అధికారికంగా ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో, అవన్నీ ఊహాగానాలేనని, పరిస్థితి సజావుగా ఉందని ఇండిగో అప్పట్లో ప్రకటించింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌లో 38 శాతం వాటా కలిగిన సహ ప్రమోటర్ రాహుల్ భాటియా, ఆయన సంస్థల తీరువల్ల ఇండిగోలో తీవ్రమైన పాలనా (గవర్నెన్స్)లోపాలు తలెత్తాయని కిళ్లీ కొట్టు కన్నా పరిస్థితి అధ్వానంగా మారిందని, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జోక్యం చేసుకోవాలని కోరుతూ 37 శాతం వాటా కలిగిన రాకేశ్ గంగ్వాల్ మంగళవారం లేఖ రాయడంతో, వ్యవహారం తేటతెల్లమైంది. 'పాలనలో ఉన్నత ప్రమాణాలకు కట్టుబడి ఉండటం వల్లే సంస్థ ప్రస్తుత స్థాయికి చేరింది. ఇప్పుడా ప్రధాన సూత్రాలు, విలువలు పక్కదోవ పడుతున్నాయి' అని గంగ్వాల్ ఆరోపించారు. 'సహ వ్యవస్థాపకుడైన రాహుల్ భాటియా, ఆయన సంస్థలు పాలుపంచుకున్న కొన్ని లావాదేవీలు ప్రశ్నించదగినవిగా ఉన్నాయని, చట్టాలను వారు ఉల్లంఘిస్తున్నారని' సెబీకి రాసిన లేఖలో గంగ్వాల్ ఆరోపించారు. 'వాటాదార్ల ఒప్పందం వల్ల, ఇండిగోపై రాహుల్‌కు దీర్ఘకాల నియంత్రణ ఏర్పడింది. రాహుల్ సంబంధీకుల చర్యల వల్ల అవాంఛిత పరిణామాలు తలెత్తవచ్చు. సమర్థ నివారణ చర్యలు తీసుకోవాలి' అని కోరారు. ఇదే లేఖను ప్రధాని, ఆర్థిక, పౌరవిమానయాన, వాణిజ్య శాఖల మంత్రులకూ పంపారు. దీనిపై సెబీ స్పందించి ఈ నెల 19లోగా వివరణ ఇవ్వాలని ఇండిగోను కోరింది.

విభేదాలు ఈ అంశాల్లో..

- ఇంటర్‌గ్లోబ్ బోర్డులోని ఆరుగురు డైరెక్టర్లలో ముగ్గురిని నియమించే హక్కు రాహుల్ భాటియాకు చెందిన ఐజీఈ గ్రూప్‌నకు ఉంది.
- ఛైర్మన్, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), ప్రెసిడెంట్‌లను నామినేట్ చేసే, నియమించే హక్కూ ఏర్పడింది.
- డైరెక్టర్ల నియామకానికి ఈ గ్రూప్‌తో కలిసి ఓటు వేయాల్సిన స్థితి గంగ్వాల్, అనుచరులకు ఉంది.
- 'ప్రస్తుత ఛైర్మన్, ఆయన నిర్ణయాధికారాన్ని, స్వతంత్రతను మేము ప్రశ్నించడం లేదు. అయితే అటువంటి పదవి హోదాను 'స్వతంత్ర' ఛైర్మన్‌గా ప్రకటించడాన్నే తప్పుబడుతున్నాం. ఇండిగోలో 'స్వతంత్ర ఛైర్మన్'ను నియమించే ప్రక్రియకు అర్థమే లేదు. అనుకున్న వ్యక్తులనే నియమిస్తున్నారు మినహా, ఎంపికకు వీలు లేదు. సెబీ నిబంధనలను తప్పించుకునేలా వ్యవహరిస్తున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలను వ్యాపార, నిర్వహణ విధానాల్లో అనుసరించినపుడే, ఇండిగో పూర్తి స్థాయి సామర్థ్యంతో పనిచేస్తుందని నమ్ముతున్నాం' అని గంగ్వాల్ పేర్కొన్నారు.
- ఆడిట్ కమిటీ ఆమోదం లేకుండా, మూడో పార్టీ నుంచి బిడ్లు ఆహ్వానించకుండానే ఐజీఈ గ్రూప్ సంబంధీకులతో లావాదేవీలు నిర్వహించారన్నది మరో ఆరోపణ.
- స్వతంత్ర మహిళా డైరెక్టర్ నియామకం జరపలేదు.
- ఇంటర్‌గ్లోబ్ వాటాదార్ల అసాధారణ సమావేశం నిర్వహించాలని కోరుతూ బోర్డుకు గంగ్వాల్ గతంలోనే నోటీస్ ఇవ్వగా, జూన్ 12న భాటియా వ్యతిరేకించారు. అంతర్గత అజెండాతో గంగ్వాల్ చేసిన సహేతుకం కాని డిమాండ్లను ఐజీఈ గ్రూప్ ఒప్పుకోవడం లేదని తెలిపారు.

కార్యకలాపాలపైనే దృష్టి సారించండి: సీఈఓ

ఈ నేపథ్యంలోనే ఇండిగో సీఈఓ రంజోయ్ దత్తా ఉద్యోగులకు లేఖ రాశారు. 'ప్రమోటర్ల మధ్య విభేదాల వల్ల ఇండిగో, సంస్థ కార్యకలాపాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. త్వరలోనే అవి సమసిపోతాయి. ఇండిగో కార్యాచరణ, దిశ, వృద్ధి వ్యూహాల్లో మార్పేమీ లేదు. అధిక సామర్థ్యంతో కార్యకలాపాలు నిర్వహించడంపైనే మనం దృష్టి కొనసాగించడం ప్రధానం. అందువల్ల మీ విధులపై యథావిధిగా దృష్టి సారించండి. మనకు సంబంధించి ఎటువంటి మార్పు లేదని మరోసారి స్పష్టం చేస్తున్నా. నా విధుల నిర్వహణలో సామర్థ్యాలను సాధ్యమైనంతగా వినియోగిస్తున్నా. మీరు కూడా అదే విధంగా చేస్తున్నారని ఆశిస్తున్నా. నియమిత సమయంలో, మర్యాద పూర్వక సేవలను అవాంతరాలు లేకుండా అందించడంలో మీరు చూపుతున్న అంకితభావానికి కృతజ్ఞతలు' అని సీఈఓ పేర్కొన్నారు.

2019 మేలో దేశీయ విమానయాన విపణి

సంస్థ	మార్కెట్‌వాటా (%)
ఇండిగో	49
స్పైస్‌జెట్	14.8
ఎయిరిండియా	13.5
గో ఎయిర్	11.1
ఎయిరేషియా	6.3
విస్తారా	4.7
ట్రూజెట్	0.5

ఈ ఏడాదిలో ఇండిగో మార్కెట్ వాటా

జనవరి	42.5
ఫిబ్రవరి	43.4
మార్చి	46.9
ఏప్రిల్	49.9
మే	49.0

ఇంటర్‌గ్లోబ్ బోర్డు ఇలా

భాటియా

గంగ్వాల్

ఛైర్మన్‌గా ఎం.దామోదరన్ (సెబీ మాజీ చీఫ్) వ్యవహరిస్తున్నారు. గంగ్వాల్‌తో పాటు భాటియా ఆయన సతీమణి రోహిణి భాటియా, ప్రపంచబ్యాంక్ మాజీ ఎగ్జిక్యూటివ్ అనుపమ్ ఖన్నా, చార్టర్డ్ అకౌంటెంట్ అనిల్ పరాశర్ ఇతర డైరెక్టర్లుగా ఉన్నారు.

కొరికిన ఆశలు

ఈ వేదికలో టాస్ అత్యంత కీలకమన్నారు.. కోహ్లి టాస్ ఇప్పుడే ఓడాలా..?

గత మూడు వారాల్లో ప్రపంచకప్‌కు వర్షం బెడదే లేదు.. వరుణుడు మళ్లీ ఇప్పుడే రావాలా..?

లీగ్ దశ ఆద్యంతం టాప్ ఆర్డర్ అదరగొట్టింది.. ఆ ముగ్గురూ ఇప్పుడే చేతులెత్తేయాలా..?

అప్పటిదాకా జడేజా ఆడిన ప్రతి షాట్ అద్భుతమే.. ఆ షాట్ ఒక్కటి తేడా కొట్టాలా..?

వికెట్ల మధ్య పరుగులో ధోనీకి తిరుగు లేదు.. అతను ఈ మ్యాచ్‌లోనే రనౌటవ్వాలా..?

నాకౌట్ ముందు వరకు న్యూజిలాండ్ ప్రదర్శన అంతంత మాత్రం.. ఆ జట్టు ఈ మ్యాచ్‌లోనే ఇంత పట్టుదలతో ఆడాలా..?

ఏదో శాపం తగిలినట్లు.. ప్రకృతి కూడా మనోళ్లపై పగబట్టినట్లు.. భారత్ ఓడి తీరాల్సిందే అన్నట్లు.. అన్నీ ప్రతికూలమే అయ్యాయి. ఆశల్ని కూల్చేశాయి. మన కప్పు కలను చిదిమేశాయి.

లీగ్ దశలో ఎంత గొప్పగా ఆడితేనేమి.. పట్టికలో అగ్రస్థానంలో సాధిస్తేనేమి.. నాకౌట్‌కు వచ్చేసరికి అంచనాలన్నీ తిరగబడ్డాయి. తేలికైన ప్రత్యర్థి అనుకున్న న్యూజిలాండే ప్రపంచకప్‌లో మన కథను ముగించింది.

చిత్తు చిత్తు కావాల్సిన గౌరవప్రదంగా ఓడామన్న సంతృప్తి కొంత ఉన్నా.. విజయానికి ఎంతో చేరువగా వచ్చి మ్యాచ్‌ను కోల్పోవడం, అత్యంత బాధాకర రీతిలో టీమ్‌ఇండియా ప్రపంచకప్ నుంచి నిష్క్రమించడం.. వేదనను మరింత పెంచేదే!

- ప్రపంచకప్‌లో భారత్ కథ సమాప్తం
- సెమీస్‌లో కివీస్ చేతిలో అనూహ్య ఓటమి
- జడేజా, ధోనిల అద్భుత పోరాటం వృథా
- రెండోసారి ఫైనల్‌కు న్యూజిలాండ్

మాంచెస్టర్

లీగ్ దశ ఆద్యంతం అద్భుత ప్రదర్శన చేసి.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానం సాధించి.. కప్పుపై ఎన్నో ఆశలు రేకెత్తించిన కోహ్లీసేన.. అభిమానులకు తీరని వేదన మిగులుస్తూ మరోసారి సెమీస్‌లోనే నిష్క్రమించింది. నాలుగేళ్ల కిందట ఆస్ట్రేలియా భారత్ ఆశలకు గండి కొడితే.. ఈసారి న్యూజిలాండ్ షాకిచ్చింది. వర్షం కారణంగా రెండో రోజుకు వాయిదా పడ్డ సెమీఫైనల్లో టీమ్‌ఇండియా 18 పరుగుల తేడాతో ఓడింది. 240 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియా.. 49.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 5 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఘోర పరాభవం దిశగా సాగిన భారత్‌కు జడేజా (77; 59 బంతుల్లో 4×4, 4×6), ధోని (50; 72 బంతుల్లో 1×4, 1×6)ల అద్భుత పోరాటం ఆశలు కల్పించింది. కానీ చివర్లో తీవ్ర ఒత్తిడిలో పోరాటం సాగిస్తూ వీళ్లిద్దరూ ఔటైపోవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాట్ హెన్రీ (3/37), ట్రెంట్ బౌల్ట్ (2/42), శాంట్నర్ (2/34) భారత్‌ను దెబ్బ తీశారు. మంగళవారం న్యూజిలాండ్ 46.1 ఓవర్లలో 211/6తో ఉండగా వర్షం వల్ల ఆట నిలిచిపోయిన సంగతి తెలిసిందే. బుధవారం అదే స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన కివీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 239 పరుగులు చేసింది. 2015లో తొలిసారి ప్రపంచకప్ ఫైనల్ చేరిన న్యూజిలాండ్.. వరుసగా రెండోసారి తుది పోరుకు అర్హత సాధించడం విశేషం.

ఆరంభం.. ఘోరాతి ఘోరం: 5 సెంచరీల రోహిత్.. నిలకడగా రాణిస్తున్న రాహుల్.. 'కింగ్' కోహ్లి.. 240 పరుగుల లక్ష్యం వీరిని దాటి వెళ్లదేమో అన్న అంచనా అభిమానులది. కానీ వర్షం వల్ల బౌలర్లకు మరింత అనుకూలంగా మారిన పిచ్‌పై నిప్పులు చెరిగే బంతులతో విజృంభించిన కివీస్ బౌలర్లు అంచనాలన్నీ తలకిందులు చేశారు. భారత బ్యాటింగ్ చూద్దామని అభిమానులు సర్దుకునే లోపే మూడు వికెట్లు పడిపోయాయి. రెండో ఓవర్లో హెన్రీ.. ఆఫ్ స్టంప్ పైకి సంధించిన చక్కటి బంతిని వెంటాడి రోహిత్ వికెట్‌కీపర్‌కు దొరికిపోయాడు. తర్వాతి ఓవర్లో ఇంకో పెద్ద షాక్. బౌల్ట్ బంతిని తప్పుగా అంచనా కోహ్లి వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ వేలెత్తాడు. కోహ్లి సమీక్ష కోరాడు. రీప్లేలో బంతి స్టంప్ పైన తాకేదని తేలింది. నిర్ణయం 'అంపైర్ కాల్'గా వచ్చింది. అంపైర్ ఔటివ్వకపోయి, కివీస్ సమీక్షకు వెళ్తే నాటౌట్ అయ్యేవాడు. ఇంకో మూడో బంతులు పడ్డాయో లేదో.. రాహుల్ కూడా చెత్త షాట్ ఆడి, పెవిలియన్ చేరిపోయాడు. అతడినీ హెన్రీనే ఔట్ చేశాడు. స్కోరు 3/5. పదో ఓవర్లో నీషమ్ పట్టిన అద్భుత క్యాచ్‌కు కార్తీక్ (6) కూడా వెనుదిరిగాడు. ఈ దశలో పంత్ (32), పాండ్య (32) పోరాడటంతో పరిస్థితి కొంచెం మెరుగుపడింది. 20 ఓవర్లకు స్కోరు 70కి చేరుకుంది. అయితే స్కోరు వేగం పెంచడం కోసం వీళ్లిద్దరూ స్పిన్నర్ శాంట్నర్ లక్ష్యంగా షాట్లు ఆడి ఒకరి తర్వాత ఒకరు క్యాచ్‌లు లేపి, పెవిలియన్ చేరిపోయారు. స్కోరు 92/6.

అద్భుతం వాళ్ల పోరాటం: 117 బంతులున్నాయి.. 148 పరుగులు చేయాలి.. చేతిలో ఉన్న వికెట్లు నాలుగే. క్రీజులో ఉన్న ధోని, జడేజా మినహా బ్యాట్స్‌మెన్ ఎవరూ మిగిలి లేరు. ఈ స్థితిలో అసాధారణ పోరాటంతో ఈ జోడీ అడుగంటిన ఆశలు మళ్లీ చిగురించేలా చేసింది. ముఖ్యంగా జడేజా.. కివీస్ బౌలింగ్ గొప్పగా సాగుతున్నా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా, ఒత్తిడి అంతకంతకూ పెరిగిపోతున్నా గొప్ప నిబ్బరంతో ఆడాడు. టాప్ బ్యాట్స్‌మెన్ తరహాలో ఎంతో కచ్చితత్వంతో షాట్లు కొట్టాడు. అతను బాదిన నాలుగు సిక్సర్లూ అద్భుతమే. ధోని షాట్లు ఆడకపోయి ఉండొచ్చు కానీ.. అతను జడేజాకు అందించిన అండ గొప్పది. అవతల ధోని ఉన్నాడన్న ధీమాతోనే జడ్డూ షాట్లు ఆడగలిగాడు. ఎప్పుడు వికెట్ పడితే అప్పుడు మ్యాచ్ ముగిసిపోయే స్థితిలో ధోని గొప్ప సంయమనం ప్రదర్శించాడు. స్ట్రైక్ రొటేట్ చేస్తూ.. జడేజాకు గొప్పగా సహకరించాడు. ఇద్దరూ చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేయడంతో నెమ్మదిగా లక్ష్యం కరుగుతూ వచ్చింది. 6 ఓవర్లలో 62 పరుగులు చేయాల్సిన స్థితిలో వరుసగా 2 ఓవర్లలో పదేసి పరుగులు రావడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గుతున్నట్లే కనిపించింది. ఐతే 47వ ఓవర్లో హెన్రీ 5 పరుగులే ఇచ్చి ఒత్తిడి పెంచాడు. బౌల్ట్ వేసిన తర్వాతి ఓవర్లో తొలి నాలుగు బంతుల్లో బౌండరీ రాలేదు. దీంతో జడేజా షాట్ ఆడక తప్పని పరిస్థితి నెలకొంది. ప్రయత్నించాడు. లాంగాఫ్‌లో విలియమ్సన్‌కు దొరికిపోయాడు. ఇక ఆశలన్నీ ధోని మీదే. చివరి 2 ఓవర్లలో 31 పరుగులు చేయాలి. 49వ ఓవర్ (ఫెర్గూసన్) తొలి బంతికి షార్ట్ బంతిని కళ్లు చెదిరే రీతిలో పాయింట్ వైపు సిక్సర్‌గా మలచడంతో అభిమానుల్లో ఉత్సాహం వచ్చింది. కానీ మూడో బంతికి మహి రనౌటవడంతో భారత్ పోరాటానికి తెరపడింది.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: 239/8

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) లేథమ్ (బి) హెన్రీ 1; రోహిత్ (సి) లేథమ్ (బి) హెన్రీ 1; కోహ్లి ఎల్బీ (బి) బౌల్ట్ 1; పంత్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) శాంట్నర్ 32; కార్తీక్ (సి) నీషమ్ (బి) హెన్రీ 6; పాండ్య (సి) విలియమ్సన్ (బి) శాంట్నర్ 32; ధోని రనౌట్ 50; జడేజా (సి) విలియమ్సన్ (బి) బౌల్ట్ 77; భువనేశ్వర్ (బి) ఫెర్గూసన్ 0; చాహల్ (సి) లేథమ్ (బి) నీషమ్ 5; బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 16

మొత్తం: (49.3 ఓవర్లలో ఆలౌట్) **221;** **వికెట్ల పతనం:** 1-4, 2-5, 3-5, 4-24, 5-71, 6-92, 7-208, 8-216, 9-217; **బౌలింగ్:** బౌల్ట్ 10-2-42-2; హెన్రీ 10-1-37-3; ఫెర్గూసన్ 10-0-43-1; గ్రాండ్‌హోమ్ 2-0-13-0; నీషమ్ 7.3-0-49-1; శాంట్నర్ 10-2-34-2

గుండెకోత మిగిల్చిన ఒక రనౌట్

2 ఓవర్లలో 31 పరుగులు చేయాల్సిన స్థితిలో.. అవతల బ్యాట్స్‌మన్ లేకపోవడంతో పూర్తిగా తనే స్ట్రైక్ తీసుకుని ఆడాలన్నది ధోని వ్యూహం. తొలి బంతికి సిక్సర్ బాదిన అతను.. రెండో బంతికి పరుగు తీయలేకపోయాడు. ఫెర్గూసన్ మూడో బంతికి వేగం తగ్గించి బౌన్సర్ వేశాడు. దాన్ని స్క్వేర్ లెగ్ వైపు ఆడాడు ధోని. ఒక పరుగు తీసి ఆగితే స్ట్రైకింగ్ పోతుందని రెండో పరుగుకు లంఘించాడు. షార్ట్ ఫైన్ లెగ్ నుంచి వెళ్లి బంతిని అందుకున్న గప్తిల్ స్టంప్స్‌కు నేరుగా త్రో వేశాడు. రీప్లే చూస్తే కొన్ని మిల్లీ మీటర్ల తేడాలో క్రీజుకు ధోని దూరమైనట్లు తేలింది. అంతే.. ఆశలు కూలిపోయాయి. గప్తిల్ డైరెక్ట్ త్రో వేయకున్నా.. ధోని డైవ్ చేసినా నాటౌట్‌గా మిగిలేవాడేనేమో. బ్యాట్స్‌మన్‌గా టోర్నీలో ఘోరంగా విఫలమైన గప్తిల్.. ఈ రనౌట్‌తో న్యూజిలాండ్ హీరో అయిపోయాడు. భారత అభిమానులకు గుండె కోత మిగిల్చిన ఈ రనౌట్.. మ్యాచ్‌లోనే కాదు, ఈ ప్రపంచకప్‌లోనే అతి పెద్ద మలుపుగా చెప్పొచ్చు. తన తొలి వన్డేలో రనౌటే అయిన ధోని.. బహుశా తన అంతర్జాతీయ కెరీర్లో చివరి దిగా భావిస్తున్న మ్యాచ్‌లోనూ రనౌటే కావడం చిత్రం!

ఇదే చివరిదా?

ప్రపంచకప్‌తోనే ధోని అంతర్జాతీయ కెరీర్ ముగుస్తుందన్నది అంచనా! 38 ఏళ్ల ధోని.. ఈ టోర్నీ కోసమే ఇంకా జట్టులో ఉన్నాడు! మరో కప్పు గెలిపించి మహి ఘనంగా వీడ్కోలు తీసుకోవాలని ఆశించారు అభిమానులు. కానీ సెమీస్‌తో భారత్ కథ ముగిసింది. ధోని ఇంకా ఏమీ చెప్పలేదు కానీ.. రిటైర్మెంట్ ప్రకటించడం లాంఛనమే కావచ్చు. కాబట్టి ఇదే అతడి చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావచ్చు. మ్యాచ్ అనంతరం ధోని రిటైర్మెంట్ గురించి కోహ్లిని విలేకరులు అడిగితే.. తమకు అతనేమీ చెప్పలేదని అన్నాడు.

ఒక్కరు నిలిచినా..!

కేన్ విలియమ్సన్.. రాస్ టేలర్ మంగళవారం క్రీజులో ఉన్నా 80 బంతుల పాటు ఒక్క బౌండరీ సాధించకపోవడంతో బ్యాట్స్‌మెన్ అతి ఆత్మరక్షణ ధోరణితో బ్యాటింగ్ చేశారని అంతా భావించారు! బుధవారం భారత జట్టు బ్యాటింగ్ చూశాక ఎవరికీ నోట మాట రాలేదు. 4/1.. 5/2.. 5/3.. స్కోరుబోర్డుపై ఎవరూ ఊహించని అంకెలు కనిపించాయి. అప్పటి వరకు భారత బౌలర్ల అద్భుత ప్రదర్శనను కీర్తించిన వాళ్లంతా పిచ్‌వైపు దృష్టిసారించారు. 240 పరుగుల లక్ష్య ఛేదనపై అనుమానాలు పెరిగి.. ఆశలు కూలడానికి ఎంతోసేపు పట్టలేదు! పిచ్‌ను అంచనా వేయడంలో విలియమ్సన్ విజయం సాధించగా.. ఒకింత టీమ్ ఇండియా విఫలమైందనే చెప్పాలి! ప్రపంచకప్‌లో మాంచెస్టర్‌లో జరిగిన 5 మ్యాచ్‌లకు ఐదింట్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన జట్లే గెలిచిన నేపథ్యంలో.. సెమీస్‌లో టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగే ఎంచుకోవాలని అంతా సూచించారు. చివరికి అదే జరిగింది. తేమ పరిస్థితుల్లో, మందకొడి పిచ్‌పై ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలింగ్‌ను ఎదుర్కోవడం అంత సులభం కాదన్న సంగతి విలియమ్సన్‌కు తెలియకుండా ఉండదు. ఇలాంటి పరిస్థితులు.. పిచ్‌పై లక్ష్య ఛేదన ఇంకా కష్టమని విలియమ్సన్ నిర్దిష్టమైన అంచనాకు వచ్చిన తర్వాతే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఆరంభ ఓవర్లలో భారత పేసర్ల విజృంభణ కివీస్ నిర్ణయంపై అనుమానాలు రేకెత్తి ఉండొచ్చు. కానీ మాంచెస్టర్ పిచ్‌పై 240 పరుగులు చేస్తే విజయం సాధ్యమని మొదటి బంతి కంటే ముందే మాట్లాడుకున్నట్లు విలియమ్సన్ చెప్పడం గమనార్హం.

> ప్రపంచకప్ ఆసాంతం భారత ఓపెనర్లు ఆరంభంలో అత్యంత జాగ్రత్తగా ఆడారు. అదే వ్యూహాన్ని సెమీస్‌లో పాటించినా.. టాప్ ఆర్డర్‌లో ఒక్కరు క్రీజులో నిలిచినా ఫలితం మరోలా ఉండేదేమో!

సెమీఫైనల్లో భారత్‌ను ముంచింది టాప్ ఆర్డరే. వరుసగా 1, 2, 3 స్థానాల్లోని బ్యాట్స్‌మెన్ ఒక్కో పరుగు చేసి పెవిలియన్ చేరడం వన్డే క్రికెట్ చరిత్రలోనే ప్రప్రథమం. ప్రపంచకప్ పవర్ ప్లే (1-10 ఓవర్లు)లో కివీస్ 27/1తో అత్యల్ప స్కోరు నమోదు చేయగా.. ఒక్కరోజులోనే 24/4తో ఆ రికార్డును భారత్ తిరగరాసింది. వాతావరణ పరిస్థితులు, పిచ్ భారత్‌ను దారుణంగా దెబ్బతీశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అడపాదడపా కురిసిన వర్షానికి ఔట్‌ఫీల్డ్ మందకొడిగా మారింది. పిచ్ పరిసరాలు తడిగా మారాయి. ఈ పరిస్థితుల్ని కివీస్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంది. టాప్ ఆర్డరే టీమ్‌ఇండియా బలమని గుర్తించిన కివీస్.. పక్కా వ్యూహంతో రోహిత్, కోహ్లి, రాహుల్‌లను ఔట్ చేసింది. ఈ ప్రపంచకప్ ఆరంభం నుంచి అనుసరించిన వ్యూహాన్ని భారత జట్టు సెమీస్‌లో అమలు పరచకపోవడమే విషాదం. ప్రపంచకప్ ఆసాంతం భారత ఓపెనర్లు ఆరంభంలో అత్యంత జాగ్రత్తగా ఆడారు. అదే వ్యూహాన్ని సెమీస్‌లో పాటించినా.. టాప్ ఆర్డర్‌లో ఒక్కరు నిలిచినా ఫలితం మరోలా ఉండేదేమో!

మెరుగ్గా బ్యాటింగ్ చేసిన పంత్, పాండ్య భారీషాట్లకు ప్రయత్నించి ఔటయ్యారు. వాళ్లు ఔటైన తీరుపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ కోహ్లి అన్నట్లు కొన్ని షాట్లు.. కొన్ని నిర్ణయాలు ఆటగాళ్లకు అప్పుడు సరైనవి అనిపిస్తాయి. భారత్ ఆశలు కోల్పోయిన స్థితిలో రవీంద్ర జడేజా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. జడేజా అలా ఆడడానికి మరో ఎండ్‌లో ఉన్న ధోని కూడా కారణం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఫినిషర్‌గా పేరున్న ధోనీకి ఆఖరి ఓవర్లలో పరుగులు ఎలా రాబట్టాలో తెలియనిది కాదు. చెన్నై సూపర్ కింగ్స్ తరపున వందల మ్యాచ్‌లు కలిసి ఆడిన అతడు పూర్తి అవగాహనతోనే... జడేజా హిట్టింగ్ చేస్తుంటే సహాయ పాత్ర పోషించాడు. చివరి వరకు క్రీజులో ఉంటే టీమ్‌ఇండియా గెలుపు ఖాయమని ధోని, జడేజాతో పాటు ప్రతి అభిమాని భావించాడు. కానీ ఊహించనిది జరడగమే ఆట వైచిత్రి.

– ఫోర్త్ అంపైర్

రైళ్లలో అదనంగా 4 లక్షల బెర్తులు

● అక్టోబరు నుంచి రోజూ అందుబాటులోకి

దిల్లీ: రైలు ప్రయాణికులకు శుభవార్త. వచ్చే అక్టోబరు నుంచి రైళ్లలో ప్రతి రోజు అదనంగా 4 లక్షలకు పైగా బెర్తులు అందుబాటులోకి రానున్నాయి. రైల్వేలు అందిపుచ్చుకోనున్న ఆధునిక సాంకేతికత ద్వారా ఇంధన ఖర్చులను ఆదా చేయటంతో పాటు ప్రయాణికులకు సౌలభ్యాన్ని సమకూర్చుకోవచ్చని సీనియర్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం చాలా రైళ్లలో స్లీపర్ కోచ్‌లలో లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు పనిచేయటానికి అవసరమైన విద్యుత్తును ఉత్పత్తి చేయటానికి డీజిల్‌తో పనిచేసే పవర్ కార్లను ఉపయోగిస్తున్నారు. ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకు కనీసంగా రెండు పవర్ కార్లు ఉంటాయి. హెడ్ ఆన్ జనరేషన్ (హెచ్‌ఓజీ) అనే నూతన సాంకేతికతను సమకూర్చుకోవటం వల్ల రైలు ఇంజిన్లు నడవటానికి మాత్రమే హైటెన్షన్ లైన్ల నుంచి తీసుకుంటున్న విద్యుత్తును బోగీల అవసరాలకూ మలచుకోవచ్చు. ఈ సాంకేతికత ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉంది. రైలు పట్టాల వెంట ఉండే హైటెన్షన్ విద్యుత్తు లైన్ల నుంచి విద్యుత్తును పొందటానికి పాన్‌టోగ్రాఫ్ అనే పరికరం ఉపయోగపడుతుంది. ఇంజిన్లు నడపటానికి మాత్రమే దీనిని ఉపయోగిస్తున్నారు.

5వేల బోగీలకు కొత్త సాంకేతికత

బోగీలకు అవసరమైన విద్యుత్తునూ హైటెన్షన్ లైన్ల నుంచే ఇంజిన్ల ద్వారా తీసుకోవటం వల్ల డీజిల్ జనరేటర్లు ఉండే పవర్ కార్లపై ఆధారపడనవసరం లేదు. పవర్ కార్లను తొలగించి వాటి స్థానంలో అదనంగా బోగీలను అమర్చుకోవటం ద్వారా దేశవ్యాప్తంగా 4లక్షలకు పైగా బెర్తులు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. అక్టోబరు నాటికి 5000 బోగీలను కొత్త సాంకేతికత ఆధారంగా నడిచేలా మార్పులు చేయనున్నట్లు తెలిపారు. తొలగించిన పవర్ కార్ స్థానంలో ప్రయాణికుల బోగీని అమర్చటం ద్వారా రైలు పొడవు పెంచనవసరంలేకుండానే అదనంగా బెర్తులు అందుబాటులోకి వస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

రూ.6 వేల కోట్ల ఆదా

డీజిల్‌తో నడిచే పవర్ కార్లను తొలగించటం వల్ల రైల్వేలకు ఏడాదికి రూ.6వేల కోట్ల మేరకు ఇంధన ఖర్చులు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. డీజిల్ వినియోగాన్ని నిలిపివేయటం వల్ల సంవత్సరానికి 700 మిలియన్ టన్నుల మేర కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చు. ఆ మేరకు వాయు కాలుష్యం తగ్గిపోతుంది.

జల వివాదాలకు సత్వర పరిష్కారం

● కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

ఈనాడు - దిల్లీ

నదీ జలాల వివాదాలు ఇకపై త్వరితగతిన పరిష్కారమవనున్నాయి. ఈ వివాదాల పరిష్కారానికి ప్రస్తుతమున్న బహుళ ట్రైబ్యునళ్ల స్థానంలో ఒకే ట్రైబ్యునల్ ఏర్పాటుకానుంది. దాని ఏర్పాటుకు వీలు కల్పించే 'అంతర్రాష్ట్ర జల వివాదాల సవరణ బిల్లు-2019'కు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో పార్లమెంటు అనుబంధ భవనంలో బుధవారం సమావేశమైన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రాల మధ్య జల వివాదాలు తలెత్తినప్పుడు ప్రత్యేక ట్రైబ్యునళ్లను(ఇప్పుడు 9 ట్రైబ్యునళ్లు ఉన్నాయి) ఏర్పాటుచేస్తున్నారు. వాటికి సభ్యులు, సిబ్బందిని నియమించడం పెద్ద సమస్యగా మారుతోంది. తాజా బిల్లు చట్టరూపం దాలిస్తే శాశ్వతంగా ఒక ట్రైబ్యునల్‌ను ఏర్పాటుచేస్తారు. అన్ని జల వివాదాల పరిష్కార బాధ్యతను దానికే అప్పగిస్తారు. గరిష్ఠంగా 6 నెలల నుంచి ఏడాదిలోపు అంతర్రాష్ట్ర జల వివాదాలను పరిష్కరించేలా 'వివాద పరిష్కార కమిటీ'ని ఏర్పాటుచేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోలేని వివాదం తలెత్తినప్పుడు దాన్ని ట్రైబ్యునల్‌కు ప్రతిపాదించే అధికారమూ ఉంటుంది. ఈ ట్రైబ్యునల్ తీర్పే అంతిమం. కక్షిదారులంతా దానికి కట్టుబడి ఉండాలి. ట్రైబ్యునల్ తీర్పునకు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమైన విలువ ఉంటుంది.

➤ గ్రామీణ ప్రాంతాల్లోని నివాస సముదాయాలు, వ్యవసాయ మార్కెట్లు, ఉన్నత పాఠశాలలు, ఆస్పత్రులకు రహదారుల అనుసంధానం కల్పించేందుకు వీలుగా 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన-3'ను ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రాల్లో 1.25 లక్షల కిలోమీటర్ల రోడ్లు వేస్తారు. ఈ బృహత్తర ప్రాజెక్టుకు రూ.80,250 కోట్లు అవసరమని అంచనా. మొత్తం ఖర్చును కేంద్రం, రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో పంచుకుంటాయి. 2019-20 నుంచి 2024-25 మధ్య కాలంలో ఈ పథకం అమలవుతుంది. మైదాన ప్రాంతాల్లో 150 మీటర్ల పొడవున, హిమాలయ-ఈశాన్య రాష్ట్రాల్లో 200 మీటర్ల పొడవున వంతెనలు నిర్మించడానికి అవకాశం కల్పిస్తారు. ఈ పథకంలో చేరాలనుకొనే రాష్ట్రాలు ప్రారంభానికి ముందే అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలి.

➤ ట్రాన్స్‌జెండర్లకు సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన సాధికారత కల్పించడానికి వీలుగా ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు తీసుకురానున్నారు. అందుకు ఉద్దేశించిన 'ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల(హక్కుల రక్షణ) బిల్లు-2019'ను ఆమోదించారు.

➤ ప్రస్తుతం అమల్లో ఉన్న 'నియంత్రణ లేని డిపాజిట్ పథకాల ఆర్డినెన్సు-2019' స్థానంలో బిల్లు తీసుకురానున్నారు. ఫలితంగా డబ్బు డిపాజిట్ చేసి అక్రమార్కుల చేతుల్లో మోసపోతున్న పేదలు, సాధారణ ప్రజలకు రక్షణ లభిస్తుంది. అక్రమ పద్ధతుల్లో డిపాజిట్లు సేకరించిన వారి నుంచి డబ్బును డిపాజిట్‌దారులకు తిరిగి ఇప్పిస్తారు. దోషులను కఠినంగా శిక్షిస్తారు.

➤ సాయుధ పోలీసు బలగాల్లో పనిచేసేవారికి వ్యవస్థీకృత గ్రూప్ 'ఎ' హోదా కల్పించినట్లుగానే రైల్వే రక్షణ దళంలో పనిచేసేవారికీ ఆ హోదా కల్పించనున్నారు. దీంతో అర్హులైనవారికి కేంద్ర సివిల్ సర్వీస్ ఉద్యోగుల తరహాలో వేతనాలు పెరుగుతుంటాయి. పదోన్నతులు రాకపోయినా సర్వీసును బట్టి ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయి.

పోక్సో చట్టానికి సవరణలు

పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడేవారికి మరణ శిక్ష విధించేందుకు వీలు కల్పించేలా 'లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ(పోక్సో) చట్టం-2012'కు ప్రతిపాదించిన సవరణలను ఆమోదించారు. చిన్నారులతో కూడిన అశ్లీల చిత్రాలు తీసేవారికి, వాటిని ప్రచారం చేసేవారికి ఇకపై జరిమానా, జైలు శిక్ష విధించనున్నారు. లైంగిక కార్యకలాపాల రొంపిలోకి దింపేందుకు చిన్నారులకు శారీరక ఎదుగుదల హార్మోన్లు, రసాయన పదార్థాలు అందించడాన్ని నేరంగా పరిగణించి జైలుశిక్ష విధిస్తారు. కఠినమైన నిబంధనలను అమల్లోకి తీసుకురావడంతో చిన్నారులపై లైంగిక నేరాలకు అడ్డుకట్ట పడుతుందని కేంద్రం భావిస్తోంది.

కార్మికుల పనికి భద్రత

కార్మికులకు భద్రత కల్పించే 'కోడ్ ఆన్ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్ బిల్లు-2019'ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఫలితంగా కార్మికుల భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు మెరుగుపడనున్నాయి. 10 మంది కార్మికులుండే సంస్థ కూడా ఈ నిబంధనలను అమలు చేయాల్సి ఉంటుంది. అన్నిరకాల కార్మికులకు నిబంధనలను అమలుచేయడానికి వీలుగా వర్కింగ్ జర్నలిస్టులు, సినీ కార్మికులకున్న అర్హాన్ని సవరించారు. ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు అన్ని రకాల ఆడియో-విజువల్ ప్రొడక్షన్‌లో పాల్గొనే కార్మికులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పని చేస్తున్న కార్మికులకూ ఈ భద్రత వర్తిస్తుంది.

క్రమశిక్షణతో 5 ట్రిలియన్ సాధిస్తాం

● బడ్జెట్‌పై చర్చకు సమాధానమిచ్చిన నిర్మలా సీతారామన్

లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఈనాడు, దిల్లీ: సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ 2019-20 బడ్జెట్‌లో కేటాయింపులు జరిపామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడుతూ 5 ట్రిలియన్ డాలర్ల (రూ.350లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థను చేరుకొనే విధంగా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. బడ్జెట్‌పై రెండు రోజులుగా లోక్‌సభలో 15 గంటలపాటు జరిగిన సుదీర్ఘ చర్చకు ఆమెబుధవారం సమాధానం ఇచ్చారు. వివిధ అంశాల్లో సాధించిన ప్రగతిని వివరించారు.

- స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) వృద్ధి కోసం ప్రధాని నేతృత్వంలో అయిదుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటైంది. 5 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థను చేరుకోవడానికి వీలుగా విధానాల్లో మార్పులు తీసుకొస్తాం. బడ్జెట్ పత్రాలు, ఆర్థిక సర్వేలో చెప్పిన జీడీపీ లెక్కల్లో ఎలాంటి అస్పష్టత లేదు.
- 2022కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న కృతనిశ్చయంతో స్వామినాథన్ కమిషన్ నివేదిక మేరకు పంటల మద్దతు ధరలు నిర్ణయించాం. ఆ కమిషన్ చేసిన 272 సిఫార్సుల్లో కొన్నింటిని ఇప్పటికే అమలుచేశాం. వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణలు తీసుకొస్తున్నాం. 2022 నాటికి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిని రెట్టింపు చేయడానికి కొత్త విధానం తీసుకొస్తున్నాం.
- పన్నుల్లో వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రాలకు రూ.13,29,428 కోట్లు పంచుతున్నాం.
- ఈ సంవత్సరం నవంబర్‌లో 15వ ఆర్థిక సంఘం నివేదిక వస్తుంది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో దానికి అనుగుణంగా కేటాయింపులు జరుపుతాం.
- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగినన్ని నిధులు ఇస్తున్నాం. 2018-19లో రూ. 55వేల కోట్లు కేటాయించాం. డిమాండ్‌ను బట్టి అదనంగా రూ.6వేల కోట్లు ఇచ్చాం. ఈ సంవత్సరం కూడా రూ.55వేల కోట్లు కేటాయించాం. అవసరాన్నిబట్టి పెంచుతాం.
- రాయితీలకు ఇచ్చే నిధులను రూ.2.66 లక్షల కోట్ల నుంచి రూ.3.02 లక్షల కోట్లకు పెంచామని వివరించారు. ఆమె సమాధానంతో సంతృప్తి చెందని కాంగ్రెస్, టీఎంసీలు వాకౌట్ చేశాయి. తెలంగాణ, ఒడిశాతోపాటు, దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఏటా ఇస్తున్న ఆర్థికసాయాన్ని 70:30 నిష్పత్తిలో పంచుకోవడానికి కేంద్రం ముందుకు రావాలని బీజేడీ సభ్యుడు భర్తృహరి మహతాబ్ చేసిన సూచనను పరిశీలిస్తామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు.

రైల్వేలను ప్రైవేటుపరం చేయబోం

● లోక్‌సభలో పీయూష్ గోయల్ స్పష్టీకరణ

దిల్లీ: రైల్వేలను ప్రైవేటుపరం చేసే ప్రతిపాదన ఏదీ లేదని బుధవారం కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దిల్లీ-లఖ్‌నవూ తేజస్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయివేటుపరం చేస్తారంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చింది. రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ "ప్రైవేటు సంస్థలకు అప్పగించడానికి ఏ రైలునూ గుర్తించలేదు" అని తెలిపారు.

ఇసుక తవ్వకాలపై...

ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించిన కేసులు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో అత్యధికంగా నమోదయ్యాయని గనులశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో 25,475 కేసులు నమోదు కాగా ఏటా తగ్గుముఖం పడుతున్నాయి. 2016-17లో 9,703, ఆ తర్వాతి సంవత్సరాల్లో వరుసగా 8,128, 7,644 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో కేసుల సంఖ్య పెరుగుతోంది. 2016-17లో 5,839 కేసులు నమోదుకాగా, ఆ తర్వాతి సంవత్సరాల్లో 6,143, 6,553 నమోదయ్యాయి. ఏపీలో 30 కేసులు నమోదు చేయడంతోపాటు, 18 కోర్టుకేసులు దాఖలయ్యాయి. 648 వాహనాలను స్వాధీనం చేసుకొని, రూ.85.80 కోట్ల జరిమానా వసూలు చేశారు. తెలంగాణలో ఒక్క ఎఫ్ఐఆర్‌కానీ, కోర్టుకేసుకానీ నమోదు కాలేదు. కేవలం రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జరిమానా రూపంలో రూ. 47.57 కోట్లు వసూలు చేశారు.

- దేశంలో 1,494 మంది ఐఏఎస్ ఉద్యోగుల కొరత ఉందని సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. ఏపీలో 239 మందికిగాను 181, తెలంగాణలో 208 మందికిగాను 154 మంది పనిచేస్తున్నట్లు తెలిపారు.
- బీఎస్ఎన్ఎల్: విద్యుత్తు బిల్లులు చెల్లించని కారణంగా 1,000కిపైగా మొబైల్ టవర్లు, 500 టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు పనిచేయడం లేదని కమ్యూనికేషన్ల మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ టెలికాం కంపెనీలు గ్రామీణ ప్రాంతాల్లో 57,000 మొబైల్ టవర్లు ఏర్పాటు చేయనున్నాయని చెప్పారు.
- జమ్ము-కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి ఉద్దేశించిన 370వ అధికరణం తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్ రెడ్డి రాజ్యసభలో చెప్పారు.

కర్ణాటక సమస్యపై రాజ్యసభ వాయిదా

కర్ణాటకలో తలెత్తిన రాజకీయ సంక్షోభం విషయమై బుధవారం రాజ్యసభ మళ్లీ వాయిదా పడింది. భోజన విరామ సమయానికి ముందు రెండు సార్లు గందరగోళం నెలకొనడంతో వాయిదా పడింది. మళ్లీ మూడు గంటలకు సమావేశమయినప్పుడు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కర్ణాటక సంక్షోభంపై చర్చించాలని కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ కోరగా, బడ్జెట్ మినహా ఇతర అంశాలకు అవకాశం ఇవ్వబోనని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ స్పష్టం చేశారు. ఇదే విషయమై మంగళవారం కూడా సభలో గందరగోళం నెలకొనడంతో వాయిదా పడింది.

అమేఠీలో ఓడింది అందుకే..!

స్థానిక నేతలే కారణమన్న రాహుల్

అమేఠీలో కార్యకర్త చెబుతున్న విషయాన్ని వింటున్న రాహుల్

అమేఠీ: లోక్‌సభ ఎన్నికల్లో అమేఠీలో తన ఓటమికి స్థానిక నేతలే కారణమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిందించారు. ఎన్నికల సమయంలో కార్యకర్తలు ఎంతో శ్రమించినా, స్థానిక నేతలు మాత్రం ప్రజలకు దూరంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఈ స్థానంలో ఓటమి అనంతరం తొలిసారిగా రాహుల్ బుధవారం అమేఠీలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడారు. తాను వయనాడ్ ఎంపీనే అయినప్పటికీ 3 దశాబ్దాల అనుబంధం ఉన్న అమేఠీని విడిచిపెట్టేది లేదని అన్నారు. ఇక్కడకు చేరుకున్న అనంతరం రాహుల్ తొలుత గౌరీగంజ్‌లోని తిలోయా అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి మాతాప్రసాద్ వైష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవలే మాతాప్రసాద్ బంధువొకరు మృతి చెందారు. అనంతరం పార్టీ కార్యవర్గ సభ్యులతో రాహుల్ సమీక్ష నిర్వహించారు. 5 అసెంబ్లీ నియోజకవర్గాల బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలతో భేటీ అయ్యారు. మొత్తం జిల్లాలో కాంగ్రెస్ బలహీనంగా ఉన్నట్లు పలువురు కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రచారం దిశానిర్దేశం లేకుండా సాగిందని, స్థానిక నేతలు కొందరు భాజపాతో కలిసి పనిచేశారని కార్యకర్తలు రాహుల్‌కు తెలిపినట్లు సమాచారం. రాహుల్ పర్యటన సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదుట ఓ పోస్టర్ ప్రత్యక్షమైంది. సంజయ్‌గాంధీ మెమోరియల్ ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్సకు నిరాకరించడంతో ఓ వ్యక్తి మృతి చెందాడని, దీనికి న్యాయం చేయాలని అందులో డిమాండ్ చేశారు.

'కోటి' కృతజ్ఞతలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సామాజిక మాధ్యమ వేదిక ట్విటర్‌లో అనుసరిస్తున్న (ఫాలో) వారి సంఖ్య కోటి దాటింది. ఈ సందర్భంగా ఆయన ప్రతిఒక్కరికీ బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

370వ అధికరణంపై సత్వరమే విచారణ

దిల్లీ: జమ్ము-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న 370వ అధికరణం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించడానికి బుధవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ దీపక్ గుప్త, జస్టిస్ అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం దీన్ని విచారించనుంది. భాజపా నాయకుడు అశ్విన్ ఉపాధ్యాయ దీన్ని దాఖలు చేశారు.

ముంబయిలో సైనిక పాలన ఉందా?

కాంగ్రెస్ నేత అధీర్ ప్రశ్న

దిల్లీ: ముంబయిలో సైనిక పాలన ఉందా అని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధరి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం కర్ణాటక సంక్షోభంపై విలేకరులతో మాట్లాడుతూ ముంబయిలో నిర్బంధంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మంత్రి డి.కె.శివకుమార్ కలుసుకోకుండా అక్కడి భాజపా ప్రభుత్వం అడ్డుకొందని ఆరోపించారు. అధికారం చేజిక్కించుకోవడానికి భాజపా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తోందని ఆరోపించారు.

గోవా కాంగ్రెస్‌లో కుదుపు

● 10 మంది ఎమ్మెల్యేలు భాజపాలో విలీనం

పణజీలో స్పీకర్ రాజేశ్ పట్నేకర్‌కు విలీన సమ్మతి లేఖ అందజేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

పణజీ: కర్ణాటకలోని రాజకీయ గాలులు పొరుగున ఉన్న గోవాకు వ్యాపించాయి. బుధవారం అక్కడి కాంగ్రెస్ పార్టీలో చీలిక ఏర్పడింది. మొత్తం 15 మంది ఎమ్మెల్యేల్లో 10 మంది (మూడింట రెండొంతులు) భాజపాలో విలీనమవుతున్నట్టు ప్రకటించారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రకాంత్ కవ్లేకర్ నేతృత్వంలో వారంతా స్పీకర్ రాజేశ్ పట్నేకర్‌ను కలిసి తాము కాంగ్రెస్ నుంచి విడిపోతున్నామని, భాజపాలో విలీనమవుతున్నామంటూ లేఖను అందజేశారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, డిప్యూటీ స్పీకర్ మైఖేల్ లోబో అక్కడే ఉన్నారు. స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యేల్లో అటనాసియో మొన్సెరట్టే, జెన్నిఫర్ మొన్సెరట్టే, ఫ్రాన్సిస్ సిల్వేరియా, ఫిలిప్ నెరీ రోడ్రిగస్, క్లియోఫాసియో డయాస్, విల్‌ఫ్రెడ్ డిసా, నీల్‌కాంత్ హలంకార్, ఇసోడర్ ఫెర్నాండెజ్ ఉన్నారు. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ బలం 5కు పడిపోయింది. మొత్తం 40 స్థానాలు ఉన్న గోవా అసెంబ్లీలో ప్రస్తుతం శాసనసభలో భాజపాకు 17 మంది, గోవా ఫార్వర్డ్ పార్టీకి ముగ్గురు, ఎన్‌సీపీ, ఎంజీపీకి ఒక్కొక్కరు సభ్యులు ఉండగా, ముగ్గురు స్వతంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ చీలిక వర్గం చేరికతో భాజపా బలం 27కు పెరగనుంది. భాజపా సొంత బలం పెరగడంతో మిత్రపక్షమైన గోవా ఫార్వర్డ్ పార్టీని ప్రభుత్వంలో కొనసాగించేదీ లేనిదీ అనుమానాస్పదంగా ఉంది. ముఖ్యమంత్రి సావంత్ పనితీరు నచ్చి, నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని కవ్లేకర్ తెలిపారు.

భారత సైన్యంపై దాడులకు అల్‌ఖైదా పిలుపు

దిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా..ఆ దేశ సైన్యంపై నిరంతరాయంగా దాడులు చేయాలని కశ్మీర్‌లోని ఉగ్రవాదులకు అల్ ఖైదా నేత అయమన్ అల్ జవాహిరీ పిలుపునిచ్చారు. ఈ మేరకు తాజాగా ఒక వీడియో విడుదలైంది. ఒసామా బిన్ లాడన్ హతమైన తరువాత జవాహిరీ అల్‌ఖైదా బాధ్యతలు చేపట్టారు. 'కశ్మీరులో సైన్యంపై దాడులు చేయడమే లక్ష్యంగా ముజాహిదీన్లు దృష్టి పెట్టాలి. ఈ దాడులతో భారత్ ఆర్థికంగా కుంగిపోవడంతో పాటు ప్రాణ, ఆయుధ నష్టం జరగాలి" అని ఆ వీడియోలో ఉగ్రవాదులను కోరారు. దీనిపై భద్రతా బలగాలు ఆరా తీస్తున్నాయి.

ఇసుక కుంభకోణంలో సీబీఐ కొరడా!

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై సీబీఐ కొరడా ఝుళిపించింది! 2012 నాటి కుంభకోణం దర్యాప్తులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 12 చోట్ల ఏకబిగిన సోదాలు చేపట్టింది. ఎస్పీ సర్కారు హయాంలో మంత్రిగా పనిచేసిన గాయత్రి ప్రజాపతి, నలుగురు ఐఏఎస్ అధికారుల ప్రాంగణాల వద్ద తనిఖీలు నిర్వహించింది. వీరంతా కలిసి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక టెండర్లను కొందరు వ్యక్తులకు కట్టబెట్టారని సీబీఐ ఆరోపిస్తోంది.

చాంపియన్

దుఃఖంలో ధోని!

ఎలాంటి స్థితిలోనూ భావోద్వేగాలు ప్రదర్శించకుండా ప్రశాంతంగా ఉండే ధోని.. తన అంతర్జాతీయ కెరీర్లో చివరిదిగా భావిస్తున్న మ్యాచ్‌లో ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు. ఔటై పెవిలియన్‌కు చేరుతున్న సమయంలో ధోని దాదాపు ఏడుస్తున్న స్థితిలో కనిపించాడు. అంత పోరాడినా భారత్ ఫైనల్‌కు చేర్చలేకపోవడం, బాధాకర ఓటమితో ప్రపంచకప్‌ను వీడడం ధోనీని కదిలించినట్లుంది.

మ. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఐదుసార్లు ఛాంపియన్ ఒక వైపు.. తొలి కప్పు కోసం ఆరాటపడుతున్న జట్టు మరో వైపు. ఈ నేపథ్యంలో ప్రపంచకప్‌లో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా.. గురువారం ఇంగ్లాండ్‌ను ఢీకొంటుంది.

కివీస్‌ను ఢీ కొట్టేదెవరో

● ఇంగ్లాండ్ × ఆస్ట్రేలియా సెమీఫైనల్ నేడే

బర్మింగ్‌హామ్: ప్రపంచకప్‌లో టైటిల్ కోసం న్యూజిలాండ్‌తో తలపడే జట్టేదో గురువారం తేలిపోనుంది. కప్పుపై గంపెడాశలు పెట్టుకున్న ఇంగ్లాండ్ రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఢీకొంటుంది. ఇక్కడ గత రెండు మ్యాచ్‌ల్లో 300పై స్కోర్లు నమోదయ్యాయి. పేస్ బౌలర్లు బాగానే రాణించారు. మ్యాచ్‌కు వర్షం మప్పు పొంచి ఉంది.

ప్రపంచకప్‌లో..

ప్రపంచకప్‌లోనూ కంగారూలదే ఆధిపత్యం. ఆసీస్ 6 మ్యాచ్‌లు నెగ్గగా.. ఇంగ్లాండ్ రెండే గెలిచింది.

ఇంగ్లాండ్‌లో..

సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌ల్లో మాత్రం ఇంగ్లాండ్ 34-31తో ఆస్ట్రేలియాపై ఆధిక్యంలో ఉంది.

ముఖాముఖిలో..

వన్డే క్రికెట్లో మొత్తంగా ఇంగ్లాండ్‌పై ఆస్ట్రేలియాదే పైచేయి. ఆసీస్ 82-61తో ఆధిక్యంలో ఉంది.

వీళ్లు కీలకం

ఇంగ్లాండ్: బెయిర్‌స్టో, జేసన్ రాయ్, స్టోక్స్

ఆస్ట్రేలియా: వార్నర్, ఫించ్, స్టార్క్

5 ఏళ్లలో 5 కప్పులు పోయాయి

గత అయిదేళ్లలో టీమ్‌ఇండియా అయిదు ఐసీసీ టోర్నీల్లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అన్నింట్లోనూ గ్రూప్ దశలో బాగా ఆడింది. టైటిల్‌పై ఆశలు రేకెత్తించింది. కానీ నాకౌట్‌కు వచ్చాక విఫలమైంది. 2014 టీ20 ప్రపంచకప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. శ్రీలంక చేతిలో కంగుతింది. తర్వాతి ఏడాది వన్డే ప్రపంచకప్‌లో గ్రూప్ దశ అంతా అదరగొట్టింది. అయితే సెమీస్‌లో ఆస్ట్రేలియాకు తలవంచింది. 2016 టీ20 ప్రపంచకప్‌లో సెమీస్‌కు దూసుకొచ్చిన భారత్.. గెలుపు ఖాయమనుకున్న మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో షాక్ తింది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు పాకిస్థాన్ షాకిచ్చింది. ఇప్పుడు భారత జట్టుకు న్యూజిలాండ్ రుూలక్ ఇచ్చింది.

ఆసీస్‌లో అతనొక్కడే బలహీనం

జెఫ్ థాంప్సన్



జాసన్ రాయ్ తిరిగి ఇంగ్లాండ్ జట్టులో చేరడం వల్ల ఇంగ్లాండ్ ప్రపంచకప్ గెలిచే అవకాశాలు పెరిగాయని మీడియా మరోసారి కథనాలు రచిస్తోంది. అయితే ఆ జట్టు మొదట సెమీస్‌లో ఆస్ట్రేలియా అడ్డంకిని దాటాలి. ఆసీస్-ఇంగ్లాండ్ మ్యాచ్ భారత్-పాక్ పోరు లాంటిదే. రెండు జట్లు ఓటమిని సహించలేవు. స్మిత్, వార్నర్ బరిలో దిగుతున్నప్పుడు ఇంగ్లిష్ అభిమానులు వారిని గేలి చేయడం కూడా వారి ద్వేషంలో భాగమే. రాయ్-బెయిర్‌స్టో, స్టార్క్-కమిన్స్ పోరాటం చూడాల్స

పతనం అంచున సంకీర్ణం

- కర్ణాటక సీఎం కుమారస్వామి రాజీనామా యోచన?
- 'సుప్రీం' తలుపు తట్టిన అసమ్మతి నేతలు
- ఫలించని డీకే మంత్రాంగం
- మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా
- విధానసౌధలో ప్రజాప్రతినిధుల కీచులాట

ఈనాడు డిజిటల్ – బెంగళూరు

కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం పతనం అంచుకు చేరింది. బుధవారం నాటి వరుస పరిణామాల అనంతరం, ముఖ్యమంత్రి కుమారస్వామి రాజీనామా చేయాలని యోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బడ్జెట్ సమావేశాల్లోగా ఆయన తన నిర్ణయాన్ని అమలు చేయవచ్చని భావిస్తున్నారు. ముంబయి హోటల్లో ఉంటున్న అసమ్మతి నేతలు తమ రాజీనామాలను స్పీకరు ఆమోదించాలని కోరుతూ సుప్రీం తలుపు తట్టారు. వారిని బుజ్జగించేందుకు సీనియర్ మంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలో బృందం విఫలయత్నం చేసింది. మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు... హొసకోటే ఎమ్మెల్యే, మంత్రి ఎం.టి.బి.నాగరాజు, చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే కె.సుధాకర్‌లు బుధవారం తమ శాసనసభ్యత్వాలకు రాజీనామా చేయటం సంకీర్ణకూటమిని కుదుపునకు గురయ్యేలా చేసింది.

ఇక అస్త్రసన్యాసమేనా?

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి బుధవారం రాత్రి తన తండ్రి, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవేగౌడతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఈ నేపథ్యంలో.. శాసనసభ సమావేశాల్లోగానే ఆయన తన రాజీనామా నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నాయని సమాచారం. బుధవారం మిత్రపక్షాలు రాజ్‌భవన్ వద్ద చేసిన ఆందోళనలో ముఖ్యమంత్రి పాల్గొనలేదు. కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసిన సమావేశాలకూ హాజరు కాలేదు. భాజపా కుట్రలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఓ పత్రికా ప్రకటనను మాత్రం విడుదల చేశారు.

రాజీనామాలు ఆమోదించండి: అసమ్మతి నేతలు

సభాపతి రమేశ్‌కుమార్ తమ రాజీనామాలు అంగీకరిస్తారని ఎదురు చూసిన అసమ్మతి ఎమ్మెల్యేలు బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే కాలహరణం చేస్తున్నారని, తమ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. "ఈ ప్రభుత్వంలో మేము నియోజకవర్గాల అభివృద్ధి చేపట్టలేమని స్వచ్ఛందంగానే రాజీనామా చేశాం. వీలైనంత త్వరగా మా రాజీనామాలు అంగీకరించాల"ని నివేదించారు. ఈ పిటిషన్‌కు తక్షణ విచారణ అర్హత ఉందో లేదో గురువారం నిర్ణయిస్తామని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయి నేతృత్వంలోని బెంచి స్పష్టం చేసింది.

డీకే ప్రయత్నాలు

ముంబయిలో ఉన్న ఎమ్మెల్యేలను సముదాయించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ బుధవారం ఉదయం ముంబయి రినైసెన్స్ హోటల్‌కు చేరుకున్నారు. తనకు హోటల్లో రిజర్వేషన్ ఉందని చెప్పినా పోలీసులు ఆయనను లోపలకి అనుమతించలేదు. భాజపా కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాము శివకుమార్‌తో సమావేశమయ్యే ప్రసక్తే లేదని అసమ్మతి నేతలు తెగేసి చెప్పారు. పోలీసులు శివకుమార్ అదుపులోకి తీసుకుని తర్వాత విడుదల చేశారు. ఆయన బెంగళూరు తిరిగొచ్చారు.

స్పీకరు కార్యాలయంలో

స్పీకర్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఇద్దరు సభ్యులు రాజీనామాలు సమర్పిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు సహనాన్ని కోల్పోయారు. సీనియర్ మంత్రి కె.జె.జార్జి, రాజీనామా చేసి వెళ్తున్న చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే కె.సుధాకర్‌ను మెడపట్టుకుని కార్యాలయంలోనికి తీసుకెళ్లి బంధించారు. పీసీసీ అధ్యక్షుడు దినేశ్‌గుండూరావు, మంత్రులు, సీనియర్ నేతల సమక్షంలోనే ఈ సంఘటన చోటు చేసుకుంది. అంతకు ముందు కాంగ్రెస్ మంత్రి ఎం.టి.బి.నాగరాజు ఉరుకులు పరుగులతో స్పీకర్ గదిలోకి వెళ్లి రాజీనామా సమర్పించటం గమనార్హం.

గవర్నర్‌ను కలిసిన భాజపా నేతల బృందం

ఎమ్మెల్యేలంతా సంకీర్ణ ప్రభుత్వంతో విసిగి పోయి స్వచ్ఛందంగానే రాజీనామా చేసినా, స్పీకర్ దురుద్దేశంతో వాటిని ఆమోదించటం లేదని భాజపా నేతల బృందం గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. 'ప్రస్తుత ప్రభుత్వం సంఖ్యా బలాన్ని పూర్తి స్థాయిలో కోల్పోయింది. ఎట్టి పరిస్థితిలోనూ అధికారంలో కొనసాగే నైతికత లేదు. మాకు 107 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఇకనైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలి' అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప నేతృత్వంలోని బృందం గవర్నర్‌కు విన్నవించింది. ఇదే బృందం వెంటనే స్పీకర్‌ను కూడా కలుసుకుంది. కుమార సర్కారు తక్షణం అధికారం నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ.. విధానసౌధ ముంగిట గాంధీ విగ్రహం వద్ద భాజపా ఆందోళనను కొనసాగించింది.

మిత్రపక్షాలు కూడా..

కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలు గులాం నబీ అజాద్, కె.సి.వేణుగోపాల్, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలతో కూడిన మిత్ర పక్షాల బృందం బుధవారం ర్యాలీగా గవర్నర్ కార్యాలయానికి చేరుకుంది. వీరిని కలిసేందుకు గవర్నర్ వజూభాయి వాలా అవకాశం కల్పించలేదు. వీరంతా రాజ్‌భవన్ ముందే బైఠాయించి ఆపరేషన్ కమలతో కర్ణాటక ప్రభుత్వాన్ని కూల్చేందుకు యత్నిస్తున్న భాజపాపై నిప్పులు చెరిగారు.

ముంబయిలో కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలు ఉంటున్న హోటల్ ముందు కూర్చున్న కర్ణాటక మంత్రులు డీకే శివకుమార్, జీటీ దేవేగౌడ తదితరులు

రాజీనామాలు అంగీకరిస్తే.. విధానసభలో బలాబలాలు

- మొత్తం ఎమ్మెల్యేలు : 224
- 16 మంది రాజీనామాల తర్వాత మొత్తం : 208
- భాజపా : 107, ◆ కాంగ్రెస్ : 65
- జేడీఎస్ : 34, ◆ బీఎస్‌పీ : 1, ◆ స్పీకర్ : 1

మేజిక్ నంబరు–104, మిత్రపక్షాల బలం–101

'డిజైన్ ఐ' సంస్థకు జరిమానా

ఇంటీరియర్ డిజైన్ సేవల్లో లోపంపై ఫోరం తీర్పు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఒప్పందం ప్రకారం ఇంటీరియర్ డిజైనింగ్ చేయడంలో జాప్యం చేసినందుకు హైదరాబాద్ వినియోగదారుల ఫోరం-2.. 'డిజైన్ ఐ' అనే సంస్థకు రూ.75,000 జరిమానా విధించింది. మానసిక వేదన చెందిన ఫిర్యాదుదారుకు ఈ మొత్తం చెల్లించాలని ఆదేశించింది. దీంతోపాటు ఫిర్యాదుదారు చెల్లించిన మొత్తం, కట్టిన అద్దె రూ.53,200 ఇతర ఖర్చుల కింద రూ.10,000 కూడా చెల్లించాలని ప్రతివాదికి సూచించింది. జి.రమేశ్ రుణం ద్వారా కోకాపేటలో కొనుగోలు చేసిన ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ కోసం 'డిజైన్ ఐ' సంస్థ ప్రతినిధి సాయికృష్ణారెడ్డిని సంప్రదించారు. రూ.1,50,000లకు పనులు చేసేందుకు ఒప్పందం కుదిరింది. ఇందు కోసం రమేశ్ రూ.25,000 చెక్కు ద్వారా బయానా చెల్లించారు. ప్రతివాది అభ్యర్థన మేరకు మరో దఫా రూ.50,000 చెక్కు పంపారు. డబ్బు సమకూరిందని చెప్పిన తర్వాతే చెక్కును డ్రా చేయాలని సాయికృష్ణారెడ్డిని అభ్యర్థించారు. ఈ విషయాన్ని పట్టించుకోని ప్రతివాది నగదు డ్రా చేయడానికి అడ్వాన్స్ చెక్‌ను వినియోగించడంతో చెక్ బౌన్స్ అయింది. విషయం తెలిసి ఫిర్యాదుదారు వెంటనే రూ.50,000 నగదును ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. సకాలంలో డబ్బులు చెల్లిస్తున్నా పనులు జాప్యం అవడం పట్ల ప్రశ్నించగా.. ప్రతివాది సమాధానం ఇవ్వకపోగా మిగతా డబ్బు ఇస్తేనే పనులు చేస్తానని, లేదంటే చెక్‌బౌన్స్ కేసు వేస్తానంటూ బెదిరించాడని రమేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మిగిలిపోయిన పనులకు రూ.2,00,000 వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ప్రతివాదికి చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించడంతోపాటు తగిన పరిహారం అందేలా చూడాలని రమేశ్ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. తగిన ఆధారాలను ఫోరానికి సమర్పించారు. ఇందుకు సంబంధించి ప్రతివాది తన వివరణకు ఫోరానికి సమర్పించలేదు. దీంతో ఫిర్యాదుదారు వాదనతో ఏకీభవిస్తూ ఫోరం తీర్పు ఇచ్చింది.

పరిహారం చెల్లించాల్సిందే..!

'కంట్రీవెకేషన్స్'ను ఆదేశించిన ఫోరం

తప్పుడు హామీలతో జనం నుంచి డబ్బులు వసూలు చేయడం పట్ల వినియోగదారుల ఫోరం-2 తీవ్రంగా స్పందించింది. సభ్యత్వం కోసం బాధితుడు కట్టిన రూ.1,71,000 తిరిగి ఇచ్చేయాలని సదరు సంస్థకు తెలిపింది. బ్యాంకు వసూలు చేసిన వడ్డీ రూ.13,004తోపాటు పరిహారంగా రూ.10,000, ఇతర ఖర్చులకు రూ.10,000 ఇవ్వాలని తీర్పు వెలువరించింది. ఆ వివరాలను ఫిర్యాదుదారుడు ప్రభాకర్‌గుప్తా వెల్లడించారు. 'లక్కీడిప్‌లో మీ ఫోన్ నంబరుకు మంచి బహుమతి లభించిందన్న సందేశం రావడంతో బేగంపేటలోని కంట్రీవెకేషన్స్ సంస్థ కార్యాలయానికి వెళ్లాను. సభ్యత్వం తీసుకుంటే సంవత్సరంలో వారంపాటు టూర్, బంగారు కాయిన్, బహుమతిగా రిజిస్ట్రేషన్ రుసుము లేని భూమి తదితర హామీలు ఇచ్చారు. నేను, నా భార్య, కుమార్తె పేర్ల మీద సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇందుకోసం క్రెడిట్ కార్డు ద్వారా 12 నెలల వాయిదాల రూపంలో రూ.1,65,000, బంగారు కాయిన్ కోసం మరో రూ.6,000 చెల్లించాను. దీనిపై కంట్రీవెకేషన్స్ ప్రతినిధుల్ని ప్రశ్నిద్దామని వెళ్తే స్పందించలేదు. అందుకే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాను' అని ప్రభాకర్‌గుప్తా తెలిపారు. ఫిర్యాదుదారు అందించిన వివరాల్లో వాస్తవాలు లేవంటూ కంట్రీవెకేషన్స్ సంస్థ ఫోరానికి రాతపూర్వక వివరణ అందించింది. ఇరువురి వాదనలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన ఫోరం.. వినియోగదారుడికి అనుకూలంగా తీర్పు వెలువరించింది.

చినవెంకన్న ప్రసాదాలకు ఐఎస్‌వో గుర్తింపు

వరుసగా రెండో ఏడాదీ లభ్యం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల క్షేత్రానికి వరుసగా రెండో ఏడాదీ ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఇక్కడ కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రుచికరమైన, నాణ్యమైన ప్రసాదాలను అందిస్తున్నందుకు హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఐఎస్‌వో 22200:2018 ధ్రువపత్రాన్ని అందించింది. దేవస్థానం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు గతేడాది ఐఎస్‌వో ధ్రువపత్రం లభించింది.

అన్నదాతకు ఆత్మస్థైర్యం: ఏపీ సీఎం జగన్

- గతంలో బలవన్మరణం పాలైన రైతుల కుటుంబాల పరిహారానికి నిర్ణయం

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వ పాలనలో ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో ఎవరైనా అర్హులుంటే గుర్తించి.. వారి కుటుంబాలకు కూడా రూ.7 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అన్నదాతలకు ఇచ్చే పరిహారాన్ని వేరొకరు తీసుకోలేని విధంగా చట్టాన్ని కూడా తెస్తున్నామని వివరించారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఆత్మహత్యలను ప్రోత్సహించకూడదని. . రైతు బలవనర్మణం పాలయితే ఆ కుటుంబాల్లో ఆత్మస్థైర్యం నింపడమే మన ఉద్దేశమని సీఎం స్పష్టం చేశారు. 'స్పందన' కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ సమయంలో రైతు ఆత్మహత్యల విషయం ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ "2014 నుంచి 2019 మధ్య కాలంలో 1,513 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని జిల్లా నేర గణాంక సంస్థ లెక్కలు చెబుతున్నాయి. కానీ పరిహారం మాత్రం 391 మందికే ఇచ్చారు. దీన్నిబట్టి చూస్తే మిగిలిన రైతు కుటుంబాలకు పరిహారం నిరాకరించినట్లు స్పష్టమవుతోంది. జిల్లాల వారీగా లెక్కలు పరిశీలించి అర్హులను గుర్తించండి. వారి కుటుంబాల్లో స్థైర్యం నింపండి. ఎమ్మెల్యేలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించండి" అని సీఎం ఆదేశించారు.

నేటినుంచి కిసాన్ సభ జాతీయ సమావేశాలు

ఈనాడు, హైదరాబాద్: అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాలు 11 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నాయి. దేశంలో సహకార వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమాలను తొలి రెండు రోజుల్లో నిర్వహిస్తారు. కిసాన్ సభ నిర్వహిస్తున్న ఉద్యమాలను సమీక్షించడం ద్వారా భవిష్యత్ కార్యాచరణను 13, 14 తేదీల్లో రూపొందిస్తారు. తొలిరోజు గురువారం 'రైతు సహకార వ్యవస్థ'పై సదస్సును కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ ప్రారంభిస్తారు.

రామ్‌ప్రసాద్ హత్యకు రూ.కోటి సుపారీ

- హత్య కేసులో 9 మందికి ప్రమేయం
- అదుపులో ఆరుగురు, మరో ముగ్గురి కోసం వేట
- సంఘటన స్థలానికి సమీపంలో కోగంటి సత్యం?
- సీసీ టీవీ పుటేజీల్లో నిందితుల జాడలు
- హత్య తర్వాత కొందరు పరారీ.. జనంలో కలిసిపోయిన శ్యామ్
- కిరాయి ముఠాకు చెల్లింపులన్నీ శ్యామ్ చేతుల మీదుగానే
- పోలీసుల దర్యాప్తులో వెలుగుచూస్తున్న నిజాలు

ఈనాడు, హైదరాబాద్: వ్యాపారి రామ్‌ప్రసాద్‌ను చంపేందుకు ప్రత్యర్థులు కిరాయి హంతకులకు రూ.కోటి ఇచ్చినట్టు పోలీసులు సమాచారాన్ని సేకరించారు. ఈ హత్య పథకం, ప్రణాళికలో మొత్తం తొమ్మిది మంది ప్రమేయం ఉందని కూడా గుర్తించారు. ఇందులో ఆరుగురు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉండగా, మరో ముగ్గుర్ని పట్టుకునేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాళ్లు కూడా దొరికితే చంపిందెవరు? ఎందుకు చంపారు? అన్న అంశాలపై సాక్ష్యాధారాలు అభించే అవకాశాలు ఉండటంతో, ఆ తర్వాత అందర్నీ అధికారికంగా అరెస్ట్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

చెల్లింపులన్నీ శ్యామ్ చేతుల మీదుగానే

రెండు నెలల క్రితమే హత్యకు ప్రణాళిక రచించిన సూత్రధారులు, పాత్రధారులు అప్పట్నుంచి హైదరాబాద్‌లో ఉన్నారని పోలీసులు తెలుసుకున్నారు. హంతకులకు బయానాలు, నగదు చెల్లింపులను కోగంటి సత్యం అనుచరుడు శ్యామ్ చేసినట్టు ఆధారాలు సేకరించారు. రామ్‌ప్రసాద్‌పై దాడి జరిగిన రోజు(జూన్, 6) రాత్రి సంఘటన స్థలంలో ఎనిమిది మంది ఉన్నట్టు సీసీటీవీ పుటేజీల ద్వారా తెలుసుకున్నారు. వీటి ఆధారంగా మరిన్ని సాక్ష్యాలను సేకరిస్తున్నారు.

సత్యానికి చెప్పిన తర్వాతే ప్రణాళిక అమలు

రామ్‌ప్రసాద్‌ను చంపేందుకు కార్యచరణ సిద్ధం చేసుకున్నాక ఈ విషయాన్ని కోగంటి సత్యానికి వివరించానని పోలీసుల అదుపులో ఉన్న శ్యామ్ అంగీకరించినట్టు తెలిసింది. "రామ్‌ప్రసాద్ గృహ ప్రవేశ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. అది పూర్తయ్యాక హత్య చేస్తాం. ఇందుకు మనవాళ్లు సిద్ధంగా ఉన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మూడు చోట్ల అతడిని చంపేందుకు అనువైన స్థలాలున్నాయి" అని కోగంటి సత్యానికి చెప్పానని శ్యామ్ పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో అతన్ని ఎలా చంపుతారో దగ్గరుండి చూడాలని కోగంటి సత్యం భావించాడని, హత్య జరిగిన రోజు ఆయన సంఘటన స్థలానికి వచ్చాడని, హంతకులున్న స్థలానికి కొంత దూరంలో ఉన్నాడని" పోలీసులు విచారణలో తేలినట్టు సమాచారం.

డ్రైవర్ కేకలతో..ఎవరికి వారే పరార్

హత్య చేశాక వేగంగా పారిపోయేందుకు వీలుగా హంతకులు వాహనాన్ని తెచ్చుకున్నారు. దాడి తర్వాత అందరూ అందులో పారిపోవాలనుకున్నారు. "దాడి చేస్తుండగా రామ్‌ప్రసాద్ కారు డ్రైవర్ కేకలు వేయడం, స్థానికులు గుమిగూడటంతో వారి ప్రణాళిక ఫలించలేదు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు ఎవరికి వారే వాహనం వైపు పరుగెత్తారు. జీప్ వేగంగా వెళ్లిపోవడంతో శ్యామ్ ఘటన స్థలానికి కొంత దూరంలో ఉండిపోయాడు. తర్వాత జనంలో కలిసిపోయి కొద్ది సేపు అక్కడే ఉన్నాడు. అనంతరం పంజాగుట్ట సర్కిల్ వరకూ నడుచుకుంటూ వెళ్లి ఆటోలో తాను బసచేసిన ప్రాంతానికి వెళ్లాడు" అని విచారణలో తేలినట్టు తెలిసింది. కోగంటి సత్యం మాత్రం కారు తీసుకురావాలంటూ తన స్నేహితుడిని పురమాయించి, అది వచ్చాక ఆ కారులో వెళ్లిపోయినట్టు, జీపులో పారిపోయిన హంతకులు పోలీసుల దృష్టి మళ్లించేందుకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ల వైపు వెళ్లి, తిరిగి పంజాగుట్టకు వచ్చి, తర్వాత గచ్చిబౌలి వైపు వెళ్లి అక్కడ జీప్‌ను వదిలేసి పారిపోయినట్టు పోలీసులు తెలుసుకున్నారు.

బలమైన ఆధారాల కోసం ప్రయత్నం

హత్య కేసులో కోగంటి సత్యానికి ప్రమేయం ఉన్నట్టు బలమైన సాక్ష్యాధారాలు కొన్ని మాత్రమే లభించినట్టు తెలిసింది. "ప్రత్యర్థిని చంపాలన్న కోరికను ఆయన తమ వద్ద వ్యక్తం చేశాడు. ఆయన కోరిక తీర్చేందుకే తాము హత్య చేశాం" అంటూ శ్యామ్ పోలీసులకు చెబుతున్నా.. సంబంధించిన కీలక ఆధారాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారని సమాచారం. 'కత్తులతో దాడి చేసిన వారందర్నీ గుర్తించాక, ఆయుధాలపై వారి వేలిముద్రలు సరిపోలిన తర్వాత నిందితులను నిర్ధారిస్తామని" ఓ పోలీస్ అధికారి 'ఈనాడు'కు తెలిపారు. "చంపింది ఎవరన్నది తెలుసుకున్నాం. చంపించింది ఎవరో తేలితే అందర్నీ అరెస్టు చేస్తాం" అని ఆయన తెలిపారు.

రైల్వే శాఖ చొరవ స్ఫూర్తిదాయకం

- 30 కి.మీ పొడవునా మొక్కలు నాటేందుకు నిర్ణయం
- ప్రారంభించిన సీఎం కార్యాలయ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్

మక్తల్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్‌లో రైల్వే శాఖ తొలిసారిగా జక్లేర్ నుంచి కృష్ణా రైల్వేస్టేషన్ వరకు 30 కి.మీ పొడవునా 2 లక్షలకుపైగా మొక్కలు నాటేందుకు ముందుకురావడం స్ఫూర్తిదాయకమని సీఎం కార్యాలయ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ వనజ, కలెక్టర్ వెంకట్‌రావుతో కలిసి మక్తల్ పట్టణ శివారులోని రైల్వే ట్రాక్ పక్కన మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైల్వేశాఖను స్ఫూర్తిగా తీసుకొని అన్ని శాఖలు మొక్కలు నాటి పెంచేందుకు ముందుకు రావాలని ఆమె చెప్పారు. రైల్వేమార్గం పొడవున నాటిన మొక్కల సంరక్షణలో పరిసర రైతులు, ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో రైల్వే ఈఈ సుభాకర్, అటవీశాఖ అధికారి గంగిరెడ్డి, మార్కెట్ ఛైర్మన్ నర్సింహగౌడ్, ఎంపీపీ వనజ, డీఈవో నరేందర్, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ 15 మందినీ హాజరుపరచండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: మహబూబాబాద్ జిల్లా వెంకటాపురం పంచాయతీ మిర్యాలపెంట గ్రామానికి చెందిన 15 మంది గిరిజనులను ఈ నెల 12వ తేదీన హాజరుపరచాలని పోలీసులను బుధవారం హైకోర్టు ఆదేశించింది. ఆ గ్రామ వాసులను గంగారాం పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగులపల్లికి చెందిన మద్దిశెట్టి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది రాజ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, గిరిజనులు ఎప్పటినుంచో అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. చట్ట నిబంధనలకు విరుద్ధంగా వారిని ఖాళీ చేయిస్తున్నారని, ఇందులో భాగంగానే మిర్యాలపెంట గ్రామప్రజలను పోలీసులు నిర్బంధించారని పేర్కొన్నారు. వాదనలను విన్న ధర్మాసనం..ఆ గిరిజనులను శుక్రవారం తమముందు హాజరుపరచాలంటూ విచారణను వాయిదా వేసింది.

కేంద్ర పథకాలపై సలహా సంఘం ఏర్పాటు

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, రాష్ట్ర పథకాలకు కేంద్రం అందించే తోడ్పాటుపై ఆర్థిక నిర్వహణ విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్రస్థాయి సలహాసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి, ఖజానా-గణాంకాల విభాగం డైరెక్టర్, ప్రణాళికా శాఖ డైరెక్టర్, ఆర్థికశాఖ ఐటీ సంచాలకుడు, రాష్ట్ర పే అండ్ అకౌంట్స్ అధికారి సభ్యులుగా ఉంటారు.

బీసీలకు చట్టబద్ధ హక్కులివ్వండి: ఆర్.నారాయణమూర్తి

కవాడిగూడ, న్యూస్‌టుడే: జనాభా దామాషా ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లోనూ చట్టబద్ధమైన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి కోరారు. వచ్చే 7న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే జాతీయ బీసీ మహాసభకు చెందిన గోడపత్రికను బుధవారం బీసీ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. సగం జనాభా ఉన్న బీసీలకు రిజర్వేషన్లను తగ్గించడం అన్యాయమన్నారు. దీన్ని ఎదిరించేందుకే మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. మహాసభల ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, మొదటిసారిగా నిర్వహించే జాతీయ మహాసభకు అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తారన్నారు. ముఖ్యమంత్రులందరినీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

జాతీయ బీసీ మహాసభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, మహాసభల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

తెరాస శ్రేణులకు సామాజిక మాధ్యమాలపై శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: రానున్న పురపాలక ఎన్నికలు, విపక్షాలను దీటుగా ఎదుర్కోవడం, పార్టీ పథకాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు సామాజిక మాధ్యమాలను వినియోగించుకునేలా పార్టీ శ్రేణులకు శిక్షణ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్రసమితి నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం తెలంగాణ భవన్‌లో చెన్నూరు నియోజకవర్గ తెరాస విద్యార్థి, యువజన విభాగాలకు సదస్సును నిర్వహించింది. దీనికి ఎమ్మెల్యే బాల్కసుమన్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్‌రాజు, దివ్యాంగుల ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, తెరాస రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, తెరాస విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, మంచిర్యాల జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల తీరు, వినియోగం, దుష్పరిణామాలు తదితర అంశాల గురించి చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ప్రభావం కొన్ని నియోజకవర్గాల్లో కనిపించిందని నేతలు, నిపుణులు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంతో తెరాసను మరింత బలోపేతం చేయాలని సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు భావిస్తున్నారని బాల్క సుమన్ చెప్పారు. వారి సూచనలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమం చేపట్టామని ఈ సందర్భంగా వెల్లడించారు.

ఏపీ డీజీపీ కార్యాలయంలోకి హోంశాఖ!

ఈనాడు, హైదరాబాద్: సచివాలయం తరలింపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఖాళీ చేసిన డీజీపీ కార్యాలయంలోకి తెలంగాణ హోం, అగ్నిమాపక శాఖలను తరలించాలని భావిస్తున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ కార్యాలయం కోసం లక్డీకాపూల్‌లోని సీఐడీ కార్యాలయ భవనాన్ని కేటాయించారు. ఇటీవల ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ఆధీనంలో ఉన్న భవనాలను తెలంగాణకు అప్పగిస్తోంది. సచివాలయంలో ఉన్న హోంశాఖ కార్యాలయం, బీఆర్కే భవన్‌లో ఉన్న అగ్నిమాపక విపత్తు నివారణ శాఖను అందులోకి తరలించాలని భావిస్తున్నారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

'సారోళ్ల' స్థితిగతులపై త్వరలో నివేదిక: బీసీ కమిషన్ ఛైర్మన్

మౌలాలి, నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సారోళ్ల పరిస్థితులపై ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక అందజేస్తామని బీసీ కమిషన్ అధ్యక్షుడు బీఎస్ రాములు అన్నారు. తమను బీసీ 'ఏ' లో చేర్చాలంటూ దశాబ్దంగా వారు విజ్ఞాపనలు చేస్తున్నారు. వినాయకనగర్ డివిజన్ చంద్రగిరి కాలనీ, నేరేడ్‌మెట్‌లోని ఆ కుటుంబాలతో బుధవారం ఆర్డీవో మధుసూదన్, బీసీ సంక్షేమ అధికారి రాజన్న, తహసీల్దార్